
ISSN 0971-278X

జనవరి 2022 సంచిక : 444 వెల : 25/-

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక



జనసాహితి ప్రచురణ

కవిత

# బువ్వ నవ్వింది

- సాంబమూర్తి లండ

ఎట్టకేలకు బువ్వ నవ్వింది
పొలమూ నవ్వింది
ఢిల్లీ పొలిమేర నవ్వింది
ఏడాది సేద్యం తర్వాత
పిడికిళ్ల పంట చేతికందింది

జల ఫిరంగుల తలలు తెగిపడ్డాయి
నెత్తుటి అంచుల బారికేడ్లు
పోరాట ఉధృతిలో కొట్టుకుపోయాయి
కందకాలు తవ్వించిన చేతులు
లెంపలేసుకున్నాయి
ఉన్మాదంతో రెచ్చిపోయిన లాఠీలూ
పాపం ముఖం చెల్లక తలొంచుకున్నాయి

ఒకప్పుడు
ప్రతి గింజా చెమట వాసనేసేది
కొన్నేళ్లుగా కన్నీటి వాసనేస్తోంది
ఏడాదిగా అయితే, నెత్తుటి వాసన!
తొలిసారిగా ఇవ్వాళే
బువ్వ.. గెలుపు వాసనేస్తోంది

చాన్నాళ్ళ తర్వాత
గట్టి వానజల్లు కురిసింది
అచ్చు పుస్తకంలో
నాగలి పట్టుకున్న రైతు బొమ్మ
ఈ దేశ పటంలా వుంది
భగత్‌సింగ్ చిత్రపటం సరసన
నాకిప్పుడు విజయగీతం పాడుతున్న
రైతు ముఖం కనబడుతోంది
దేశం ఇప్పుడు కొత్తగా
1947 వాసనేస్తోంది

చేపనెత్తికెళ్లిన కొంగ
కొండ మీదికెళ్లాక తినబోతూ
మనసెందుకు మార్చుకున్నట్టు?
మట్టిని మట్టుబెట్టడానికి సిద్ధపడ్డ పులి
వెనుకడుగెందుకు వేసినట్టు?
కొంగ మరేదైనా దొంగ జపం మొదలెట్టిందా?
లేదూ, పులి మరో దారిని వెదుక్కుందా?

ఏదేమైనా
పోరాటానికి కొత్త చూపు తొడగాలిప్పుడు
వీచే గాలిని ఒడిసిపట్టి
ఎగురుతున్న జెండా పైకి మళ్లించాలిప్పుడు
రాలిపడ్డ ప్రతి గింజకూ విలువ దక్కాలి
పిడికిళ్ళప్పుడే దించేయొద్దు
1950 ఇంకా ముందుంది!

కవిత

# 'బాట'సారులు

- చలపాక ప్రకాశ్

ఎక్కడ పుట్టి, ఎక్కడ పెరిగి, ఎక్కడకేగి
అలసి సొలసి సేదతీరుతున్నవి ఈ దేహాలు?

సుడులు తిరుగుతున్న సుడిగుండాలు గుక్క తిప్పుకోనివ్వక-
అలలు అలలుగా పైకెగసి అల్లరిపాలు చెయ్యగా-
అడ్డదారులన్నీ రహదారులను చేసుకొని నడిచి నడిచి
ఎటు సాగుతోంది ఈ పయనం!
ఎక్కడికి చేరుతోంది ఈ గమ్యం!!
ఎటుపోతోంది ఈ కాలం?!!

వలవలా ఏడుస్తున్న చిన్నారికి కాపలా
గిలగిలా కొట్టుకుంటున్న సంసారి తెరచాపలా-
ఎటువెళుతున్నదో ఈ సంసార సాగరం
ఎటునడుపుతుందో ఈ అర్థం కాని ధైర్యం

కూటికోసం కూలికోసం స్వంత తల్లిని
స్వంత ఊరిని వదిలివచ్చిన ఏకాకి పక్షులు!
ప్రాంతాలు వేరైనా అక్కడా ఇక్కడా అని లేదు-
భవనాలు, వంతెనలెన్నో కట్టి బతుకుసాగరాన్ని
ఈ జాతికి అంకితమిచ్చిన నిరంతర 'బాట'సారులు!!
వలసపోయి.. అలసిపోయి
నడిరోడ్డుపై తిరగబడ్డ బ్రతుకు చిత్రాలు!!?

పడుతూ లెగుస్తూ
ఈ కాళ్ళూ చేతులు ఎటూ వెళితే అటు -
ఎటు దారి చూపితే అటు
సాగిపోయే గమ్యం తెలియని నావలు!
దాతలు విసిరే పొట్లాలతో సేదతీరుతూ..
జీవితాన్నంతటినీ ప్రతిసారీ ఆర్థాకలి కోరంటైన్‌లో పడవేస్తూ
వచ్చి బ్రతుకుతున్న స్వేచ్ఛలేని వలస కార్మికులు!
రైలు కూత సైరన్లతో -
అలుపెరుగక పరిగెత్తే నిరంతర 'బాట'సారులు!!

జనసాహితి ప్రచురణ

45 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

444

సంపుటి : 45
సంచిక : 4,5,6
నవంబర్, డిశంబర్ 2021
& జనవరి 2022

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | రైతాంగ ఉద్యమ చిత్రం | – అంతర్జాలం నుండి | .....01 |
| ✦ రెండవ అట్ట | : | ఆత్మ నిర్భరత (కవిత) | హిందీ : సంపత్ సరళ్; తెలుగు : వేములపల్లి రాధిక | .....02 |
| ✦ మూడవ అట్ట | : | కవితలు | – సాంబమూర్తి లండ; చలపాక ప్రకాశ్ | .....43 |
| ✦ నాల్గవ అట్ట | : | రైతుల చిత్రం | – అంతర్జాలం నుండి | .....44 |
| ✦ సంపాదకీయం | : | శ్రమజీవుల పోరాట సంస్కృతిని చాటిన రైతాంగ ఉద్యమం | | .....05 |
| ✦ కథలు | : | కరోనా దీపం ఉండగానే.... | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | .....07 |
| | : | కళ్ళు మూసి జెల్ల | – శంకరం | .....25 |
| ✦ చారిత్రక పత్రం | : | ఎందుకు మీరు మౌనంగా వున్నారు? | అనువాదం : కొత్తపల్లి రవిబాబు | .....11 |
| ✦ పుస్తక పరిచయం | : | ముల్కరాజ్ ఆనంద్ ఇంగ్లీషు నవల 'అంటరానివాడు' | పరిచయం : జి.వి. భద్రం | .....14 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | గౌరీ లంకేశ్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....22 |
| ✦ స్పందన | : | కదిలించిన 'జై భీమ్' సినిమా | – చెరుకూరి సత్యనారాయణ | .....23 |
| ✦ తీర్మానాలు | : | జనసాహితి కార్యవర్గ తీర్మానాలు | | .....27 |

✦ కవితలు : మంచికంటి (**10**); కంచరాన భుజంగరావు (**21**); సిరికి స్వామినాయుడు (**39**)

✦ వివిధ : ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**37**); సాహిత్య, సాంస్కృతిక సామాజికాంశాలు (**38, 39**) చైతన్యవాహిని (**40**); ఈ పుస్తకాలు అందాయి (**41**)

✦ శాశ్వతనిధి : చల్లా వెంకటరెడ్డి, సజ్జా నారాయణరావు, పాములపాటి జానకమ్మ (**04**); గోరంట్ల వెంకటేశ్వరరావు, కంఠంనేని రవీంద్రరావు, నందూరి రాఘవయ్య (**31**); పి. జీవరత్నం (**39**)

✦ సంతాపాలు : డా॥యం.వి. రమణారెడ్డి (**32**); సోనాల్ శుక్లా, జీతన్ మరాండీ, మండవ శ్రీరామమూర్తి (**33**); పి. సూర్యనారాయణ, పురాణం శ్రీనివాసశాస్త్రి, సురయా హసన్, పి.ఎల్. శ్రీనివాసరెడ్డి (**34**); జలజం సత్యనారాయణ, ఆలూరి లలిత, మనూ భండారీ (**35**); కర్నాటి రామమోహనరావు, వెనిగళ్ళ కోమల, ఎస్.ఆర్. భల్లం (**36**); డెస్మాండ్ టుటు (**40**)


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30-7-6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ఫ్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు

1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు విరాళాలు సేకరించండి.


– సంపాదకవర్గం

# చల్లా వెంకటరెడ్డిగారి 8వ వర్ధంతి



**26** జనవరి 2014న గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామంలో చల్లా వెంకటరెడ్డిగారు తన 85వ ఏట మరణించారు. వీరు 14 జనవరి 1930న జన్మించారు. సీతమ్మగారు తన భర్త వెంకటరెడ్డిగారి జ్ఞాపకంగా 'ప్రజాసాహితి'కి 25 వేల రూపాయల శాశ్వత నిధిని సమకూర్చారు. వీరికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు వున్నారు. పెద్దకొడుకు శివారెడ్డి 'ప్రజాసాహితి' శ్రేయోభిలాషి. చల్లా వెంకట రెడ్డిగారి 8వ వర్ధంతి సందర్భంగా వారిని 'ప్రజాసాహితి' గుర్తుచేసుకుంటోంది. ✦

# సజ్జా నారాయణరావుగారి 8వ వర్ధంతి



**12** జనవరి 2014న కృష్ణాజిల్లా నాగాయలంక గ్రామంలో సజ్జానారాయణరావుగారు తన 90వ ఏట మరణించారు. 1924లో జన్మించిన వీరు కమ్యూనిస్టు ఉద్యమ అభిమానిగా జీవించారు. వీరి భార్య సజ్జా సుబ్బమ్మగారు తన భర్త జ్ఞాపకంగా 'ప్రజాసాహితి'కి రూ.25 వేలు శాశ్వతనిధి సమకూర్చారు. వీరికి ఒక కూతురు. ఇద్దరు కొడుకులు. వీరి కుటుంబం 'ప్రజాసాహితి'ని ప్రారంభం నుండీ అభిమానిస్తుంది. నారాయణరావుగారి 8వ వర్ధంతి సందర్భంగా వారిని 'ప్రజాసాహితి' గుర్తు చేసుకుంటోంది. ✦

# పాములపాటి జానకమ్మగారి 5వ వర్ధంతి



**గుంటూరుజిల్లా** నిడమర్రుకు చెందిన కీ.శే. పాములపాటి గోపిరెడ్డిగారి భార్య జానకమ్మగారు 12-11-2016న తన 80వ ఏట మరణించారు.

జానకమ్మగారు గృహిణిగా వుంటూనే దేశ రాజకీయ, సాంఘిక పరిస్థితులను ఆకళింపు చేసుకునేవారు. ఆమె 'ప్రజాసాహితి' పత్రిక అభిమాని.

వీరి 2వ వర్ధంతి సందర్భంగా 12-11-2018న ఆమె కుమార్తె తాడిపర్తి శివమ్మ తన తల్లి జ్ఞాపకార్థం 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి ఇరవై ఐదు వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు.

జానకమ్మగారిని 5వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం. ✦

## సంపాదకీయం

# శ్రమజీవుల పోరాట సంస్కృతిని చాటిన రైతాంగ ఉద్యమం

**పెట్టుబళ్ళను** మించు – రెట్టింపు వడ్డీలు
జమచేసి వ్యాపారి – సడలగొట్టె
షేర్లు పినాల్టీలు – చెల్లింపు తిరుగుళ్ళు
కట్టించి బ్యాంకులు – కమలగొట్టె
ధాన్యంబులను తగ్గ – ధరలకు గైకొని
కొనుగోలు బేహారి – కుములగొట్టె
తికమకల్ కలిగించు – రకరకంబుల శిస్తు
విధియించి సర్కారు – విదలగొట్టె
ఇన్ని దెబ్బలు దిని మూల్గు – చున్న నిన్ను
బ్లాక్ మార్కెట్ల ధరలు పై – పైకి దుమికి
ప్రాణములు దీయ దబదబ – బాదుచుండ
రాల్చకుండునె కన్నీరు – రైతుబిడ్డ

ఇది 1923లో అప్పికట్లలో రైతు సంఘోద్యమానికి ఒక రూపం ఇవ్వటానికి జరిగిన ప్రప్రథమ రైతుసభలో ఇనగంటి పున్నయ్య చౌదరి 'రైతు కన్నీరు' అనే తన కావ్యం నుండి చదివిన పద్యం. ఆనాటి నుండి అధికార మార్పిడి జరిగి 75 సం॥లు గడిచిన ఈనాటికీ రైతాంగం పరిస్థితులు మరింతగా దిగజారాయి తప్ప వారి జీవితాల్లో మార్పేమీ లేదన్నది విదితమే.

"పంటలు కోసిన చేతులు
పస్తులు చూసిన పేగులు
ఆశలు మింగిన చూపులు
దయాదాక్షిణ్యాలు కోరక" నేరుగా వ్యవసాయాన్ని కార్పొరేట్లకు విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే మూడు వ్యవసాయ చట్టాల రద్దుకై ఉద్యమించాయి. రైతాంగం ఆ చట్టాలను రద్దు చేయించగలిగింది. "ఎట్టకేలకు బువ్వ నవ్వింది / పొలమూ నవ్వింది / ఢిల్లీ పొలిమేర నవ్వింది / ఏడాది సేద్యం తర్వాత / పిడికిళ్ళ పంట చేతికొచ్చింది". అది నోటిదాకా రావాలంటే నిరంతరాయ పోరాటం తప్పదంటోంది.

పంజాబు, హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, రాజస్థాన్ మొదలగు రాష్ట్రాల నుండి వచ్చిన స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ వారు "సిక్కుల్లో, జాట్లో, ఠాకూర్లో, ముస్లిములో / వేరుపర్చిన విత్తనాలన్నీ / ఒకే పంటై మొలిచాయి". ఢిల్లీ శివార్లలోని సింఘు, టిక్రీ, ఘాజీపూర్, షహజాన్‌పూర్‌లలో శిబిరాలను ఏర్పాటు చేసుకున్నారు. 45కి పైగా రైతు సంఘాలు 'సంయుక్త కిసాన్ మోర్చా'గా ఏర్పడి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో తరతమ స్థాయిలో సంఘీభావ ఉద్యమాన్ని నడిపారు. ఒకే తాటిపై నిలచిన రైతాంగం ఎండనక, వాననక, ఎముకలు కొరికే చలిలో, కరోనా పంజా నుండి తప్పించు కుంటూ పాలకులు వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నాలను ముక్తకంఠంతో ప్రశ్నించాయి. రైతులు సమష్టి జీవన విధానంతో, శ్రమైక జీవనసంస్కృతితో సంఘటితమయ్యారు. పెరిగిన జీవనవ్యయం అడుగంటిన ఉపాధి అవకాశాలతో దుర్భరమైన, అస్తవ్యస్థమైన జీవితాలు గడుపుతున్న పీడితవర్గ ప్రజలకు ఈ రైతాంగ ఉద్యమం ఉద్యమస్ఫూర్తిని, పోరాట సంస్కృతిని అందించింది.

కరోనా కల్లోల కాలంలో ప్రజలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడు తుండగా మోదీ, షాల ప్రభుత్వం 2020 జూన్‌లో హడావుడిగా వ్యవసాయ రంగానికి చెందిన ఆర్డినెన్స్‌లు తీసుకువచ్చింది. వెంటనే రైతుసంఘాలు అభ్యంతరాలు తెలియచేశాయి. వాటిని పట్టించుకోకుండా, చట్టసభలలో చర్చించకుండా, ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా మోదీ ప్రభుత్వం బిల్లులనూ, వెనువెంటనే చట్టాలను చేసింది. "కొత్త చట్టాలు రైతును – పెట్టుబడికి నంజిపెడితే / ఈ రూపాయికి అన్నం దొరకదని" రైతాంగం తమ నిరసనలను తెలియచేసింది. మోదీ, షాలు రైతాంగాన్ని మభ్యపెట్టటానికి రకరకాలుగా ప్రయత్నించారు. రైతాంగ ప్రదర్శన కారులపై బాష్పవాయువును, జలఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జీలు చేశారు. పోలీసు కాల్పులు జరిపారు. రిపబ్లిక్ దినోత్సవమైన జనవరి 26న జరిగిన ట్రాక్టర్ల పెరేడ్‌లోకి తమ 'కాషాయ' మూకను దింపి, ఢిల్లీ ఎర్రకోటపై ఆకుపచ్చ జెండానెగరేయించి ఈ ఉద్యమంలో ఖలిస్థాను లున్నారనీ, ఉగ్రవాద చర్యగా దుష్ప్రచారం చేశారు. అంతేగాక 'తుకడే తుకడే గ్యాంగ్'లంటూ రైతాంగాన్ని విచ్ఛిన్నకారులుగా ప్రచారం చేశారు. ప్రధాన స్రవంతి మీడియాతో వంత పాడించారు. రైతాంగం రాకపోకల్ని అడ్డుకోవటానికి కందకాలు తవ్వించారు. ట్రాక్టర్లకు అవరోధంగా రోడ్లపై మేకులు కొట్టించారు. లఖింపూర్ ఖేరీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కొడుకు అశిష్ మిశ్రా శాంతియుతంగా నిరసన తెలియచేస్తూన్న రైతాంగాన్ని కార్లతో తొక్కించాడు. నలుగురు రైతులతోపాటు ఒక జర్నలిస్టు ఆ సంఘటనలో మరణించారు. ఈ ఉద్యమ సమయంలో ఏడువందలమందికి పైగా రైతాంగం అమరులయ్యారు. వేలమంది రైతుల మీద రాజద్రోహం కేసులు పెట్టారు. అరెస్టులు చేశారు. రైతాంగ ఉద్యమానికి సంఘీభావం తెలియచేసిన సామాజిక కార్యకర్తలనూ అరెస్టు చేశారు. ఇన్ని రకాల నిర్బంధాలను ప్రయోగిస్తూనే పాలకులు, రైతాంగంతో పదకొండుసార్లు బూటకపు చర్చలూ నిర్వహించారు.

"కారడవిలో దారులు వెతుకుతారని
పెనుతుపానుకు ఎదురీదుతారని

అంతులేని అగాథాలను అమాంతంగా దాటుతారని
నిప్పు అని తెలిసీ పట్టుకుంటారని
ఏనాడైనా అనుకున్నామా?
వినడమే తప్ప కళ్ళారా చూసామా?
ఇప్పుడదే జరుగుతుంది".

భారత రైతాంగం పాలకుల నిర్బంధాలను, అణచివేతలను ఎదుర్కొంటూ అనేక రూపాలలో ఉద్యమించింది. రైతులు శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేశారు. జలఫిరంగులు ప్రయోగించిన పోలీసులను పిలిచి బువ్వ పెట్టారు. ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని ఎదుర్కోవటానికి రైతాంగం ఢిల్లీ శివార్లలో శిబిరాలను ఏర్పాటు చేసుకున్నారు. పాలకులు రోడ్లపై మేకులు కొట్టిస్తే వీరు మొక్కలు నాటారు, డివైడర్లపై కూరగాయలు పండించారు. చర్చల సందర్భంలో పాలకులు తమ నిర్ణయంలో మార్పు లేదూ అంటే – మా నిర్ణయంలోనూ మార్పు లేదంటూ మౌనదీక్షలు చేశారు. 'మన్‌కీబాత్' సమయంలో పళ్ళాలు మోగించి తమ నిరసనలు తెలియచేశారు. దేశంలోని ప్రతి గ్రామానికి రైతాంగ ఉద్యమ లక్ష్యాలను తీసుకెళ్ళటానికి భారత్‌బంద్‌లతో పాటు గ్రామీణ బంద్‌లు నిర్వహించారు. ఈ ఆందోళనా క్రమంలో భాగంగా తమ వార్తలను ప్రధాన మీడియా బహిష్కరించగా, తామే ఒక బులిటెన్‌ను ప్రచురించారు. గ్రంథాలయాలు ఏర్పరచుకున్నారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించుకున్నారు. ట్రాలీ టాకీస్‌లో పంజాబీ ప్రగతిశీల చిత్రాలను ప్రదర్శించారు. ప్రసిద్ధ సినిమా నటులు, గాయకులు, కళాకారులు వీరికి మద్ధతు తెలియచేశారు. రైతులు అశువుగా తమ సమస్యలపై పాటలు కట్టుకుని పాడుకున్నారు. 'కిసాన్ గీతా'న్ని రాసుకుని 11 మంది గాయకులు పాడారు. తమ ఆందోళనలను వీడియోలుగా విడుదల చేశారు. మహిళా కళాకారుల బృందం పంజాబ్ గ్రామాల్లో 51 ప్రదర్శనలిచ్చి శిబిరాలకు చేరింది. 'ఆజాద్‌రంగ్ మంచ్' అనే కళాకారుల బృందం ఏర్పడింది. కళాకారుల దినోత్సవం జరుపుకున్నారు. చలిమంటలలో వ్యవసాయ చట్టాల ప్రతులను తగులబెట్టి చలి కాచుకున్నారు. పెరిగిన గ్యాస్, పెట్రోలు ధరలు తగ్గించాలని, కార్మిక చట్టాలను కుదిస్తూ చేసిన నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం చేసిన కార్యక్రమాలకు సంఘీభావం తెలియచేశారు. 'కార్పొరేట్లులారా! వ్యవసాయం నుండి వైదొలగమని' 'మాక్ పార్లమెంట్'ను నిర్వహించారు. లోక్‌సభకు సత్యాగ్రహ యాత్ర చేశారు. 'లా వాపస్ అయితేనే ఘర్ వాపస్' అని తేల్చి చెప్పారు.

'భూమి ఉంటే గదా పొయ్యి వెలిగించేది' అంటూ మహిళలూ ఈ ఉద్యమంలో అనుచరులుగా గాక భాగస్వాములుగా పాల్గొన్నారు. గ్రామాల్లో వుండి వ్యవసాయ పనులు చేసుకుంటూ రైతాంగ ఉద్యమానికి కావల్సిన అవసరాలు చూశారు. ఆ, ఆ రాష్ట్రాలలోనూ, ఢిల్లీ శిబిరాల వద్ద జరిగిన కార్యక్రమాలన్నింటిలో ముందుభాగాన నిలబడ్డారు. బహిరంగంగా మాట్లాడటానికి సిగ్గుపడే మహిళలు ధైర్యంగా ఉపన్యాసాలిచ్చారు. ట్రాక్టర్లు నడిపారు. సామూహిక వంటశాలలో పురుషులు వంట చేస్తుంటే మహిళలు ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారతదేశ ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. బాబ్డే 'మహిళలను, పిల్లలను, వృద్ధులను ఇళ్ళకు వెళ్ళమని' ఆదేశిస్తే దాన్ని తిప్పికొడుతూ 'మహిళా కిసాన్ దివస్'ను నిర్వహించారు. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళాపోరాట దినాన్ని జరుపుకున్నారు. కుల, మత, ప్రాంత, లింగ భేదాలు లేకుండా అందరూ కలసికట్టుగా మూడు చట్టాల రద్దే ఏక లక్ష్యంగా రైతాంగ ఉద్యమం సాగటంలో మహిళలు మొక్కవోని ధైర్యంతో నిలబడ్డారు.

'ధనస్వాములపట్ల వల్లమాలిన ప్రేమ కురిపించే / కల్ల పాలకులపై / గొంతెత్తి నినదించే ప్రజాస్వరాలే / నల్లచట్టాల పాలిట భాస్వరాలు' అయినందునే మోదీకి చట్టాల రద్దు ప్రకటన చేయక తప్పలేదు. ఈ మూడు చట్టాల రద్దు ప్రకటన సందర్భంగా మోదీ చేసిన క్షమాపణల ప్రసంగంలో మూడు చట్టాలూ మంచివేననీ, రైతాంగమే అర్థం చేసుకోలేదని చెప్పటమంటే ప్రజల కోసం రైతాంగ ప్రయోజనాల కోసం కాక మరేవో ప్రయోజనాల కోసమే, ఈ చట్టాలను తీసుకువచ్చినంత హడావుడిగా అప్రజాస్వామికంగా రద్దు చేశారని తేటతెల్లం అవుతుంది. ఒకవైపు మూడు చట్టాల రద్దుకోసం రైతాంగం పోరాడుతూ వుండగానే మరోవైపు ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ఈ చట్టాలలోని అంశాలను అమలుపరుస్తూండటం పాలకుల కపటత్వాన్ని తెలియచేస్తుంది.

మనదేశ సహజ వనరులను, శ్రమ సంపదలను దేశ, విదేశీ పెట్టుబడిదార్లకు, బహుళజాతి సంస్థలకూ దోచిపెడ్తున్నట్లే భూమిని రైతు నుండి గుంజుకొని దోచిపెట్టటానికే ఈ నల్లచట్టాలన్నది రైతాంగం, ప్రజలూ గ్రహించారు. ఇప్పటికే ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలూ, కంపెనీల పేరుతో, వాన్‌పిక్‌లూ, సెజ్‌ల పేర్లతో బలవంతంగా భూముల్ని గుంజుకుంటున్నారు. రైతాంగమూ, ప్రజలూ ఈ విధానాలను ప్రతిఘటిస్తూ ఉద్యమిస్తూనే వున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో సామ్రాజ్యవాద దోపిడీ పెత్తనాలను కూలగొట్టి భూమిపై కష్టించే రైతాంగం, భూమిపై తమ పూర్తి హక్కును సాధించుకున్నప్పుడే నిజమైన ప్రజాతంత్ర సమాజం నిర్మాణమవుతుందనే దిశగా ఈ ఉద్యమాలు పదునెక్కాలి. సంతాల్, మోక్లా, రంప, ఆంధ్ర రైతు రక్షణ యాత్ర, వర్లీ, తెభాగ, తెలంగాణ, నక్సల్బరీ, శ్రీకాకుళం, కొండమొదలు, సిరిసిల్లా, జగిత్యాల, దుగ్గేరు..... తదితర పోరాటాలన్నీ తరతమ స్థాయిల్లో భూమిపై హక్కు కోసం జరిపిన పోరాటాలే.

'మేక్ ఇన్ ఇండియా', 'బేటీ బచావో', 'ఆత్మనిర్భర భారత్' వంటి నినాదాలతో విదేశీ బహుళజాతి సంస్థలకు బడా కార్పొరేట్లకు దళారీలుగా పాలకులు అనుసరిస్తూన్న రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపట్ల "ఇప్పుడు అక్షరాలను / చెకుముకి రాళ్ళుగా చేసేపనిలో నిమగ్నమయి" రచయితలూ కళాకారులూ వుండాలని జనసాహితి పిలుపునిస్తూంది.

**27-12-2021** ✦

# కరోనా దీపం ఉండగానే....

- ఐ.టి.ఆర్.వి. శివాజీరావు

**రాంబాబు** బండి తీసి స్టార్ట్ చెయ్యబోతూ "సీతా! డాక్టర్‌గారు చూసావా నన్నేమన్నారో", అన్నాడు కించిత్ గర్వంగా.

అర్థం కాని సీత "ఏమన్నారండీ?" అని అడిగింది.

"వినలేదేం.. అక్కడే ఉన్నావుగా"

"అబ్బా! ఆయన మిమ్మల్ని చాలా అన్నారు. అందులో దేనిగురించో.. మీరు చెప్పందే నాకెలా తెలుస్తుంది"

" 'మీరు డాక్టరా' అని అడిగారు. గుర్తులేదా"

"ఓ యబ్బో! అందుకేనేమిటి బయటికి వచ్చిన దగ్గర్నుంచి అంతలా మురిసిపోతున్నారు. రాంబాబు ఎంబిబిఎస్‌గారు",

"............"

"మీరు వాడిన మందుల చిట్టా ఎవరి ముందు పడేసినా ముందు మిమ్మల్ని డాక్టర్ అనే అనుకుంటారు. తీరా డాక్టర్ కాదని తెలిసిన తర్వాత ఆయన అంటినట్టే మీ తలంటి గాని వదిలిపెట్టరు"

చిన్న గుండు సూది గుచ్చి పాపం రాంబాబు గాలి తీసేసింది సీత.

రాంబాబుకి తానెక్కిన సింహాసనం ఇంత త్వరగా దిగిపోవడం ఇష్టం లేదు. 'రేపట్నుంచి తాను సలహాలివ్వకపోతే ఊళ్లో కరోనా పేషెంట్లకు దిక్కెవరు..' అనుకున్నాడు మనసులో.

అతని మనసులో మాట గ్రహించిందో ఏమో సీత

"ఇదిగో.. రేపటి నుండి ఏ పనీ లేకపోతే ఖాళీగా కూర్చోండి.. లేదంటే ఏదో ఒక పని కల్పించుకోండి... అంతేగాని ఈ సలహాలు సింగి నాదాలు వద్దు.

నే చెప్పిన మాట వినండి. ఈ సలహాలిచ్చే ఎడ్వైజరీ బోర్డు నుంచి రిజైన్ చేసి ఇందాక డాక్టర్‌గారు సమాజాన్ని చదవమన్నారు గుర్తులేదా.. ఆ పనిలో ఉండండి",

చదువులో ఎమ్మే, బియిడి పట్టాలు సాధించి ఎంతోమందికి చదువు చెబుతున్న రాంబాబుకి, చదువులో డిగ్రీ మాత్రమే చేసి వంటింట్లో వంట చేసుకునే సీత సలహా ఇవ్వగానే అహం దెబ్బతింది. దాంతో పౌరుషం తన్నుకొచ్చింది

"నేను ఎమ్మే బీఈడీ చేశాను. సమాజం గురించి ఆ మాత్రం నాకు తెలీదంటావా", ఉక్రోషంగా అన్నాడు.

"తెలీకేం! మీకు సమాజం గురించి మా బాగా తెలుసు. తెలీదు అని ఎవరన్నారు! కాకపోతే మీరు ఇప్పుడు సమాజాన్ని సోషల్ మీడియా కళ్ళద్దాల ద్వారా దర్శిస్తున్నారు. అదే వచ్చిన చిక్కు. అందులో ఒక పోస్టింగ్ పెట్టడం దానికి ఎన్ని లైకులొచ్చాయో మాటిమాటికి

కథ

చూసుకోవడం. లైకులు వెయ్యని వాళ్లని టేస్ట్ లెస్ ఫెలోస్ అని తిట్టుకోవడం. మీ పాండిత్య ప్రకర్షలకూ, మీ మేధో కండూతి తీర్చుకోవడానికి అదొక వేదిక. ఎవ్వరైనా మీ పోస్టింగ్‌కి వ్యతిరేకంగా మాట్లాడారా వెంటనే మీ అమ్ములపొదిలో ఉన్న ఆయుధాలన్నీ తీసి పోరాడతారు. పడక్కుర్చీ నుండి లేవనక్కర లేకుండా ఉదయం నుంచి సాయంత్రం విసుగొచ్చేవరకూ ప్రపంచ యుద్ధాలు చేసేసుకోవచ్చు".

"సీతా!",

అతను అరిచిన అరుపుకి సీత ఉలిక్కి పడింది. తేరుకుని.... కంగారుగా

"ఏమైందండీ", అని అడిగింది.

"అప్పుడప్పుడూ మహిళా సంఘం మీటింగులకెళ్ళినంత మాత్రాన అన్నీ తెలుసునని అనుకోకు. సోషల్ మీడియా గురించి నీకేం తెలుసని విమర్శిస్తున్నావు. అంటే నన్ను అనుగాని సోషల్ మీడియాని విమర్శించకు. ఈరోజు గొప్ప గొప్ప ఉద్యమాలన్నీ సోషల్ మీడియా వేదికగానే జరుగుతున్నాయి. చూస్తూ ఉండు రానున్న కాలంలో సోషల్ మీడియా ఎన్నెన్ని విప్లవాలని సృష్టిస్తుందో",

"శ్రీవారికి బాగా కోపం వచ్చినట్టుందే! మహిళా సంఘం మీటింగులకు వెళ్ళడం వల్లనే నాకు చాలా విషయాలు తెలిసాయని తెలుసుకున్నారే. మీరు కనీసం మీ టీచర్ల మీటింగులకు కూడా వెళ్ళరాయె. అటుక్కోడిలా ఇంట్లోనే కూర్చుంటారు సెల్ పట్టుకొని. ఇక సోషల్ మీడియా విప్లవాలంటారా అవి పుబ్బలో పుట్టి మఖలో మాడిపోతాయి. ఎందుకంటే అవి మీలాంటి మహానుభావుల సృష్టి కనుక. సామాన్యులకు చేరని ఏ ఉద్యమమైనా ఇంతే",

రాంబాబు పూనకం వచ్చిన వాడిలా "సోషల్ ....మీడియాకు ఈ ప్రపంచాన్ని ..మార్చేశక్తి ..ఉంది",

గట్టిగా ఒత్తి ఒత్తి పలుకుతూ ఆకాశం వైపు చూశాడు.

"ఇదేమీ మహాభారతం టీవీ సీరియల్ కాదు భీష్ముడు ప్రతిజ్ఞ చేయగానే ఆకాశంలో ఉరుములు మెరుపులు రావడానికి! ముందుకు చూసి నడపండి, పద్దామంటే మన బుర్రల మీద ఉరుములు మెరుపులు రావడం ఖాయం! దానితో బాటు కాలో చెయ్యో విరిగితే మళ్ళా వచ్చిన దారినే వెనక్కి పోవాలి", అంటించాల్సిన రీతిలో అంటించింది సీత.

"వెనక్కెందుకూ", అమాయకంగా అడిగాడు.

"ఎందుకా! డాక్టర్‌గారి దగ్గర దెబ్బలకు కట్లు కట్టించుకొని మళ్ళా నాలుగు మొట్టికాయలు తినడానికి", అంది సీత నవ్వాపుకుంటూ.

"టాపిక్ డైవర్ట్ చెయ్యకు. నేనన్నది నిజమా కాదా. భేషజానికి పోకుండా ఒప్పుకో", సీత ఎలాగైనా ఒప్పుకుంటే బాగుండని ఆశగా అడిగాడు రాంబాబు.

కానీ ఆమెలో స్పందన లేకపోయేసరికి ఆ అజ్ఞానిని మరోసారి విజ్ఞానవంతం చేసే ప్రయత్నం మొదలుపెట్టాడు రాంబాబు.

"నీకు తెలీదుగానీ సీతా అసలు సోషల్ మీడియా ఫాలో అయితే ఎంతెంత నాలెడ్జి వస్తుందనుకున్నావు. మనం ఎప్పటికప్పుడు అప్ డేట్ కావడానికి సోషల్ మీడియాను మించిన ప్లాట్ ఫాం లేదు. మెయిన్ స్ట్రీమ్ మీడియా చెయ్యని పని సోషల్ మీడియా చేస్తోంది...."

ఊపిరి తీసుకోవడానికన్నట్టు ఆగాడు.

"మీరు ఎన్నైనా చెప్పండి ఇల్లు కదలకుండా ఒళ్ళు అలవకుండా చేసే ఉద్యమాలు ఎర్ర ఏగానీ పాటి విలువ చెయ్యవు. అయితే ఒక ప్రభావం పడెయ్యడం వరకే సోషల్ మీడియా పాత్ర. అది అక్కడే ఆగిపోతే..... అన్నట్టు ఏ విలువా ఉండదు.

ఈ కరోనాలోనే చూడండి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో కోట్లాది వలస కూలీలు రోడ్డున పడ్డారు. వాళ్ళ పాదాలనుంచి కారిన రక్తంతో రోడ్లు తడిచి పోయాయి. అలాంటప్పుడు ఈ సోషల్ మీడియా ఉద్యమాలు ఏమయ్యాయి.

ఆ వీడియోలు చూసిన వాట్సప్ వీరులంతా ఏసి రూముల్లో కూర్చొని బిర్యానీలు తింటూ నిట్టూర్పులు నిట్టూర్చి, ముక్కులు చీది తమకొచ్చిన పోస్టింగ్‌లకు దిగువన 'సాధ్యమైనంత మందికి షేర్ చెయ్యండి' అని కేప్షన్ తగిలించి అంతటితో తమ బాధ్యత తీరిపోయిందన్నట్టు మిన్నకున్నారు. అంతేనా!", అని సీత సూటిగా అడిగేసరికి రాంబాబు సమాధానం చెప్పలేకపోయాడు.

★ ★ ★ ★

ఆ మర్నాడు తెల్లవారి లేచిన వెంటనే రాంబాబుకి సంచి, సరుకుల లిస్టు చేతికిచ్చింది సీత.

"బిగ్ బాస్కెట్‌కి ఫోన్ చేస్తే తెచ్చేస్తాడు కదా సీతా",

"అవునండీ శ్రీవారూ! బిగ్ బాస్కెట్ వాడు సరుకులూ, స్విగ్గీ, జొమాటోవాళ్ళు టిఫిన్లూ తెచ్చేస్తే మీరు వాట్సప్ ఫేస్బుక్‌ల్లో ఖడ్గప్రహారాలు, శూల ఛాలనాలూ చేస్తారా! ఈ ఒక్కరోజుకీ అస్త్రసన్యాసం చేసి రోడ్డుమీదకెళ్ళండి. మీ వాట్సప్ యూనివర్శిటీ కొచ్చిన ప్రమాదం ఏమీలేదు", అంది నవ్వుతూ సీత.

ముందురోజు తమ మధ్య జరిగిన చర్చ గుర్తుకొచ్చింది రాంబాబుకి, తను కూడా నవ్వేశాడు.

గబగబా బట్టలేసుకొని సీత ఇచ్చిన సంచి, సరుకులు లిస్టు తీసుకుని బయటపడ్డాడు రాంబాబు. బండి కూడా తియ్యకుండా నడక మొదలెట్టాడు. నడకతో బాటు ఆలోచనలు రాత్రి సీతకి తనకూ జరిగిన చర్చవైపు మళ్ళాయి.

"సీత అన్న దాంట్లో పాయింట్ ఉంది. వాట్సప్, ఫేస్బుక్‌లలో టన్నులకొద్దీ సమాచారం పోగుపడుతోంది. కానీ ఒక డ్రైవ్ అంటూ ఉండటంలేదు. ఆ పాడి సమాచారాన్ని చదివినవాళ్ళు గింజలు తిని గింజలు పెట్టిన కోళ్ళ మాదిరిగా తయారవుతున్నారు తప్ప విచక్షణని ఉపయోగించగల సమయమూ ఉండటంలేదు, ఓపికా ఉండటంలేదు. ఫార్వర్డ్ చేస్తున్న మెసేజ్‌లు ఇట్నించి పంపేవాళ్ళు, అట్నించి ఎమోజీలు, లైకులు పెట్టేవాళ్ళు పూర్తిగా చదువుతారో లేదో కూడా డౌటే! ఎవరూ పెట్టక మందే ఆ వీడియోలనీ వార్తలనీ మనమే ముందు పెట్టెయ్యాలనే అత్రుత, కంగారూ – అందరూ తననే మెచ్చుకోవాలనే తపన – రోజంతా వీటికోసమే పడిగాపులు. ఒక పోస్టింగ్ పెట్టిన తర్వాత నిముషనిముషానికీ దానిని ఎంతమంది చూశారో అని చెక్ చేసుకోవడం, ఎవరూ చూడకపోతే చూడలేదని, చూస్తే స్పందించలేదని, ఒకవేళ స్పందిస్తే సరిగా స్పందించలేదని, మొన్న పలానా వాడి ఫోస్టింగ్‌ను లైక్ చేస్తూ పది ఎమోజీలు పెడితే ఆ వెధవ ఒక్క దానితోనే సరిపెట్టాడని తిట్టుకోవడం.. దీనిలో పడి ఏదో సామాజిక సేవ చేసేస్తున్నామని భ్రమలు పడడం.. ఎటు కొట్టుకుపోతున్నాం.. ఇదంతా ఏ మానసిక రుగ్మతలకో దారి తియ్యదు కదా.." ఒక్కసారి తల విదుల్చుకున్నాడు రాంబాబు.

ఆలోచనల్లోనే తన వీధి దాటి మెయిన్ రోడ్లోకొచ్చేశాడు రాంబాబు. ఈ లాక్‌డౌన్ సమయంలో చాలా తక్కువసార్లే బయటికొచ్చాడు తప్ప దాదాపు ఇంట్లోనే గడిపేశాడు. అందుకే రోడ్డుమీద నడుస్తుంటే అంతా కొత్తగా ఉంది. అనుకోకుండా గోడమీద ఉన్న అడ్వర్టైజ్‌మెంట్ ఆకర్షించింది రాంబాబుని. ఆకర్షణీయమైన రంగులతో ఉన్న ఆ అడ్వర్టైజ్‌మెంట్ ఓ పెయింట్లమ్మే కంపెనీకి సంబంధించినది. పైనున్న కేప్షన్ చూసి ఆశ్చర్యపోయాడతను.

'మీ ఇంటిని కరోనా ఫ్రీ చేసుకోండి. మా పెయింట్స్ మీ ఇంటి గోడలపై ఉన్న కరోనాని తక్షణం నాశనం చేసే విధంగా కెమికల్స్‌తో తయారు చేయబడ్డాయి'.

అదే కాదు ఆ గోడమీద ఉన్న ప్రతీ అడ్వర్టైజ్‌మెంటూ 'మా ప్రొడక్ట్ కరోనాని సర్వనాశనం చేస్తుంది, మా ప్రొడక్ట్ కరోనాని దుంపనాశనం చేస్తుంది', అని చెబుతున్నవే.

"తెలివైన వ్యాపారం అంటే వీళ్ళదే, ఒక పక్క జనానికి కరోనా అంటే ఉన్న భయాన్ని బలహీనతగా మార్చి దానిని క్యాష్ చేసుకోవడం వీళ్ళకు తెలిసినంతగా మరెవరికీ తెలీదు", మనసులో అనుకున్నాడు రాంబాబు.

తను గతంలో పచారీ సామాన్లు తీసుకునే కిరాణాకొట్టు ముందునుంచి వెళుతూ యధాలాపంగా ఆ షాపు వైపు చూశాడు రాంబాబు.

ఆ షాపతను రాంబాబు వైపు చూసి జీవంలేని నవ్వొకటి నవ్వాడు.

రాంబాబుకి ఆ నవ్వు చూడగానే ఎందుకో గుండెల్లో కలుక్కుమంది. తను కూడా అర్థం లేని ఓ వెర్రి నవ్వు పడేసి ముందుకు నడిచాడు.

గతంలో కిరాణా సామాన్లన్నీ అక్కడే తీసుకునేవాడు తను. ఈ ఊరికి షాపింగ్‌మాల్ వచ్చిన దగ్గర్నుండీ అతని దగ్గర తీసుకోవడం మానేశాడు. మాల్‌లో చవకగా దొరకడమే కాకుండా వస్తువులన్నీ ఫ్రెష్‌గా కూడా ఉంటున్నాయి. ఒక్కోసారి ఒక్కో సరుకు మీద ఆఫర్లతో డబ్బులు కూడా ఆదా అవుతున్నాయి.

మాల్లోకి అడుగు పెడుతూనే ఒకటి గమనించాడు రాంబాబు. షెల్ఫ్‌లన్నీ కూడా కరోనాకు సంబంధించిన వస్తువులతో నిండి పోయాయి. శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు, హెడ్ షీల్డులు వంటి వాటితో ర్యాక్‌లు నిండిపోయి అదొక ఎగ్జిబిషన్‌లా ఉంది. గోడ మీద చూసిన అడ్వర్టైజ్‌మెంట్లు గుర్తొచ్చాయి రాంబాబుకి.

ఆ షాపింగ్ మాల్‌లోకి వెళుతున్న వాళ్ళని అక్కడున్న సేల్స్ బాయ్స్ ప్రత్యేకంగా కరోనాకు సంబంధించిన వస్తు సముదాయం వైపుకి తీసుకు వెళుతున్నారు.

రాంబాబుని కూడా ఒక్కసారి చూడమంటూ సేల్స్ మేన్ తీసుకు వెళ్ళాడు.

ఒక రాక్ దగ్గరకు తీసుకెళ్ళి అక్కడున్న సేల్స్‌మేన్‌కి" సార్‌కి కరోనా మెటీరియల్ అంతా చూపించు", అని వెళ్ళిపోయాడు.

పైనుంచి ఒక ప్యాకెట్ తీసి రాంబాబు ముందు పడేశాడు.

"సర్! ఇది 'స్టే క్లీన్ అండ్ బి ఫెయిర్' కరోనా క్రీమ్ సర్. దీని వల్ల రెండు లాభాలు సర్!"

నోరు తెరుచుకొని ఉండిపోయిన రాంబాబు మరింత ఉత్సాహం కల్గించాడా సేల్స్‌బాయ్‌కి

"ఇది రాసుకుంటే నాలుగు వారాల్లో మీ మొహంపై చర్మం ఫెయిర్ అవడమే కాకుండా ఇది రాసుకున్నచోట కరోనా క్రిములు పడితే చనిపోతాయి సర్!"

"డబుల్ ధమాకా అన్నమాట"

"యస్ సర్!"

మరో చోట రకరకాల శానిటైజర్లు చూపించాడు అక్కడి సేల్స్‌బాయ్

"సర్! ఇది చేతులకు రాసుకునే శానిటైజర్ సర్, ఇది కూరగాయలు కడుక్కునే శానిటైజర్, ఇది చికెన్, మటన్ క్లీన్ చేసుకునే శానిటైజర్ సర్, ఇదీ......

మరోచోట కరోనా ఫ్లోర్ క్లీనర్స్, కరోనా టాయిలెట్ క్లీనర్స్, షెల్ఫ్ క్లీనర్స్ ఇంకో చోట కరోనా సబ్బులు, కరోనా రూమ్ స్ప్రేయర్లు ఇవన్నీ కరోనాని సమూల సమాధి చేస్తాయట.

కొన్నాళ్ళుపోతే డైరెక్టగా ఊపిరితిత్తులను, పేగుల్ని క్లీన్ చేసే శానిటైజర్లు, కిడ్నీలు కడుక్కునే యాసిడ్లు దించేస్తారేమో అనిపించింది రాంబాబుకి.

"ఆవు మూత్రం తాగి ఇల్లంతా పేడ పూసుకుంటే కరోనా రాదని సంప్రదాయవాదులు, ఇవన్నీ కొనుక్కుని ఇల్లూ, ఒళ్ళూ గుల్ల చేసుకుంటే కరోనా రాదని ఈ ఆధునిక మార్కెట్టనంతరవాదులు, కరోనా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే కార్యక్రమంలో తల మునకలై ఉన్నారంతా!", మనసులో అనుకొని పైకి నిట్టూర్చాడు రాంబాబు.

ఇంక ముందుకెళ్ళే ధైర్యం చెయ్యలేక పోయాడు.

వెనక్కి వెళ్ళిపోతున్న రాంబాబుని పలకరించాడో సేల్స్ మేన్

"సార్! గ్రోసరీస్ సెక్షన్ అటు"

"అవునయ్యా! నేను అడిగిన సరుకులు లేవట"

ఆశ్చర్యంగా "అదేంటి సార్! లేకపోవడ మేంటి. మీకు కావలసిన సరుకులేంటి?"

"మీ దగ్గర కరోనా కందిపప్పు లేదట కదా",

"కరోనా కంది పప్పేంటి సార్!", ఈసారి ఇంకా ఆశ్చర్యంగా అడిగాడు ఆ సేల్స్‌బాయ్.

"అదేనమ్మా! అది తింటే కడుపులో చేరిన కరోనా పోతుందట కదా ఆ కందిపప్పు కావాలి. అలాగే కరోనా మినపప్పు, కరోనా బియ్యం, కరోనా ఉప్పు కావాలి. ఇంతేకాదు ఏ ఐటమ్ కొన్నా దాని ముందో వెనుకో కరోనా ఉండాలి",

ఆ సేల్స్‌బాయ్ బుర్ర గోక్కుని "ప్రస్తుతానికి అవి ఇంకా రాలేదు సార్! రిసెప్షన్‌లో మీ ఫోన్ నెంబర్ ఇచ్చి వెళ్లండి. ఒకవేళ వస్తే ఫోన్ చేస్తాం", అన్నాడు.

"అలాగే! ఫోన్ చేయడం మర్చిపోకండేం", అని బయటికి వచ్చేశాడు రాంబాబు.

తిన్నగా తను గతంలో పచారి సరుకులు కొనే షాప్‌కి వెళ్ళాడు.

ఆ షాప్ ఆయన రాంబాబుని ఆప్యాయంగా పలకరించాడు.

ఇక ప్రతి నెలా ఆయన దగ్గరే సరుకులు కొంటానని చెప్పి తనకి కావలసిన సరుకులు తీసుకుని ఇంటి బాట పట్టాడు రాంబాబు.

వస్తూంటే ఎవరో మాసిన గెడ్డంతో ఉన్న వ్యక్తి విష్ చేశాడు. రాంబాబు కూడా విష్ చేసి ముందుకు పోబోతుంటే,

"సర్", అని పిలిచాడతను. తనని గుర్తు పట్టేందుకు వీలుగా మాస్క్ తీశాడు.

అప్పుడు చూశాడు రాంబాబు అతన్ని. అతను తన పిల్లలు చదువుతున్న స్కూల్లో మేథ్స్ సార్ సునీల్. జేబులోనుంచి ఓ వెయ్యి రూపాయలు తీసి అతని చేతిలో పెట్టి ఇంటి బాట పట్టాడు రాంబాబు.

★ ★ ★ ★

ఇంటి దగ్గర సీత ఫోన్‌లోను తన ఫోన్‌లోనూ ఆన్లైన్ క్లాసులు వింటున్నారు పెద్ద పిల్లలిద్దరూ. చంటిదానికి దాని క్లాసు వినడానికి ఫోన్ లేదు. అదేమో క్లాసు వినకపోతే టీచర్ ఫోన్‌చేసి తిడతారని గగ్గోలు పెట్టి ఏడుస్తూ ఉంది. సీత దాన్ని సముదాయించడానికి నానా పాట్లు పడుతున్నది. తనకీ ఒక ఫోన్ కొంటాననగానే శాంతించింది.

"స్కూలు నుంచి ఫోనొచ్చిందండీ", అంది సీత.

రాంబాబుకి విషయం కొంతవరకూ అర్థమైంది అయనా "ఏమిటట?", అన్నాడు.

"అదేనండీ ఈ నెలాఖరులోగా ఫీజు కట్టెయ్యాలట"

"ఎంత కట్టాలో చెప్పారేంటి"

"నేను అదే అడిగానండి. పూర్తిగా కట్టెయ్యాలట. అదేమండీ అంటే 'మరి మేం టీచర్లకు జీతాలు ఇవ్వాలి కదండీ' అని అన్నారు"

"ప్చ్", అని నిట్టూర్చి" కరోనా పేరు చెప్పి ఎవడికి నచ్చినట్టు వాడు లూటీ చేసుకుంటున్నా డన్నమాట" అన్నాడు.

"అదేంటీ అలా అంటారు. వాళ్లన్నది నిజమే కదండీ. వాళ్లు టీచర్లకు జీతాలు ఇవ్వాలి కదా"

"స్టాఫ్ మొత్తంలో ఒకర్నో ఇద్దర్నో ఉంచి మిగిలిన వాళ్ళందర్నీ తీసేశారట. కరోనా తగ్గాక కబురు పెడతామని చెప్పారట"

"అదేంటండీ! ఆ టీచర్లకి జీతాలన్నారు"

"వాళ్ళలాగే మాట్లాడతారు. అవన్నీ వట్టి మాటలే! ఇపుడా టీచర్లంతా సంపాదన లేక కుటుంబాలతో సహా రోడ్డున పడ్డారు. పేరెంట్స్‌ని సహాయం చెయ్యమని చెయ్యి చాచి అడుక్కుంటున్నారు"

"అవునండీ టీవీలో కూడా చూసాను. చాలా చోట్ల ప్రయివేటు టీచర్లు కూలిపనికి కూడా పోతున్నారు"

"ఆన్లైన్ క్లాసులని చెప్పి మేనేజ్‌మెంట్లు పూర్తి ఫీజులు దండేస్తున్నాయి. పైగా టీచర్లను పోషించేస్తున్నామన్న బిల్డప్ ఒకటి. ఆ టీచర్ల కష్టంతో పెద్ద పెద్ద సామ్రాజ్యాలు నిర్మించు కున్నారు. ఇప్పుడు వాళ్ళకవసరం అయినప్పుడు రోడ్డుమీదకు నెట్టేశారు. పోనీ వీళ్ళేమైనా చిన్న ఇన్స్టిట్యూట్లా జీతాలివ్వలేకపోతున్నారని అనుకోవడానికి. ఇంతకన్నా మోసం, దారుణం ఉంటాయా సీతా!", అని సునీల్ సార్ కనపడిన విషయం చెప్పాడు సీతకి.

"అయ్యో! ఆయనంటే మన పిల్లలకు ఎంతో ఇష్టమండీ. ఎప్పుడూ ఆయన గురించే చెబుతుంటారు.

వాళ్ళకు జీతాల్లేకపోతే ఆ కుటుంబాల పరిస్థితేమిటండీ.

మీరన్నట్టు ఇంత కాలం వాళ్ళ కష్టమ్మీద బ్రతికినోళ్ళు ఒక్క అయిదారు నెలలు వాళ్ళని ఆదుకుంటే వాళ్ళ ముల్లేమైనా తరిగిపోతుందా. పోనీలెండి! ఈరోజు మీరు బయటికి వెళ్ళడం మంచిదయ్యింది", అంది సీత.

"మనం చేసే సాయం ఏ మూలకి సీతా! ఆయనొక్కరే కాదుగా. ఆయన లాంటివాళ్ళు వేలాదిగా ఉన్నారు. సహాయం చేసేవాళ్ళు కూడా మహా అయితే ఒక నెలో రెండు నెలలో చేస్తారు. ఆ తరవాత ఆ కుటుంబాలకు ఆకలి చావులే గతి"

"అయ్యో! ఈ మాయదారి కరోనా ఎప్పుడు నాశనమౌతుందో గాని", అంటుండగానే సీత.

"ఈ కరోనా ఒక సాకు మాత్రమే సీతా! మనం ఎపుడూ సరుకులు తీసుకునే గుప్తాగారి పరిస్థితి ఇలా కావడానికి కరోనా కారణం అంటావా. రేపు కరోనా ఉన్నా పోయినా ఆయన దివాలా తీయక తప్పదు. కాకపోతే కరోనా టైంలో ఆ దివాలా తీసే రేటు వేగంగా ఉంటుంది.

మరోపక్క శానిటైజర్లు, మాస్కులు, ముసుగులు తయారుచేసేవాళ్ళు దేశంలో కుబేరుల సరసన చేరబోతున్నారని పేపర్లలో వార్తలు వస్తున్నాయి"

"మామూలపుడు శానిటైజర్లు ఎవరు కొంటారండీ. ఏదో ఇపుడు కరోనా కనుక కొంటున్నాము"

"వాళ్ళు శానిటైజర్లే తయారు చెయ్యక పోవచ్చు. మరొకటేదైనా చేసి అమ్ముకుంటారు. గుడ్డలు నేసుకునే రిలయన్స్‌వాడు ఆయిల్ తవ్వడం మొదలుకొని ఏ అనుభవం లేకపోయినా విమానాల తయారీకి రెడీ అయిపోవడంలేదా అలాగే ఇదీను. ఏలినవారి ఆశీస్సులుంటే మంది సొమ్ముతో మదుపు పెట్టి స్విస్ బ్యాంక్‌లో ఎకౌంట్ తెరవొచ్చు. ఈ కరోనా ప్రజలకు శాపమైతే కార్పొరేట్లకు అందొచ్చిన అవకాశం",

"ఒకపూట బయటికెళ్ళగానే బుద్దుడిలా మీకూ జ్ఞానోదయం అయ్యిందండీ", ముచ్చట పడిపోతూ అంది సీత.

రాంబాబు ముసిముసి నవ్వులు నవ్వాడు. వాళ్ళిద్దరూ అలా మాట్లాడుతూ ఉండగానే

"నాన్నా ఎవరో ఫోన్ చేస్తున్నారు", అని పెద్దోడు పరిగెత్తుకుంటూ వచ్చి ఫోన్ చేతిలో పెట్టాడు.

"హలో!"

"............"

"కంగారు పడకండి... డాక్టర్ దగ్గరకు వెళ్ళండి. అవసరమైతే నేనూ వస్తాను"

".........."

"ఏ మందులేసుకోవాలో నేను చెప్పడం కరెక్టు కాదండీ. ఇలాంటి వాటికి మన సొంత వైద్యాలు పనికిరావు...... నా మాట విని......

రాంబాబులో వచ్చిన మార్పు గమనించిన సీత అతన్నే మురిపెంగా చూస్తూ ఉండిపోయింది. ✦

కవిత

# ఖాళీ చేసి వెళ్ళిపోతున్నారు

**– మంచికంటి**

విషం చిమ్మే వలయంలో ఉన్నా
అమృత వాక్కుల కోసమే
ప్రయత్నించాలి

ఎటు చూసినా
విషాదపు వాసనలే
ఏ గాలి పీల్చి బతకాలిప్పుడు

ప్రాణవాయువూ
నువ్వు కూడా
దగా చేస్తున్నావేమిటి

మంచి వాళ్ళందరూ రాలిపోతున్నారు
చెడుకూ మంచికి
తేడా చెప్పేదెవరు

ఎంతమంది కోసమని ఏడవాలి
దుఃఖపు బావిని
తోడేస్తేపోలా

భూగోళమంతా
ఈ కమురు వాసన ఏమిటో
నరుడు సృష్టించిన విలయతాండవ మేనా

భూదేవే వచ్చినా
మనిషి కన్నీళ్ళు తుడిచి
సముదాయించలేదేమో

నువ్ ఎక్కిన చెట్టు కొమ్మను
మనిషీ
నువ్వే నరుక్కుంటున్నావు

ఇన్ని చావుల్ని చూస్తూ కూడా
చావకుండా ఉండడం ఎలా

చల్లటి ముసుగులతో
ఎన్నెన్ని దివిటీలు

ఇవాళే పలకరించండి
రేపు ఏమి జరుగుతుందో తెలియట్లేదు

ఎంతెంత దూరం
జరుగుతుందో జీవితం

ఏడడుగుల నేల
అడుగు దూరంలోకి వచ్చేసింది

ఇప్పుడు కూడా
దొంగ డబ్బు కోసం
వెంపర్లాడుతున్నారు

తల్లి శవం
తండ్రిశవం
కొడుకు శవం
ఇల్లంతా ఖాళీ చేసి వెళ్ళిపోయారు

చావులోనూ
వాళ్ళు ఆదర్శ దంపతులు ✦

చారిత్రక పత్రం

# ఎందుకు మీరు మౌనంగా వున్నారు?

## సోవియట్ నవలా రచయితలు, నాటక రచయితలు, కవులు అమెరికన్ రచయితలకు రాసిన బహిరంగలేఖ

ప్రచురణ : **"న్యూ మాసెస్" జనవరి 13, 1948.** అనువాదం : **కొత్తపల్లి రవిబాబు**

*(సోవియట్ రచయితల యూనియన్‌వారి అధికార పత్రిక 'లిటరరీ గెజెట్' (మాస్కో నుండి ప్రచురణ)తో 1947 సెప్టెంబర్ 20 సంచికలో అమెరికన్ రచయితలను సంబోధిస్తూ రాసిన ఈ బహిరంగలేఖను ప్రచురించారు. "అమెరికన్ సంస్కృతీ నిర్మాతలారా! మీరు ఎవరివైపు?" అనే శీర్షికతో దీనిని విడుదల చేశారు. ఇదే ప్రశ్నను ఒక దశాబ్దం క్రితం ప్రపంచ రచయితలకు మాక్సిమ్‌గోర్కీ వేశాడు. కొత్తగా ముంచుకొస్తున్న యుద్ధమూ, ఫాసిజమూ యొక్క ప్రమాదాల పట్ల మౌనం వహించిన అమెరికన్ రచయితలను ఉద్దేశించి" రాసిన ఈ లేఖపై 12 మంది ప్రముఖ సోవియట్ నవలాకారులు, నాటకకర్తలు, కవులు సంతకాలు చేశారు.*

*ఈ లేఖ మొదట 'లిటరరీ గెజెట్'లో వచ్చినపుడు మాస్కో నుండి వచ్చే వార్తాశకలాలలో ప్రస్తావించబడింది. దీనిని చదివిన తర్వాత ఈ లేఖ మొత్తాన్ని అమెరికన్ రచయితల దృష్టికి తీసుకురావాలని 'న్యూ మాసెస్' వారపత్రిక సంపాదకులు అభిప్రాయపడ్డారు. దానికనుగుణంగానే 'లిటరరీ గెజెట్' వారిని ఈ లేఖ పూర్తి పాఠం పంపించమని కోరాం. ఈ బహిరంగలేఖపై ప్రముఖ అమెరికన్ నవలా రచయితల, నాటక రచయితల, కవుల వ్యాఖ్యానాలు కూడా ప్రచురించాలనుకున్నాం. ప్రపంచం ఈనాడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అమెరికన్ రచయితలు, సోవియట్ రచయితలతో ఒక చర్చను ఈ పత్రికలో ప్రారంభించాలని ఆశించాం. కాని దురదృష్టవశాత్తు, మేము ఎంతో ఆశతో ప్రారంభించాలనుకున్న చర్చ నిర్వహించలేకపోతున్నాం. ఎందుకంటే ఈ 'న్యూ మాసెస్' వారపత్రికను ఈ సంచికతో ఆపివేస్తున్నాం. ఇదే మా పత్రిక ఆఖరి సంచిక. అయినా కూడా, అమెరికన్లకు మొదటిసారిగా అందిన ఈ లేఖ ఎవరికి ఉద్దేశించి రాసారో ఆ రచయితలు, ఈ లేఖలో 12 మంది సోవియట్ రచయితలు స్పష్టంగా, ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించిన తప్పనిసరి సమస్యలపై విస్తృతమైన చర్చ చేస్తారని ఆశిస్తున్నాం.*

*జర్మన్ ఫాసిజంకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో ప్రధానపాత్ర వహించిన ప్రముఖులైన మన రచయితలు, సృజనకారులు, ఇప్పుడు మన సొంత దేశంలో ఫాసిస్టు శత్రువు తల ఎత్తుతుంటే మౌనంగా ఎందుకున్నారని 'న్యూమాసెస్' కొంతకాలంగా అడుగుతూ వుంది. సోవియట్ రచయితలే కాదు, ఇతర దేశాలలో పలువురు రచయితలు, మార్షల్ ప్లాన్‌తో ట్రూమన్ సిద్ధాంతంతో ఇప్పటికే బాధితులైనవారు, భవిష్యత్తులో బాధితులయ్యేవారు కూడా ఈ సమస్యతో సతమతమౌతున్నారు.*

*ఫాసిజం ఇప్పటికే మన దేశంలోకి చొచ్చుకు వచ్చిందనీ, విదేశాలలో ఫాసిజానికి వ్యతిరేకంగా నాయకత్వం వహించిన సాంస్కృతిక రంగంలోని పలువురు ప్రముఖులు ఇప్పుడు స్వదేశంలో ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో విఫలమౌతున్నారని అభిప్రాయపడటం సబబే కదా! విదేశాలవారు ఇలా అభిప్రాయపడుతున్నారని సోవియట్ రచయితల బహిరంగ లేఖ తెలియచేస్తోంది. వారు అమెరికా ప్రజలకూ, ఫాసిస్టులకు మధ్య తేడా గమనిస్తారు. అలాగే నూతన ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా మాట్లాడేవారికీ, మౌనంగా వున్నవారికీ మధ్య తేడాను గమనిస్తారు.*

*సమాచారలోపం వల్ల మౌనం వహించాం అని చెప్పడం తెలివిగలవాళ్ళు చెప్పే సాకు కాకూడదు. వార్తాపత్రికలు చదివేవారూ, రేడియో వినేవారు చాల తేలిగ్గా సమాచారం పొందగలరు. స్పందించే గుణం కల రచయితలు, కవులు ఇప్పటికే మనం ఎన్నో రాజ్యాంగబద్ధ స్వేచ్ఛలను పోగొట్టుకుంటున్నామన్న స్పృహలో వుండి వుండాలి. రోజూ రేడియో ద్వారా, పత్రికల ద్వారా అందుతున్న బాధాపూరితమైన, క్రూరమైన యుద్ధోన్మాద, రాజకీయ ఉన్మాద సమాచారానికై నిస్సందేహంగా మొట్టమొదటగా ప్రతిస్పందించే వారిలో ఈ రచయితలు, కవులు ముందువరుసలో వుంటారు. వీరు ప్రత్యేకంగా విదేశీ వ్యవహారాలు అధ్యయనం చేయకుండానే, మన గుత్త వ్యాపార సంస్థలూ, వాటి రాజకీయవేత్తలూ ఏవిధంగా ప్రపంచం మొత్తాన్నీ బెదిరించి వత్తిడి తెస్తున్నారో ముందుగా గమనిస్తుంటారు.*

*ఈ వాస్తవాన్ని చాలమంది అర్థం చేసుకుంటారు. కాని కొందరే దీనికి వ్యతిరేకంగా నోరు తెరుస్తారు. మరికొందరు మౌనం వహిస్తారు. మౌనం వహించటమంటే నేరంలో పాలుపంచుకోవడమే గదా! ఇది ప్రతి ఒక్కరూ ఎవరికివారు నిస్సందేహంగా నిర్ణయించు కోవాల్సిన విషయం. కాని నిర్ణయం తీసుకోడానికి సమయాన్ని మాత్రం సుదీర్ఘకాలం వాయిదా వేయడం పనికిరాదు. కొందరు అసలు నోరు తెరవలేరు. ఆ విధంగా ప్రపంచ మానవాళికి నష్టం చేస్తారు. అమెరికా భవిష్యత్తు వీరి చేతిలో లేదు. మౌనంగా వుండటానికి ఇష్టపడనివారు, స్పెయిన్‌లో పోరాడి మరణించిన మన రచయితలు, కవుల యొక్క మహత్తర సంప్రదాయాన్ని ముందుకు తీసుకొని వెళ్ళేవారు, హిట్లరిజంకు వ్యతిరేకంగా సాగిన దశాబ్ద పోరాటంలో సంపూర్ణ మానవులుగా రూపొందినవారు, ఈనాడు మన యుద్ధోన్మాదులకు, మన ఇంట్లో పెరిగిన ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడేవారు – వీరి చేతుల్లో మన అమెరికా భవిష్యత్తు ఆధారపడి వుంది.)*

**- సంపాదకవర్గం**

### అమెరికాలోని రచయితలకు, సంస్కృతి ప్రతినిధులకు :

సంస్కృతి యొక్క మానవజాతి యొక్క భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్న మేము, ఈ బహిరంగలేఖను మీకు రాస్తున్నాము. మానవజాతికి అత్యంత హేయమైన శత్రువైన ఫాసిజంకి వ్యతిరేకంగా సాగిన యుద్ధం తర్వాత ఒకదాని తర్వాత మరొకటిగా వచ్చి పడుతున్న అపాయాలపట్లా, మన సంస్కృతి ఎదుర్కోబోయే కొత్త విపత్తుల పట్ల మీకు కల్గిన ఆందోళనను మీ నుంచి దాయాలనుకోవడంలేదు. వాటిని పట్టించుకోకుండా కళ్ళు మూసుకోవాలనుకోవడంలేదు.

ఇతరుల కంటే చాల ఎక్కువగా ఈ అపాయాలను మేము పట్టించుకుంటున్నాం. మా దేశం ఎన్నో నమ్మశక్యంగాని పరీక్షలకు గురైంది, సంస్కృతీ పరిరక్షణ విషయంలో ఎన్నో కొరతలకు, నష్టాలకు లోనైంది. కనుకనే కొత్తగా వచ్చిన ఈ అపాయాన్ని ఉపేక్షించే హక్కు మాకు లేదు. ఉపేక్షించలేము కూడా!

ఒక ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా మనందరం మన మహత్తర దేశాల ప్రతినిధులుగా, నిజాయితీగా రెండు సంవత్సరాల క్రితం భుజం భుజం కలిపి పోరాడి మన రక్తం ధారపోసాం. కనుక ఏమాత్రం నీళ్ళు నమలకుండా, మీతో సూటిగా, మాట్లాడాలనుకుంటున్నాం.

మానవ సంస్కృతి భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న మాకు మీ దేశంలో బహిరంగంగా తల ఎత్తుతూ, మీ సరిహద్దులు దాటి, ప్రపంచాన్నంతా ప్రభావితం చేస్తున్న ధోరణులు ఆందోళన కల్గిస్తున్నాయి.

ఈ క్రింది విషయం ఆలోచించవలసిందిగా కోరుతున్నాం. ఫాసిజంతో చేసిన యుద్ధానంతరం మీ దేశంలో జర్మన్ ఫాసిజం ప్రవచించిన ఆచరించిన అమానవీయ భావాలను మనందరం కలసి ఓడించాం. కానీ, అవే భావాలు కొత్త ముసుగు ధరించి, సారంలో మాత్రం వాటినే ప్రచారం చేస్తూ, ఆచరిస్తూన్న వారు నానాటికీ మీ దేశంలో సంఖ్యాపరంగా పెరుగుతున్నారు.

ఫాసిస్టు భావజాలాన్ని గట్టిగా సమర్థించే, ప్రచారం చేసేవారిలో మీ దేశంలోని ప్రముఖ రాజకీయవేత్తలు, రాయబారులు, పారిశ్రామికవేత్తలు, పాత్రికేయులు – ఇంకా శాస్త్రవేత్తలు కూడా వున్నారు. పశుబలాన్ని ఆరాధించడం, జాతి వివక్షా విధానం పాటించడం, 'ఒక ఎన్నిక చేసిన జాతి' ప్రపంచాధిపత్యం వహిస్తుందన్న సిద్ధాంతాన్ని వల్లె వేయడం, చరిత్రపరంగా, సంస్కృతిపరంగా, రాజ్యవ్యవస్థ పరంగా ప్రజలలో ద్వేషాన్ని రెచ్చగొట్టడం మొదలగు విషయాల గురించి మేం ప్రస్తావిస్తున్నాం. వారు ఇతర దేశాల సార్వభౌమతాన్ని తిరస్కరిస్తారు. ఇరత జాతుల ప్రజల ఆంతరంగిక విషయాలలో నేరుగా కల్పించుకుంటారు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అనుసరిస్తున్న ఆదర్శాలకు వ్యవస్థలకు భిన్నంగా వున్న ఇతర దేశాలవారిని సహించలేకపోవడానికీ, ఫాసిస్టు భావజాలానికీ సాన్నిహిత్యం లేదంటారా? మీ దేశంలో వినబడుతున్న యుద్ధకాంక్షా, ఫాసిజమూ ఒకటి కాదా! యుద్ధం కోసం వినిపిస్తున్న విజ్ఞప్తుల విపరీతాన్ని, బహుశా, అవి ప్రతిరోజూ వినబడుతున్నాయి గనుక మీరు గమనించి వుండరు.

"అమెరికన్ శతాబ్దం" పేరుతోనూ, ప్రపంచంలో 'నూతన వ్యవస్థ'ను నెలకొల్పడమన్న సాకుతోను ప్రపంచాధిపత్యంపై హక్కును కోరుకోవడం, ఒకోసారి బెదిరింపులతోను, కొన్నిసార్లు ప్రజలపై క్రూరమైన హింసతోను ఈ హక్కులు కోరుకోవడం ఫాసిజాన్ని మరోసారి ఆహ్వానించడం కాదా? అమెరికన్ సామాజికవ్యవస్థ మానవజాతికి ఉపయోగకరమైన ఏకైక మంచి వ్యవస్థ అనీ, ప్రపంచవ్యాప్తంగా దీనిని అనుసరించాలని, రేయింబవళ్ళు మీ దేశ ప్రతినిధులు చేసే ప్రచారం మేం వినడంలేదా? ఈ ప్రచారం ఫాసిస్టు సిద్ధాంతం, ఆచరణను తిరగదోడటం కాదా? అమెరికాకు భిన్నంగా వున్న ఇతరేతర వ్యవస్థలు గల దేశాలపై సత్వరం ఆటంబాంబు ఉపయోగించాలని చెప్పే విజ్ఞప్తులకు – ఫాసిస్టు భావజాలానికీ ఎటువంటి పోలికా లేదంటారా?

అమెరికన్ ప్రజానీకపు పేరుతో పాత ఫాసిస్టు భావజాలాన్ని ప్రచారం చేసే అమెరికా మద్దతుదారుల అభిప్రాయాలతో అత్యధికులైన ప్రజాస్వామిక అమెరికన్లు భాగం పంచుకోరన్న విషయాన్ని మేం ప్రగాఢంగా నమ్ముతున్నాం. అలా నమ్మకపోతే ఈ బహిరంగ లేఖ రాయడం పనికిమాలిన పని అవుతుంది.

ఏ రూపంలో వ్యక్తమైనాసరే మీ ప్రజలు ఫాసిజాన్ని వ్యతిరేకిస్తారని మాకు తెలుసు. సంస్కృతికి ప్రతినిధులైనవారు – ఎప్పుడూ ప్రజలవైపే వుంటారు. వారు సిద్ధాంతపరంగానూ, ఆచరణలోనూ ఫాసిజానికి శత్రువులుగా వుంటారు.

అయితే మీలో చాలామంది మౌనంగా వుండటం మాకు ఆందోళన కల్గించడంతో మీరు ఈ లేఖ రాస్తున్నారు. మీ దేశంలో ఫాసిజాన్ని సమర్థించేవారు, ఫాసిజానికి మిత్రులు బాహాటంగా, గట్టిగా మాట్లాడుతుంటే నిజమైన అమెరికన్ సంస్కృతికి ప్రతినిధులైనవారు, ఫాసిజానికి శత్రువులైనవారి ప్రకటనలు మాకు అరుదుగా చేరుతున్నాయి.

సంస్కృతి నిర్మాతలు, రచయితలు మానవజాతికి ఆత్మలాంటివారు. రెండేళ్ళపైనే యుద్ధం ముగియాల్సి వుండగా ఇప్పటికీ అది కొనసాగుతుంటే వారు మౌనంగా వుండగలరా? ప్రపంచంలో రక్తపాతానికి స్వస్తి పలుకుతూ పత్రాలపై సంతకాలుచేసి రెండేళ్ళపైనే అయింది. కాని రెండేళ్ళపైగా ఈ ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో రోజూ రక్తపాతం జరుగుతూనే వుంది. పిల్లల నెత్తురు, స్త్రీ పురుషుల రక్తం, సాధారణ ప్రజల రుధిరం ప్రవహిస్తోంది. వారు చేసిన ఏకైక నేరం వారు గ్రీసులో, ఇండోనీసియాలో, చైనాలో జన్మించడమే! ఇప్పటికే చంపబడిన, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఇంకా చంపబడుతూ వున్న మానవుల పరిస్థితిని ముఖ్య బాధ్యత ప్రజల పేరుతో, సాకుతో ఫాసిస్టు భావజాలాన్ని కొనసాగిస్తున్నవారిదేనని స్పష్టం కావడంలేదా?

హిట్లర్ నాయకత్వాన గల జర్మనీ ఓటమి తర్వాత కూడా జర్మన్ ఫాసిజంతో బాధితులైన లక్షలాదిమందితో కొత్తగా బాధితులు రోజూ చేరుతున్నారు. హిట్లరిజానికి వ్యతిరేకంగా నిజాయితీతో తమ ప్రాణాలర్పించిన మీ దేశంవారికీ, మా దేశంవారికీ ఇది సరైన జ్ఞాపక చిహ్నమా?

చనిపోయినవారిని ఎలాగూ బతికించలేము. వారి వీరోచిత కృత్యాల జ్ఞాపకాలను మసిబారేట్లు, అగౌరవపరిచేట్లు చేసి, వారి మరణాన్ని తెలివితక్కువ తనంగా చిత్రించడం మాత్రమే మనకు సాధ్యం! కాని బతికివున్నవారిని రక్షించగలం. ఒకదేశపు సంస్కృతికి చెందిన ప్రతినిధులు ప్రతి ఒక్కరూ తమ గొంతెత్తి ప్రపంచ దేశాల మధ్య శాంతి, స్నేహం పరిరక్షణ కోసం, చనిపోయినవారిని జ్ఞాపకం చేసుకుంటూ, బతికి వున్నవారి ప్రాణాల కోసం నినదించాలి.

ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం తర్వాత మౌనం వహించడం అనుమతించాల్సిన విషయం కాదు. ఫాసిస్టు అకృత్యాలు మనకు పీడకల కాదు – కళ్ళముందు జరిగిన వాస్తవాలు. అమెరికన్ డాలర్ల దయ దాక్షిణ్యాలతో అధికారంలో వున్న గ్రీసులోని ఫాసిస్టు 'యోధులు' స్పార్టాలో గ్రీకు పిల్లల నరికిన తలలను ప్రదర్శించడం వాస్తవంగా మనం చూశాం. ప్రపంచమంతా ఫిరంగు ధ్వనులతో ప్రతిధ్వనిస్తుంటే, డాలర్ల సహాయంతో డచ్ సైన్యం, ఆరు మిలియన్ల ఇండోనేషియన్ల ఇళ్ళను తగలబెడ్తుంటే, చైనాలో దేశభక్తుల తలలు నరికేస్తుంటే, స్పెయిన్‌లో రిపబ్లికన్లను ఉరితీస్తుంటే, న్యూరంబర్గ్ న్యాయస్థానంలోకి ఫాసిస్టులు బాంబులు విసురుతుంటే, ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి న్యూయార్క్‌లో 'ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడటమనేది ఇక ముందు ఫాషన్ కాదు' అని ప్రకటిస్తుంటే, ఎవరైనా మౌనంగా వుండగలరా!

"సూక్ష్మజీవులతో కూడిన జీవాయుధాలైతే, వాటిని అదుపు చేయలేము.... చిన్న చిన్న పరిశోధనాశాలల్లో పరీక్షించి అభివృద్ధి చేయవచ్చును" అంటూ వాటిని ఒక మిలటరీ జనరల్ ప్రశంసించాడు. హిట్లర్ అనుచరులను మట్టుబెట్టాం కాని, ఇంకా హిట్లర్ లాంటి నేరస్థులు అణ్వాయుధాలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ హిట్లర్ వారసులుగా ఇప్పటికీ కొనసాగుతున్నారు. నూతన ప్రపంచ యుద్ధంలో చేసే బ్లాక్‌మెయిల్ ఇది. మరొక ప్రచండ విధ్వంసం సృష్టించే యుద్ధం గురించి చేసే ఈ బెదిరింపుకంటే మరో సిగ్గుమాలిన బ్లాక్‌మెయిల్ రూపం వేరొకటి ఏదైనా వుందా? ప్రపంచంపై ఆధిపత్యం వహించాలని కోరుకుంటున్నవారు ఇతర దేశాలవారిపై ఉపయోగిస్తున్న బెదిరింపు ఇది.

నిజమైన ఫాసిస్టులు ప్రతి భాషలోనూ చరిత్రలో స్థిరపడిన పదానికి సరిపోయే మరో పదాన్ని ఎన్నిక చేసుకుంటారు. "ప్రజాస్వామిక" మారుపేర్లు ఇప్పటి ఫాషన్. ఆంగ్లో – అమెరికన్ మద్దతు పొందుతున్న హిట్లరైట్లు కూడా పశ్చిమ జర్మనీలో తమను తాము ప్రజాస్వామిక వాదులమని, ప్రజలకు ప్రేమపాత్రమైన ఆ పదాన్ని అపవిత్రం చేస్తూ పిలుచుకుంటున్నారు.

ఏది ఏమైనప్పటికీ, ఫాసిజం అంటే యుద్ధం అన్న విషయం మానవజాతి క్షుణ్ణంగా అర్థం చేసుకుంది. ఇప్పుడు ఒక కొత్త యుద్ధం కొరకు అర్రులు చాస్తూ, దాని కోసం తయారవుతున్నవారికీ, ఫాసిస్టులకూ మధ్య ఏదైనా తేడా వుందా? మిలటరీ సూక్ష్మక్రిమి శాస్త్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం గురించి మాట్లాడే అమెరికన్ మిలటరీ జనరల్స్ వృత్తిపరంగా వారి వృత్తిని మాత్రమే ప్రేమించేవారు కాదు. యుద్ధాన్ని కోరుకునే అమెరికన్ అడ్మిరల్స్, ఎయిర్ మార్షల్స్ (సైనిక, వాయు సేనాధిపతులు – అను॥) ఇప్పటికే యుద్ధంలో పరీక్షించబడిన ఆటంబాంబుతో ప్రయోగాలు కొనసాగిస్తున్నవారు, ఆ కళ పట్ల ప్రేమతోనూ, విజ్ఞానశాస్త్ర ఫలితాలు నమోదు చేయడానికీ చేయడంలేదు. పశ్చిమార్ధగోళంలో దాదాపు ప్రతి దేశమూ తగిన ఆయుధాలు కలిగి వుండాలని అమెరికన్ మిలటరీ నాయకులు పట్టుపడుతున్నారంటే – ఒక పొందిక కోసం, ఒక సమరూపత కోసం కాదు. వీరు ఒక కొత్త సామ్రాజ్యవాద యుద్ధానికి శ్రీకారం చుడుతున్నారు.

సాహితీవేత్తలను, కళాకారులను, సంస్కృతీ నిర్మాతలను పోలీసులు పెట్టే నిర్బంధాలు కానీ, కరెన్సీ నోట్ల కట్టలు కానీ తేలిగ్గా నోరు మూయించలేవు. వారి సందేశాలను వారి వ్యాఖ్యానాలను పత్రికలలోనూ, పుస్తకాలలోను, వేదికల నుండి, వెండితెర నుండి ప్రపంచ ప్రజానీకం వింటూ వుంటుంది. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో మానవజాతి పురోగతిని పరిరక్షిస్తూ మాట్లాడిన కాలం నుంచీ, యుద్ధానికి ముందు మొత్తం వాతావరణమంతా ఫాసిస్టుల, మానవజాతి శత్రువుల కేకలతో నిండి వున్న కాలంలో గోర్కీ వేసిన "సంస్కృతీ నిర్మాతలారా! మీరెటువైపు?" అనే ప్రశ్నకు సమాధానంగా సరిహద్దులను ఛేదించుకుంటూ గోర్కీతో చేతులు కలిపినవారి నుండీ ప్రజలు సందేశాలను వినాలని ఆశిస్తున్నారు.

ప్రపంచంలోని గొప్ప రచయితలందరూ సామాన్య ప్రజల జీవితాన్నీ, ఆనందాన్నీ హరించేవాటన్నిటికీ వ్యతిరేకంగా గొంతెత్తి నిరసన తెలియ చేశారు. తమ దేశంలోగానీ, ఇతర దేశాలలోగానీ జరిగే అన్యాయాలను అక్రమాలను ప్రశ్నించారు. ఉదాహరణకు 'ఐ ఎక్యూజ్' అనే రచనలో ఫ్రాన్స్‌లోని విప్లవ ప్రతీఘాత మిలటరీ వాదులను ఎమిలీ జోలా ఖండించాడు. 'నేను మౌనంగా వుండలేను' అనే రచనలో లియో టాల్‌స్టాయ్ రష్యన్ ప్రతీఘాతుకలను నిరసించాడు.

మీ దేశంలో శాంతి, సంస్కృతి, ప్రజాస్వామ్యాల్ని కాపాడాలంటూ స్పష్టంగా ప్రకటించేవారు మీ దేశంలో వున్నారన్న విషయం మాకు తెలుసు. వారికి జేజేలు! మేము రాస్తున్న ఈ లేఖ వారిని సంబోధించింది కాదు. అన్ని దేశాలలో వున్న కోట్లాది సామాన్య ప్రజానీకపు శ్రమ ఈ భూలోకంలో విలువైన, సుందరమైన వాటిని సృష్టిస్తోంది. వారిపట్ల ప్రేమతో, ఆప్యాయతతో అమెరికన్ సంస్కృతీ నిర్మాతల గొంతు వినబడటంలేదు. వీరిని సంబోధించి మేం ఈ లేఖ రాస్తున్నాం.

ఓ అమెరికన్ సంస్కృతీ నిర్మాతలారా! ప్రపంచవ్యాప్తంగా వున్న సామాన్య ప్రజలు, నిజాయితీ గల్గిన ప్రజలకోసం, కొత్తగా తలెత్తుతున్న ఫాసిజానికి, యుద్ధం సృష్టించే మారణహోమానికి వ్యతిరేకంగా, దేశాల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం వెలసిల్లాలనీ, మానవజాతి ఆనందంగా వుండాలనీ మీరు గొంతెత్తి నినదించండి.

**ఇట్లు**

**1. డబ్ల్యు వసిలీవస్కా, 2. బి. గోరటోవ్, 3. ఎ. కోర్నిచుక్, 4. ఎన్. పొగొడిన్, 5. ఎ. ట్వార్డోవస్కీ, 6. కె. ఫెడిన్, 7. వి. దిష్‌నెవస్కీ, 8. వి. కాతేయేల్, 9. వి. వియొనావ్, 10. ఎల్. సిమెనోవ్, 11. ఎ. ఫెడయేవ్, 12. ఎమ్. షొలకోవ్.✦**


నవలాపరిచయం

# ముల్క్‌రాజ్ ఆనంద్ ఇంగ్లీషు నవల 'అంటరానివాడు' (UNTOUCHABLE)

పరిచయం :
**జి.వి. భద్రం**

**ప్రముఖ** నవలాకారుడు ముల్క్‌రాజ్ ఆనంద్, 1935లో 'అంటరానివాడు' అనే నవలను ఇంగ్లీషు భాషలో వ్రాశారు. ఈ నవల పలు భాషలలోకి అనువదింపబడింది. తెలుగు భాషలోకి అనువదింపబడినదీ, లేనిదీ అన్న వైనం తెలియలేదు. సాహిత్య ప్రపంచంలో ఈ నవల మొట్టమొదటి దళిత నవలగా పరిగణింపబడుతోంది.

గత మూడు దశాబ్దాల పైకాలంగా దళిత సాహిత్యాన్ని గురించిన అనేక వివరాలు, చర్చలు వెల్లడి అవుతున్నా, ఈ నవలను గురించిన ప్రస్తావన కనబడటల్లేదు. బహుశా ప్రస్తుత తరాల వారికి యీ నవలను గురించి తెలియకపోవటం కారణం కావొచ్చును!. ఈ ఇంగ్లీషు నవలను గతకాలంలో కొన్ని యూనివర్శిటీలు నాన్-డిటైల్డుగా కూడా పాఠ్యాంశాలలో చేర్చాయి.




పెషావర్‌లో జన్మించిన ముల్క్‌రాజ్ ఆనంద్, అగ్రకులమైన క్షత్రియ కులంలో పుట్టారు. ఆయన చిన్నతనంలో ఇండియన్ రెజిమెంటుకు అనుబంధంగా వున్న పారిశుధ్య కార్మికులైన పాకీపనివారి పిల్లలతో కలసి ఆడుకొనేవారు. వారిపట్ల ప్రేమాభిమానాలను పెంచుకొన్నారు. వారి విషాదకరమైన దుస్థితిని, నికృష్టమైన సామాజిక జీవన, పని పరిస్థితులను ఆయన అర్థం చేసుకొన్నారు. భారత సమాజం యొక్క అట్టడుగు లోతున, సమాజం చేత నిరాకరణకు గురైన ఈ వృత్తివారు తమ పీడకులకు వ్యతిరేకంగా తమ వ్యధను కూడా వ్యక్తం చేయలేని నిస్సహాయ స్థితిని గమనించారు. ఈ పీడితుల వ్యధను తన నవల ద్వారా ప్రపంచం ముందుకు ఆయన తీసుకువచ్చారు. అంటరానివారిలో కూడా, వీరు అత్యధమ స్థాయికి నెట్టబడ్డారు. భారత సమాజం దూరంగా నెట్టివేసిన, ఈ బహిష్కృతులైన పాకీపనివారి యొక్క నికృష్ణ జీవనం గురించి, తన సునిశితమైన పరిశీలనతో యీ 'అంటరానివాడు' నవలను ఆయన వ్రాసారు. భారత సామాజిక వ్యవస్థలో వేల ఏళ్ళుగా వ్రేళ్ళూనుకొని సాగుతూ వున్న ఈ అమానవీయ దుర్మార్గం గురించి బట్టబయలు చేశారు.

అభ్యుదయ రచయితల సంఘం (Progressive Writer's Association) వ్యవస్థాపకుడూ, ఆ సంఘం యొక్క ప్రణాళికను వ్రాసిన వారిలో ఒకరైన ముల్క్‌రాజ్ ఆనంద్ రాసిన ఈ పుస్తకానికి ప్రముఖ ఇంగ్లీషు రచయిత ఇ.ఎం. ఫార్‌స్టర్ తన ముందుమాటలో అన్నట్టు "పారిశుద్ధ్య పనివాడైన పాకీవాడు, బానిసకన్నా కూడా ఘోరమైన దుస్థితిలోకి నెట్టబడ్డవాడు. ఎందుకంటే ఒక బానిస తన యజమానిని మార్చుకోగలడు. తన విధులనూ మార్చుకోగలడు. ఆఖరుకు అతడు బానిసత్వం నుంచి స్వేచ్ఛను కూడా పొందవచ్చు. కానీ యీ పాకీవాడు శాశ్వతంగా బంధింపబడ్డవాడు. పుట్టుకతోనే తాను వున్న స్థితి నుండి తప్పించుకు పారిపోవటం అన్నది అతడికి ఎన్నటికీ సాధ్యం కాదు. అతడు సమాజంలో ఎటువంటి సాంగత్యము పెట్టుకోడానికీ వీలులేకుండా బహిష్కరింపబడ్డవాడు. అతడి మతం నుండి కూడా ఏ రకమైన ఊరడింపు, లభించకుండా మినహాయింపబడ్డవాడు. అపరిశుభ్రతను శుద్ధిచేసే యీ పాకీవాడు, యితరులను ముట్టుకొంటే వారిని మైలపరిచే అశుద్ధుడు".

అటువంటి అంటరానివాడైన ఒక పాకీ యువకుడి జీవితంలో ఒక్క రోజులో జరిగిన అనుభవాలను మనకు కళ్ళకు గట్టినట్లు ముల్క్‌రాజ్ ఆనంద్ చూపించారు. భారత సామాజిక వ్యవస్థ యొక్క కరుడుగట్టిన అమానవీయ, అసహ్యకరమైన, దారుణమైన, మార్పు చెంద నిరాకరించే స్వభావాన్ని ఈ నవలలో ఆయన వివరించారు.

నేటికీ మన గ్రామీణ ప్రాంతాల్లో ఏదో ఒక మోతాదులో అంటరానితనం సాగుతూనే వుంది. ఈ అంటరానితనాన్ని సహించలేక, ఎదురు తిరుగుతున్న దళితులపై అగ్రవర్ణాల వారి దాడులు, ఆంక్షలు నిరంతరాయంగా సాగుతూనే వున్నాయి. మానవ మలాన్ని, చేతితో శుభ్రం చేసి, దూరంగా ఆ మలాన్ని తమ తలపై పెట్టుకొని మోసుకుపోయే పని విధానం కొనసాగుతూనే వుంది. దేశానికి, స్వతంత్రం వచ్చి, స్వతంత్ర పాలన సాగుతోందని చెప్పబడుతున్న కాలం 75 సంవత్సరాలకు చేరినా, యీ పాకీ పనివారల దుస్థితి అలాగే కొనసాగుతోంది. బెజవాడ విల్సన్ లాంటివారు ఎన్ని ఆందోళనలు జరుపుతున్నా, సుప్రీంకోర్టు ఎన్నిసార్లు యీ దురాచారాన్ని నిర్మూలించమని 'ఘాటు'గా వ్యాఖ్యానాలు చేసినా, ఈ దురాచారం మాత్రం ఆచరణలో కొనసాగుతూనే వుంది. ఈ దురాచారాన్ని ప్రభుత్వాలూ, పాలకులూ పరోక్షంగా ప్రోత్సహిస్తూ వున్నారు. పాలకవర్గాలు, ప్రత్యేకించి గ్రామీణ పాలకవర్గాలుగా వున్న పెత్తందార్లు ఈ దురాచారం సజావుగా అమలుజరిగేటట్టు కట్టుదిట్టం చేస్తూనే వున్నారు. ఇటీవలి కాలంలో

దళితులపై, అగ్రవర్ణాలవారి దాడులూ, అఘాయిత్యాలూ, పెచ్చరిల్లి పోయాయి. ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో ఈ అగ్రవర్ణ దురహంకార దాడులు అనూహ్యంగా పెరిగిపోతూ వుండటమనేది ఒక సామాజిక జీవనసత్యంగా నిర్ధారింపబడుతోంది. భారత సామాజికవ్యవస్థలో, హిందూ మతధర్మం పేరిట వ్యవస్థీకృతమైన ఈ దారుణ కులవ్యవస్థ యొక్క దురన్యాయపూరితమైన, వికృత స్వభావాన్ని ఈ నవలలో రచయిత ప్రపంచం ముందు అత్యంత ప్రతిభావంతంగా 'బహిర్గత' పరిచారు. ఈ కులవ్యవస్థ యొక్క ఇనుప మడమల క్రింద శాశ్వతంగా నొక్కి పెట్టబడి, అణచివేతకూ, పీడనకూ జీవితాంతం గురవుతున్న అంటరానికులాల వారి మనోవేదననూ, మానసిక స్థితిని, తాము అధములమేనన్న భావనతో ఆత్మనూన్యతతో అనుక్షణం బాధపడేవారి ఆలోచనలనూ, ఈ నవలలో రచయిత అత్యంత హృదయ విదారకంగా వర్ణించారు. ఈ నవల కేవలం విషయంలోనేకాక రూపంలో కూడా ఉన్నతమైన సాహిత్య ప్రమాణాలలో రచింపబడింది.

అంటరానితనం నిర్మూలనకు యీ నవల వ్రాసే కాలంనాటికి ప్రతిపాదనలో వున్న వివిధ పరిష్కారాలను ఈ నవల ప్రస్తావించటమే కాక, ఆ పరిష్కారాలను కూడా విమర్శనాయుతంగా, కులవ్యవస్థ – అంటరానితనంలకు పీడితులయిన ఆ అంటరానివారి యొక్క ఆలోచనల ద్వారానే పరిశీలించింది. 86 సంవత్సరాలకు పూర్వమే, బ్రిటిష్ వలస పాలకుల కాలంలో, అంటరానితనం, కులవ్యవస్థలను బలంగా వ్యతిరేకిస్తూ, కుల నిర్మూలన అవసరాన్ని గురించి గట్టిగా నొక్కి చెప్పిన యీ నవల నేటికీ ప్రాసంగికతను కలిగి ఉన్నది.

దారుణ, అమానవీయ, దుర్మార్గ, దురన్యాయపూరితమైన కులవ్యవస్థ, యిప్పటికీ ఏదో ఒక రూపంలో సజీవంగా వున్న అంటరానితనం పూర్తిగా మన సామాజిక వ్యవస్థ నుండి పెకలింపబడి, ఒక నిజమైన ప్రజాస్వామిక సామాజిక వ్యవస్థ ఏర్పడాలని కోరుకొనేవారందరూ యీ నవలను చదివితే వారి అవగాహన, ఆచరణలను మరింతగా సుసంపన్నం చేసుకోగలుగుతారు.

## 'అంటరానివాడు' నవల కథాసంగ్రహం :

కొండ ప్రాంతంలో వున్న బులాషా టౌన్, కంటోన్మెంట్‌ల సరిహద్దులకు ఆవల దూరంగా అంటరానికులాలవారి గూడెం విడిగా వుంది. ఈ గూడెంలో పాకీపనివారు, చర్మకారులైన మాదిగలు, చాకళ్ళు, మంగళ్ళు, నీటిని మోసేవారు, గడ్డికోసేవారు లాంటి, హిందూ సమాజం నుండి బహిష్కరింపబడిన కులాలవారు నివసిస్తున్నారు. వీరు నివసించటానికి ఏ రకంగానూ పనికిరాని దుర్గంధం, మురికితో నిండిన, అపరిశుభ్రమైన పరిసరాలు గల పేటలో నివసిస్తున్నారు. కనీస త్రాగునీటి అవసరాలు తీర్చగల ఒక బావి కూడా వారి గూడెంలో లేదు. తమ త్రాగునీటి, తదితర నీటి అవసరాల కోసం వీరు టౌన్‌లో వున్న అగ్రకులాలవారి బావి వద్దకు పోయి బావికీ, నూతికీ దానిచుట్టూ కట్టిన పళ్ళెంకీ దూరంగా వుండి, ఆ బావిలో నీరుతోడుకోవటానికి వచ్చే ఎవరైనా సవర్ణ పుణ్యాత్ములను తమకు ఓ బిందెడు నీళ్ళు పోయమని పదే, పదే ప్రాధేయపడాలి. అందుకోసం గంటల తరబడి ఆ బావికి దూరంగా వేచి వుండాలి. వర్షాకాలంలో అయితే వారి గూడెం మునిగిపోయి బురదతోనూ, అశుద్ధాలతోనూ నిండిపోయి వుంటుంది.

ఈ గూడెంలో లఖా అనే ఒక పాకీవాడు, తన కుటుంబసభ్యులతో నివసిస్తున్నాడు. ఇతడు ఆ టౌన్‌లోని, కంటోన్మెంటులోని పాకీవారందరి (పారిశుద్ధ్య కార్మికులైన స్వీపర్లు అందరి)పైనా, అధికారపూర్వకంగా జమేదారు (మేస్త్రీ)గా పనిచేస్తున్నాడు. అంతేకాక వారి గూడేనికి చిట్టచివరన, వాగువైపున కట్టబడ్డ మూడు వరుసల ప్రజా పాయిఖానాలను శుభ్రం చేయవలసిన విధిని కూడా అతడే నిర్వర్తించాలి. ముసలి వయస్సులో వున్న అతడి భార్య చనిపోయింది. అతడికి బఖా అనే పద్దెనిమిది సంవత్సరాల యువకుడైన ఒక కొడుకూ, సోహినీ అనే పదహారేళ్ళ కూతురూ, రఖా అనే మరో పదకొండు సంవత్సరాల కుమారుడూ వున్నారు.

ముసలి వయస్సులో వున్న లఖా, తాను చేయవల్సిన పారిశుద్ధ్య పనులన్నింటినీ, తన పెద్దకొడుకు బఖా, కుమార్తె సోహినీలకు అప్పజెప్పి, యింటి దగ్గరే విశ్రాంతి తీసుకొంటూ, వీరిని (సంతానాన్ని) నిరంతరం సతాయిస్తూ వుంటాడు. మూడు వరసల పాకీ దొడ్లను రోజంతా పరిశుభ్రంగా వుంచాలి. వాటి నుండి బయటికి తీసిన మలాన్ని గడ్డితో నింపిన గంపల్లో ఎండబెట్టి ఆ పాకీ దొడ్ల ప్రక్కనే ఏర్పాటుచేయబడ్డ, మలాన్ని కాల్చివేసే పొగ గొట్టం వున్న, పొయ్యిలాంటి దానిలో వేసి మలం అంటిన గడ్డితోబాటు బూడిదగా కాల్చివేయాలి. అంతేకాక టౌన్‌లో వున్న వీధులను, గుడి పరిసరాలతో సహా ఊడవాలి. అదికాక, యిళ్ళ వెనుక సందుల్లోని మురికి కాలువలను శుభ్రంచేసి, సందులను ఊడవాలి. ఈ అన్ని పనుల్లోకి పాయిఖానాల వరసలను రోజంతా శుభ్రంచేస్తూ, గంపల్లోకి ఎత్తిన మలాన్ని పొయ్యిలో వేసి కాల్చటం అన్నది కష్టమైన పని. అందువలన బఖా, యీ కష్టమైన పనిని చేస్తే సోహానీ వీధులను తుడవటంతోపాటు, యింటి పనులు చేస్తుంది. అంతేకాక, టౌన్‌లోని యిళ్ళ వద్దకు వెళ్ళి, ఆ గృహస్తులను అడుక్కొని తిండి తెచ్చి పెడుతుంది. చిన్న కుర్రవాడు రాఖా అప్పుడప్పుడు తండ్రి చెప్పిన పారిశుద్ధ్య పనులు చేసినా, ఎక్కువగా తమ గూడెంలోని యితర పిల్లలతో ఆడుకోవటానికే పోతూ వుంటాడు. తనకు వచ్చే జీతాన్ని తానే ఖర్చుపెట్టుకొంటూ, తాను చేయవల్సిన పని భారాన్నీ, యింటి అవసరాలు తీర్చే బాధ్యతనూ పిల్లలపైననే మోపేవాడు ముసలి లాఖా.

అగ్రకులాలకు చెందిన పిల్లలు బడికిపోయి చదువుకోవటాన్ని చూసి తానూ చదువుకోవాలని అనుకొన్నా, భాఖా లాంటి అంటరానివారు చదువుకోవటానికి బడి అన్నదే లేదు. అంటరానివారి పిల్లలతో, యితరుల పిల్లలు చదువుకొంటే వారు మైలబడిపోతారన్న కారణాన, వారికి బడి అన్నది ఏర్పాటు చేయలేదు. ఒకవేళ వున్న బడి వద్దకు వెళ్ళినా ఉపాధ్యాయులు వారికి చదువు చెప్పరు. ఎందుకంటే పొరపాటున యీ అంటరానివారి వేలు తగిలినా ఆ ఉపాధ్యాయులు మైలపడిపోతారు కనుక!. అందువలన బఖా తనకు వారసత్వంగా వచ్చిన జీవితానికి, వారసత్వంగా విధింపబడ్డ పాకీపనికే కుదురుకొన్నాడు. తన ఆరవ ఏట నుండే ఆ వారసత్వపు పనిలో చేరిపోయాడు.

నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అధమ కులాలవారిగా, అంటరానివారిగా ఊరికి దూరంగా వెలివేయబడి గూడెంలో నివసిస్తున్న వారి మధ్య

కూడా కుల అంతరాలు వ్యవస్థీకృతమైపోయాయి. ఉదాహరణకు బఖాకు ఆ గూడేనికి చెందిన యిద్దరు స్నేహితులున్నారు. వారు చాకలి కుర్రాడు రామ్‌చరణ్, మాదిగల కుర్రాడు ఛోటూలు. అయితే యీ ముగ్గురిలోనూ అగ్రకులాలవాడు చాకలి రామ్‌చరణ్. తర్వాతి పెద్దకులంవాడు మాదిగ ఛోటూ. అట్టడుగుకులంవాడు పాకీ కులం వాడైన బఖా.

ఇటువంటి సామాజిక కులపొందిక విధింపబడ్డ వాతావరణ నేపథ్యంలో పాకీపనివాడైన బఖా ఒకరోజున పొందిన అనుభవాల సమాహారమే ఈ 'అంటరానివాడు' నవల. హిందూ కుల సమాజంలో వున్న కపటత్వాన్ని, బూటకత్వాన్ని, కృత్రిమత్వాన్నీ యీ నవలలో రచయిత ప్రభావవంతంగా బట్టబయలు చేశాడు.

ఒక తీవ్రమయిన శీతాకాలపు చలిరోజు రాత్రి గడిచి తెల్లవారుతూ వుండగా, ఆ చలిని తట్టుకోవటానికి ఒక దుప్పటి కూడా లేక బాధపడిన బఖా, పడకమీద నుండి లేవటానికి బద్ధకిస్తున్నాడు. ఈ లోపులో తండ్రి 'నిద్రేలేవరా! పందినాకొడకా! తొందరగా పాకీ దొడ్ల దగ్గరికి వెళ్ళు. లేకపోతే సిపాయిలు కోప్పడతారు'. అంటూ అరిచిన కేకలు విన్న బఖా యింకా లేవటానికి బద్ధకిస్తుండగా 'ఒరే బఖా పాకీ ముండాకొడకా, వచ్చి దొడ్డి శుభ్రపరచరా!' అని ఎవరో అరచిన అరుపు వినబడటంతో నిద్రలేచి, దొడ్ల వరస దగ్గరకి పరిగెత్తి దొడ్లను శుభ్రపరచటం ప్రారంభించాడు. దొడ్లకు వచ్చే వారందరితో, దొడ్డిని శుభ్రం చేయమనే సాధింపులు పడుతూ వారి తిట్లు తింటూ తన పనిలో నిమగ్న మయిపోయాడు. అలా తనను సాధించిన వ్యక్తుల్లో ఒకరైన హవల్దార్ చరత్‌సింగ్, తన పని పూర్తి చేసుకు వెళ్ళిపోయేటప్పుడు, శాంతంగా బఖాతో మధ్యాహ్నం తన యింటికి రమ్మనీ, అతడికొక హాకీ స్టిక్ యిస్తాననీ చెప్పి వెళ్ళిపోయాడు. తర్వాత అనేకమంది సవర్ణ హిందువులు ఆ దొడ్ల దగ్గరికి వచ్చి, మల విసర్జన జరిపి వెళ్ళిపోయారు. అనంతరం అతడు గంపల్లోకి ఎత్తిన మలాన్ని, నిప్పులో వేసి బూడిద చేశాడు. కష్టమైన ఆ పనిని పూర్తిచేసి బఖా పూర్తిగా అలసిపోయి యింటికెళ్ళాడు.

బఖా యింటికెళ్ళేటప్పటికి, వాళ్ళ గుడిసె అంతా పొగతో కమ్ముకొని వుంది. అతడి చెల్లెలు సోహినీ పొయ్యి రాజేస్తూ, తడిసి వున్న కట్టెలను ఊదుతూండటం కన్పించింది. ఆమె ఎంత ఊదినా పొగే తప్ప, పొయ్యి మండటంలేదు. అప్పుడు బఖా ఆమెను తప్పించి, తాను ఊది, పొయ్యి రగిలించాడు. టీ కాచుకోవటం కోసం పొయ్యి మీద మట్టి చట్టిని పెట్టాడు. తీరా చూస్తే, అందులో పోసి కాచటానికి యింట్లో నీళ్ళు లేవు. అప్పుడు సోహినీ కుండ పట్టుకొని ఊరులో వున్న సవర్ణుల బావి దగ్గరికెళ్ళింది. అప్పటికే ఆ బావి నూతి పళ్ళెం చుట్టూ ఎందరో అంటరాని స్త్రీలు బిందెలు పట్టుకొని ఏ పుణ్యాత్ముడు వచ్చి నీరు పోస్తాడా అని ఎదురు చూస్తున్నారు. ఇంతలో అక్కడికి, గుడి ప్రధాన పూజారుల్లో ఒకడైన ముసలి పండిట్ కాళినాథ్ బావి దగ్గరకు వచ్చాడు. అతడ్ని చూడటంతోనే అక్కడున్న స్త్రీలు అతడ్ని తమకు కాసిన్ని నీళ్ళు తోడి తమ కుండల్లో పోయమని ప్రాథేయపడ్డారు. అతడు అక్కడ వున్న స్త్రీలనందరినీ పరికించి చూశాడు. వారిలో సోహినీని గమనించాడు. అతడు ఆమెను, అదివరకు, టౌన్‌లో సందులు ఊడ్వటానికి వచ్చినప్పుడు చూశాడు. యవ్వనవతిగా వున్న ఆమె అందం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆ కారణం చేత ఆ ముసలి పూజారి మిగిలినవారందరినీ కాదని, సోహినీని ముందుకు పిలిచి, తాను తోడిన నీటిని, ఆమె కుండలో పోశాడు. తర్వాత ఆమెను గుడి వద్ద వున్న తమ యింటి దొడ్డిని శుభ్రపరచటానికి ఆరోజు నుండే రమ్మని ఆదేశించాడు. అదే సమయంలో పేద బ్రాహ్మణుడైన లక్ష్మణ్ కూడా ఆ బావి దగ్గరకు వచ్చాడు. అతడు బావిలో నీరు తోడుకొని, ఆ నీటిని కావిడిలో మోసుకెళ్ళి, సంపన్నులైన బ్రాహ్మల యిండ్లలో పోస్తాడు. వాళ్ళ యిళ్ళలో వంట చేస్తాడు. యువకుడైన ఆ బ్రాహ్మణుడు కూడా సోహినీని ఎరుగును. ఆ ముసలి బ్రాహ్మణ పూజారీ, యీ పేద బ్రాహ్మణ వంట బ్రాహ్మణుడు కూడా సోహినీపై కన్ను వేసినవారే! సోహినీ యింటికి వెళ్ళి, తెచ్చిన నీటితో టీ కాచి, ముసలి తండ్రికీ, అన్నదమ్ములకూ యిచ్చింది. సోహినీ యిచ్చిన టీ త్రాగిన అనంతరం, బఖా చీపురూ, తట్టా పట్టుకొని టౌన్‌లోని రోడ్లను వూడ్చటం కోసం బయల్దేరాడు. దారిలో స్నేహితులు రామ్‌చరణ్, ఛోటాలు కన్పించారు. వారితో తాము ఆరోజు సాయంత్రం 31వ పంజాబీ బాలురతో ఆడవల్సిన, హాకీ పందెపు ఆట గురించి చర్చించాడు. క్రమంగా టౌన్‌లోకి అడుగుపెట్టాడు. ఆ వీధిలోని కిళ్ళీషాపు వద్దకు వచ్చిన అతడు, ఆ షాపువాడికి చేతులు జోడించి, తనకు ఒక 'రెడ్–ల్యాంప్' సిగరెట్టు పెట్టె కావాలనీ, తాను డబ్బులు ఎక్కడ పెట్టాలో చెప్పమనీ అడిగాడు. ఆ షాపువాడు చూపించినచోట అర్ధణానాణేన్ని పెట్టాడు. ఆ కిళ్ళీ షాపువాడు ఆ నాణెంపై నీళ్ళు చల్లి, శుద్ధి చేసుకొని, గళ్ళా పెట్టెలో వేసుకొని, ఆ సిగరెట్టు పెట్టిని విసిరాడు. ఆ పెట్టెను అందుకొన్న బఖా అక్కడ వీధి పక్కన నేలపై కూర్చొని మంగలి పనిచేస్తున్న ఒక ముస్లిం మంగలిని నిప్పు అడిగి ఒక సిగరెట్ కాల్చుకొని బయల్దేరాడు. నెమ్మదిగా ప్రధానవీధిలోకి ప్రవేశించాడు. అక్కడ వున్న అంగళ్ళు, వాటి వైభవాన్ని చూసి అచ్చెరువొందాడు. అక్కడ వున్న బెంగాలీ స్వీట్ షాపును చూశాడు. దానిలో ప్రదర్శనకు పెట్టిన పలురకాల అందమైన స్వీట్లు అతడి నోరూరించాయి. బఖా జేబులో ఎనిమిది అణాలున్నాయి. నాల్గణాలు పెట్టి జిలేబీ కొనుక్కొన్నాడు. స్వీటు షాపువాడు జిలేబీ పొట్లం కట్టి బఖాకు విసిరాడు. బఖా నాల్గణాలను షాపులో పనిచేసే కుర్రాడి వద్ద వున్న చెప్పుల బల్లపై పెట్టాడు. ఆ కుర్రాడు ఆ నాణేల మీద నీళ్ళు జల్లి, వాటిని యజమానికందించాడు.

పొట్లంలోని ఒక జిలేబి ముక్కను తింటూ ఆనందిస్తూ, రోడ్డుపైన వున్న షాపులు, సైన్‌బోర్డులు చూస్తూ బఖా ఆ వీధి వెంట ముందుకు సాగుతున్నాడు. ఇంతలో అతడికి ఎవరో గట్టిగా కేకలు పెట్టడం విన్పించింది. 'బీరిపంది, బరికుక్కా, నువ్వు వస్తున్నట్లు, ఎందుకు అరచి, హెచ్చరించటల్లేదు? నువ్వు నన్ను తగలకూడదని నీకు తెలియదురా! పశువా? అంటూ అరుస్తున్నాడొక వ్యక్తి. 'మురికి పందా! లంజకొడకా! నీవు వస్తున్నట్లు అరవకుండా వచ్చి నన్ను గుద్దుకొని మైలపర్చావు! నీవల్ల పనిమీద వెళ్ళున్న నేను, యింటికెళ్ళి, స్నానంచేసి, మైలుబట్టలు విప్పి తిరిగి బట్టలు వేసుకోవాలి! ఈవాళ నా పని నాశనం చేశావు. పందీ!' అంటూ కోపంగా అరిచాడు. ఆ కేకలు విని రోడ్డు మీద నడుస్తున్న జనం అక్కడ గుమిగూడారు. 'ఈ పాకీ వాడికి పొగరు బలసిపోయింది!' అని ఒకరంటే 'వీడికే కాదు మా పాయిఖానా శుభ్రం చేసే పాకీవాడూ అలాగే పొగరుగా వున్నాడు. యీ నెల నుంచి కూలి రూపాయికి బదులు,

రెండు రూపాయలకు పెంచేశాడు' అని మరొకరందుకొన్నారు. 'ప్రపంచం ఏమైపోతోంది! ఇది కలికాలం మహిమ!' అంటూ మరొకాయన అందుకొన్నాడు. ఇంతలో ఓ పోకిరీ కుర్రాడొచ్చి, వీడు నన్ను కొట్టాడంటూ అబద్ధం చెప్పాడు. నేను నిన్నెప్పుడు కొట్టాను? అని బఖా ప్రశ్నిస్తే, అందుకు జవాబు అడగటం బదులు, చూడండి వీడెంత పొగరుబలిసి పోయాడో! అని మరొకరు అరిచారు. బఖా చేతులు జోడించి, తాను ఆ ఆసామి తగలలేదనీ, ఆయనే తనను తగిలారనీ, ఆ బాలుడు అబద్ధాలు చెప్తున్నాడనీ, తనని క్షమించమనీ ఎంతో దీనంగా ప్రాధేయపడినా ఆ గుంపు అతడి మాటలు వినక బాఖాను వేళాకోళం చేస్తూ అవమానపరుస్తూ రకరకాలుగా తిట్టడం సాగించారు. ఆ రకంగా వారంతా శాడిస్టు ఆనందాన్ని పొందుతున్నారు. తన చుట్టూ ఒక వలయంగా వారందరూ ఏర్పడి దడికట్టినట్టుగా, బఖా చుట్టూ అడ్డుగోడగా చుట్టుముట్టారు. వాస్తవానికి యిది ఒక భౌతికమైన అవరోధం కాదు. తల్చుకొంటే బఖా ఒక్క తోపు తోసి బయట పడగలడు. కానీ అది నైతికపరమైన అడ్డుగోడ కావటంతో అతడు పనిచేయలేక, అశక్తుడుగా ఆ గుంపు మధ్య నిలబడిపోయాడు. ఇంతలో రోడ్డుమీద ఒక గుర్రబ్బండి వస్తోంది. గుర్రబ్బండివాడు తప్పుకోండి! తప్పుకోండి! అని అరుస్తూండటంతో, ఆ గుంపు బెదరిపోయింది. ఇంతలో భాఖా తనను ముట్టుకొన్నాడని ఆరోపించిన ఆసామీ, చాచిపెట్టి బఖాకు చెంపదెబ్బ ఒకటిచ్చి, "పోరా! కుక్కా! ఒళ్ళు దగ్గిరెట్టుకో! ఇంకెప్పుడు యిలా చేయకు!" అంటు గుంపులో కలసి వెళ్ళిపోయాడు. ఈ దెబ్బకి బఖా తలపాగా వూడి క్రింద పడిపోయింది. చేతిలో వున్న జిలేబీ పొట్లం జారి మట్టిలో పడిపోయింది. బఖా అనుకోకుండా పడ్డ చెంపదెబ్బకు భయవిహ్వలుడయ్యాడు. కంటిలో నీరు ఉబికి, అతడి చెంపల నుండి జారిపడుతోంది. నిస్సహాయ స్థితిలో అతడు క్రిందపడ్డ జిలేబీని, చీపురు తట్టలను ఏరుకొని తిరిగి ముందుకు సాగటం ప్రారంభించాడు. 'పాకీవాణ్ణి వస్తున్నాను – పాకీవాణ్ణి వస్తున్నాను' అని గట్టిగా అరుస్తూ, రోడ్డు వార నడచుకొంటూ నడక సాగించాడు. తన నీచస్థితిని అర్థం చేసుకొని, తానొక అంటరానివాడినన్న విషయాన్ని గుర్తు చేసుకొన్నాడు బఖా.

మెల్లగా, అరచుకొంటూ, తన రాక గురించి హెచ్చరిస్తూ గుడి పరిసర ప్రాంతానికి చేరుకొన్నాడు బఖా. తనకు జరిగిన అవమానాన్నీ, బాధనూ, దిగమ్రింగి గుడి పరిసరాలు ఊడ్చేపనికి ఉపక్రమించి గుడి ఆవరణను తుడుస్తున్నాడు. గుడి దగ్గర కూడా చాలామంది జనం వున్నారు. కొందరు గుడిలోకి వెళ్తున్నారు. కొందరు గుడి బయటకు వస్తున్నారు. అయితే ఆ గుడిలో ఏ దేముడున్నాడో? ఆయన ఏం చేస్తాడో? బఖాకు తెలియదు. ఎందుకంటే అతడెప్పుడూ గుడిలోకి వెళ్ళలేదు. అంటరానివాడు గుళ్ళోకెళ్ళితే, గుడి మైలబడిపోతుంది. ఇక ఆ గుడిని శుద్ధిపరచటం, అన్నది ఎంతమాత్రం వీలుకాదు. అందువలన అతడు గుడి బయటి ఆవరణ వరకే, ఊడ్చటానికి వెళ్ళగలడు. అందువలన బఖా, బయట కసువునంతా పోగులు పెట్టి, మెల్లగా వాటిని గంపలోకి ఎత్తుకుంటూ గుడిలో ఏముంటుందో? అని ఆలోచిస్తూ, గుడిలోకి వెళ్ళే మెట్లు పైకెక్కి చూడాలని కుతూహలపడ్డాడు. ఒక వారగా గుడిలోకి వెళ్ళే ఒక్కో మెట్టు ఎక్కుతూ, ఆఖరి మెట్టు ఎక్కబోతున్నాడు. దేముడికి హారతి యిస్తున్న దృశ్యం అతడికంటబడింది. దాంతో అతడు చేతులు జోడించి, దేముడికి నమస్కారం పెట్టున్నాడు. ఇంతలో "మైలపరచ బడ్డాను! మైలపరచబడ్డాను! మైలపరచబడ్డాను" అంటూ గట్టిగా కేకలు విన్పించాయి. బఖాకు గుండె ఆగినంతపనయింది. తిరిగి తానెవరినైనా మైలుపరచానా? అని భయపడుతూ, తన ప్రక్కన మెట్లపైన చూశాడు. అక్కడ ఎవరూ అరవటంలేదు. ఆ అరుపులు గుడిలోని ఆవరణ నుంచి వస్తున్నాయి. ఒక ముసలి పూజారి అలా అరుస్తూ చిందులు వేస్తున్నారు. ఆ పూజారి వెనుక ఒక స్త్రీ ఆకారం ఏడుస్తూ కన్పించింది. ఆ పూజారి అలా 'మైలపరచబడ్డాను' అని అరుస్తూ వణికిపోతున్నాడు, క్రింద పడిపోతున్నాడు. చిందులు వేస్తున్నాడు. పూజారి అలా అరవటం వల్ల తనకేం హాని కలుగుతుందో నన్నభయంతో బఖా ఆలోచనలోపడ్డాడు. అరుస్తున్న ఆ పూజారి, గుడి క్రింద మెట్టు దగ్గరికి వచ్చాడు. అతడివెనుక వున్న గుడి ఆవరణలో, బఖా చెల్లెలు సిగ్గుపడుతూ, అతడికి కన్పించింది. ఇంతలో గుడిలోకి వెళ్ళి వచ్చే భక్తులు" ఒరే పాకీ గాడిద! గుడి మెట్లు దిగు! నువ్వు గుడిని మైలపరిచావు' అంటూ అరుస్తున్నారు. 'ఇప్పుడు మేము గుడిని శుద్ధిపరిచే కార్యక్రమం మొదలెట్టాలి! అవతలకు పో!' అంటూ గదమాయిస్తున్నారు. 'దూరంగా వుండు! దూరంగా వుండు!' అంటూ అరుస్తున్నారు. "మీరందరూ దూరంనుంచే మైలబడ్డారు. నేను మాత్రం నన్ను ముట్టుకోవటం వలన మైలబడ్డాను" అని పూజారి గట్టిగా అరిచాడు. అతనిని ఎవరు తాకారు? ఏవిధంగా మైలబడ్డాడు? అన్న విషయం తెలుసుకోకుండానే వారు బఖాను, దూరంగా పో!" అంటూ అరుస్తున్నారు.

సోహినీ చెప్పిన దాని ప్రకారం అసలు జరిగిందేమిటంటే, ఆమె ఆ ముసలి పూజారి యింటిలోని పాయిఖానాను వంగొని శుభ్రం చేస్తూ వుంటే, ఆ ముసలి పూజారి ఆమెకు సైగలు చేస్తూ, దగ్గరికొచ్చి ఆమె రొమ్ములు పట్టుకొన్నాడు. అప్పుడు ఆమె గట్టిగా అరిస్తే ఆ పూజారి తాను మైలపరచబడ్డట్టు నాటకం ఆడుతూ, అరుపులూ పెడబొబ్బలూ పెడుతూ బయటికి పరుగెత్తుకొచ్చాడు. ఈ విషయం విన్న బఖాకు ఆ ముసలి పూజారిని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. కానీ సోహినీ కోపంతో వూగిపోతున్న అతడ్ని వారించి, సముదాయించి యింటికి పోదాం! రా!' అంటూ యింటికి తీసుకెళ్ళబోయింది. కానీ అవమానంతో కృంగిపోతూ, 'నువ్వింటికెళ్ళు! నేను తినటానికి తిండి తీసుకొనివస్తాను' అంటూ వూరిలోకి వెళ్ళాడు బఖా. ఆమె యింటి దారిపట్టింది.

ఆ టౌన్‌లో వున్న గృహస్థుల యిండ్లకు వెనుక భాగాన సందు లుంటాయి. ఆ సందుల్లో మురికినీరు పారే కాల్వలుంటాయి. ఆ మురికి కాల్వలను పాకీవారు ప్రతిరోజూ శుభ్రపరుస్తారు. తర్వాత మధ్యాహ్నం, ఆ సందులో యిళ్ళ దొడ్డివైపున పడిగాపులు కాసి, ఆ గృహిణులను తిండి పెట్టమని అడుక్కొని వారిచ్చిన చపాతీలను, యితర పదార్థాలను యింటికి తెచ్చుకొని తింటారు. ప్రతిరోజూ సోహినీ తాను శుభ్రం చేసిన సందుల్లోని యిండ్ల నుండి అడుక్కొని తిండి తెచ్చేది. ఈరోజు ఆ తిండి తెచ్చుకోవటం కోసం బఖా వెళ్ళాడు. తాము శుభ్రం చేసే సందులోకి వెళ్ళి "అమ్మా, పాకీవాడికి రొట్టె యివ్వండి!" అంటూ పలుసార్లు అరిచాడు. అయినా ఏ గృహిణీ వచ్చి అతడికి ఏమీ ఆహారం యివ్వక పోవటంతో, అలసిపోయిన అతడు, ఒక యింటి దొడ్డి గుమ్మానికి ఆనుకొని నిద్రలోకి జారాడు. నిద్రలో కలలు కంటున్నాడు. ఇంతలో

ఆ యింటి గృహిణి, 'ఒరే దరిద్రుడా! నీవు నాశనంగాను! మా యింటిని మైలపరిచావురా' అంటూ పెద్దగా కేకలు పెట్టసాగింది. దాంతో మెలకువ వచ్చిన బఖా 'క్షమించండి అమ్మగారూ! నేను తిండి పెట్టమని అరిచానమ్మా!. మీరు వేరే పనిలో వుండి వుంటారు. నాకేకలు వినిపించి వుండవు. కొంచెం అలసటగా వుంటే, గుమ్మానికి జారబడ్డాను' అంటూ క్షమాపణ చెప్పుకొన్నాడు. అయినా శాంతించని ఆ గృహిణి 'నువ్వు నా యింటి గుమ్మం ముందు ఎందుకు కూర్చున్నావు? యింటిని మైలపరిచావు. సందులో కూర్చోపోయావా? ఇప్పుడు యిల్లంతా, నేను పవిత్ర జలం చల్లి శుద్ధి చేసుకోవాలి! అయినా యీ మధ్యన మీ పాకీవాళ్ళు తలలెగరేస్తున్నారు!' అంటూ అరచి లోపలికెళ్ళిపోయింది. ఇంతలో మరో యింటి గృహిణి వచ్చి బఖా చేతిలో ఒక చపాతీ వేసి 'ఒరే! నువ్వు అలా యింటి గుమ్మం మీద కూర్చోకూడదురా!' అంటూ మందలించి వెళ్ళిపోయింది. ఇంతలో తన యిల్లు మైలపడిందని తిట్టిన గృహిణి వచ్చి 'ఓరి నువ్వు చావా! ఈవేళ నువ్వుగానీ, నీ చెల్లెలు గానీ వచ్చి సందు శుభ్రపరచలేదు. నీకు తిండి ఎలా వస్తుందనుకొన్నావ్! మురిక్కాలవను శుభ్రం చెయ్యి! నీకు రొట్టె యిస్తాను!" అని యింట్లోకి వెళ్ళిపోయి యింటి నాల్గవ అంతస్తులో నుండి, "యిదిగోరా! యిది తీసుకో!. అంటూ పైనించి ఒక చపాతీ విసిరింది. అది క్రింద మట్టిలో పడింది. బఖా ఆ చపాతీని ఏరుకొని, దానికి అంటుకొన్న మట్టిని దులిపి, గుడ్డలో మూట కట్టుకొని యింటిదారి పట్టాడు.

ఈ రోజున వరసగా జరిగిన అవమానాలు బఖాను కలచి వేస్తున్నాయి. మరోవైపు ఆకలి వేస్తోంది. రెండు చపాతీలతో కుటుంబం అందరూ ఎలా సరిపెట్టుకోవాలో అతడికి అర్థం కావటల్లేదు. రోజంతా కష్టపడి పనిచేసి కూడా, యిలా ముష్టెత్తుకు బ్రతకాల్సిన జీవితంపట్ల అతడికి అసహ్యం వేసింది. ఇంటికి చేరుకొన్నాడు. చపాతీలు మూటను చెల్లెలికిచ్చాడు. విచారంగా అంతవరకూ జరిగిన ఘటనలను తలచుకొంటూ కూర్చొన్నాడు. అతడి విచారాన్ని కనిపెట్టిన బఖా తండ్రి, విషయమేమిటని అడిగాడు. తనను తాకి మైలుపడ్డానని గోలగోల చేసి, అవమానించి, తనకు చెంపదెబ్బ కొట్టిన ఆసామి వుదంతాన్నీ, ముసలి పూజారి సోహినీపై అత్యాచారం చేయబోగా, ఆమె కేకవేసి అరిస్తే, మైలపరచబడ్డాను అంటూ అరుస్తూ నాటకమాడి తమను అవమానపరచిన విషయాన్ని, సందులోని గృహిణి నాల్గవ అంతస్తు నుండి చపాతీని క్రిందకు విసిరివేసిన వైనాన్నీ బఖా తండ్రికి తెలియ జేశాడు. తాను ఆ ముసలి పూజారిని తన్నకుండా వున్నందుకు బాధపడు తున్నానని చెప్పాడు. తండ్రి బఖాతో 'మనం అలా చేయకూడదు. వాళ్ళు మన యజమానులు. మనం వారి దాసులం. మన గురించి చెడుగా ఒక్క మాట వాళ్ళు చెప్పినా పోలీసులు మనల్ని బ్రతకనీయరు. మనం వాళ్ళని గౌరవించాలి. వాళ్ళు చెప్పినట్లు చెయ్యాలి!" అని నచ్చజెప్తాడు. ఇంతలో అతడి తమ్ముడు రాఖా నెత్తిమీద బుట్టపెట్టుకొని, భుజానికి ఒక గిన్నె వ్రేలాడతీసుకొని వచ్చాడు. అతడు సిపాయిల బ్యారక్‌కు వెళ్ళి, అక్కడ సిపాయిలు తినగా వదిలిపెట్టిన ఆహార పదార్థాలను, బుట్టలో పెట్టి, మిగిలిన పులుసును గిన్నెలో పోసుకొని తెచ్చాడు. ఆ కుటుంబ సభ్యులందరూ రాఖా తెచ్చిన బుట్ట చుట్టూ కూర్చొని, అందులోని పదార్థాలను తినటం మొదలెట్టారు. బఖా ఒక చపాతీ ముక్కను తీసుకొని నోట్లో పెట్టుకొన్నాడు. ఆ చపాతీ ముక్క తడిసిన తడి అతడి నోటికి తగిలింది. అప్పుడు అతడికి ఆ చపాతీ ముక్క ఎందుకు తడిగా వుందో గుర్తొచ్చింది. సిపాయిలు తాము కంచంలో ఆహారం తింటూ, కంచంలో మిగిలిన ఆహారంపైననే చేతులు కడుక్కొంటారు. అలా కంచంలో తినగా మిగిలి తడిపిన ఆహార పదార్థాలను పాకీవారికి యిస్తారు. ఈ విషయం గుర్తొచ్చి, అతడికి అసహ్యం అన్పించింది. తిండి మానేసి పేటలోకి బయల్దేరాడు. తన మిత్రుడు చాకలి రామ్‌చరణ్ చెల్లెలి పెళ్ళి ఆరోజు జరుగుతోంది. అక్కడికి వెళ్ళి మిఠాయిలు తినొచ్చునని గూడెంలోకి వెళ్ళాడు. అప్పటికే అక్కడికి మాదిగ ఛోటా కూడా వచ్చాడు. వారికి రామ్‌చరణ్ కన్పించి, గుట్టపైకి వెళ్ళమనీ, తాను వారికి మిఠాయిలు తెచ్చి పెడతాననీ వారిని పంపించాడు. గుట్టపైకి వెళ్ళాక, బఖా తన మిత్రులకు ఆరోజు తనకు జరిగిన అవమానాల గురించి చెప్పాడు. మిత్రుల మాటల సందర్భంలో వాళ్ళు ఆరోజు సాయంత్రం, ఆడాల్సిన హాకీ మేచ్ గురించి ప్రస్తావన వచ్చింది. అప్పుడు బఖాకి హవల్దార్ చరత్‌సింగ్, తనను రమ్మన్న సంగతీ, తనకు హాకీ బ్యాట్ యిస్తానన్న సంగతీ గుర్తొచ్చింది. దాంతో బఖా చరణ్‌సింగ్ యింటికి బయల్దేరాడు.

అగ్రకులానికి చెందిన హవల్దార్ చరత్‌సింగ్, బఖాను సాదరంగా చూశాడు. అతడికి తాను త్రాగే టీలో కొంత టీని గిన్నెలో పోసి తాగేందుకు యిచ్చాడు. బఖాకు మాయకుండా వున్న క్రొత్తగా హాకీ బ్యాట్ యిచ్చి పంపించాడు. ఈ ఆదరణకు ఆయన చూపించిన దయకూ బఖా ఉబ్బి, తబ్బిబ్బయ్యాడు. అతడు ఆయనపట్ల ఎంతగా కృతజ్ఞతాభావం ఏర్పరచుకొన్నాడంటే, ఆ కృతజ్ఞతా భావంతో పది గజాల దూరంలో వున్న సందు మలుపు వద్దకు ఎలా వెళ్ళాలో అన్నది అతడికే అర్థంకాలేదు.

అక్కడ నుంచి హాకీ మ్యాచ్ జరిగే ఆటస్థలానికి వెళ్ళాడు. హాకీ ఆడాడు. గోల్సు కొట్టాడు. కానీ అవతలి జట్టువాళ్ళు అతడు కొట్టిన గోల్సు అంగీకరించక, వివాదం లేవదీశారు. అది పెద్ద గొడవగా మారి, యిద్దరు జట్లలోవాళ్ళూ కొట్లాడుకొన్నారు. ఆ కొట్లాటతో ఒకరిపై మరొకరు రాళ్ళు విసురుకున్నారు. అలా విసిరిన రాయి ఒకటి, ఆటను చూస్తున్న, బఖా జట్టులోని సభ్యుడైన ఒక అగ్రకులపు ఆటగాని తమ్మునికి తగిలింది. అతడికి గాయమై రక్తం కారుతోంది. అప్పుడు బఖా ఆ కుర్రాడిని ఎత్తుకొని వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. ఆ కుర్రాడి తల్లి, తమ కొడుకును బఖా మైలుపరిచాడనీ, బఖానే గాయపర్చాడనీ ఆరోపిస్తూ, బఖా చెబుతున్నా వినకుండా అతడిని తిట్టి అవమానపరిచింది.

దాంతో ఏంచేయలేక యింటిముఖం పట్టాడు బఖా. ఇంటికి చేరిన అతడ్ని తండ్రి, 'యిప్పటిదాకా పాయిఖానాల పని మానేసి ఎక్కడ తిరిగొచ్చావు!' అంటూ కోపంతో తిట్టి, తన యింటిలో వుండొద్దనీ, వెళ్ళిపొమ్మనీ అరిచాడు. అలా యింటిలో నుండి వెళ్ళిపొమ్మని తండ్రి తిట్టడం మామూలు విషయమేనయినా, ఈసారి మాత్రం బఖాకు రోషం వచ్చింది. అందువల్ల బఖా యిల్లు వదిలిపెట్టి బయట ప్రపంచంలోకి పయనమయ్యాడు.

విచారంతో, ఆరోజు జరిగిన అవమానాల బాధతో, బఖా ఆలోచించుకొంటూ, గుట్టపైన వున్న ఒక బండరాయిపై తన స్నేహితులకు కనబడేవిధంగా ఒంటరిగా కూచొన్నాడు. అలా దిగులుగా కూర్చొని

ఆలోచించుకొంటున్న బఖాను కల్నల్ హచిన్‌సన్ అనే, క్రైస్తవ మత తెగ అయిన సాల్వేషన్ ఆర్మీ అధిపతి గమనించి, బఖా వద్దకు చేరుకొన్నాడు. ఇతడు అంటరానివాళ్ళ గూడెంలో తిరుగుతూ, వాళ్ళను క్రైస్తవ మతంలోకి మార్పిడి చేసే పనిని పట్టుదలతో సాగిస్తున్న వ్యక్తి. గత 30 సంవత్సరాలలోనూ కష్టపడి ఒక ఐదుగురిని క్రైస్తవ మతంలోకి మార్చగలిగాడు. తన యింటి ఆవరణలోనే ఒక చర్చిని కట్టించాడు. హచిన్‌సన్ బఖాను సమీపించి, అతడి భుజంమీద చెయ్యివేసి 'ఏమిటి సమస్య?' అంటూ ప్రశ్నించాడు. అతడు మత బోధకుడు అయినప్పటికీ, తెల్లజాతివాడు కావటంతో బఖా దృష్టిలో అతడు తెల్లదొరే!. అంతటి తెల్లదొర, తనను ముట్టుకొని, తన సమస్య గురించి ప్రశ్నించటం బఖాను ఆశ్చర్యపరిచింది. ఆనందం కలిగించింది. ఆ తెల్లదొర ధరించే పంట్లాము లాంటి, తెల్లటి పంట్లాము తొడుక్కోవాలని బఖా ఎంతో కాలంగా అనుకొంటున్నాడు. ఇప్పుడు, హచిన్‌సన్ దొరను అతడు తొడుగుకోకుండా వదిలిన ఒక పంట్లాము యివ్వమని అడుగుదామని బఖా అనుకొన్నాడు. అలా భుజంమీద చెయ్యివేసిన దొరకు, బఖా సలాం దొరా! అంటూ సలాం చెప్పాడు. వచ్చీరాని స్థానికభాషలో 'ఏం జరిగింది?' అంటూ హచిన్‌సన్ బఖాను అడిగాడు. 'ఏంలేదు దొరగారూ! నేను అలసిపోయాను!' అంటూ జవాబు చెప్పాడు బఖా. 'నేనెవర్నో నీకు తెలుసుకదా! నేను ఒక మత బోధకుడ్ని. మా దేముడు ఏసు మెస్సయ్య! నువ్వు ఏదైనా కష్టాల్లో వుంటే చర్చిలో వున్న ఏసు మెస్సయ్య దగ్గరికి రా!' అన్నాడు హచిన్‌సన్.

"ఏసు మెస్సయ్యా అంటే ఎవరు" ప్రశ్నించాడు బఖా.

"ఆయన మా దేముడు. దైవపుత్రుడు. మనల్ని క్షమింపబడటం కోసం ఆయన మరణించాడు" చెప్పాడు హచిన్‌సన్. బఖాకు, మనం ఎందుకు క్షమింపబడాలో, అందుకోసం ఆ దైవపుత్రుడు ఎందుకు మరణించాడో అర్థం కాలేదు. అయినా హచిన్‌సన్ చెప్పుకుపోతూనే వున్నాడు. "ఆయన మనందరినీ ప్రేమిస్తున్నాడు కాబట్టి ఆత్మ త్యాగం చేశాడు. మనందరికీ పేదవాళ్ళకీ, ధనవంతులకీ, బ్రాహ్మడికీ – భంగీకీ (పాకీవాడికీ) సహాయం చేయటం కోసం మరణించాడు". "మనమందరం పుట్టుకతోనే పాపులం. మనం మన పాపాలను ఒప్పుకోవాలి! అప్పుడు మాత్రమే ఆయన మనలను క్షమిస్తాడు". "రా! నువ్వు వచ్చి, చర్చిలో నా ముందు నీ పాపాలన్నింటినీ ఒప్పుకో! ఏసు మెస్సయ్య నువ్వు మరణించిన తర్వాత నిన్ను స్వర్గంలో ఆహ్వానిస్తాడు!" అన్నాడు. బఖాకు తనను పాపి అని పిలవటం నచ్చలేదు. తాను చేసిన పాపాలేమీ బఖాకు గుర్తురాలేదు. ఆ ఏసు మెస్సయ్యా ఎవ్వరో అర్థంకాలేదు. అయినా పంట్లాం మీద ఆశతో బఖా హచిన్‌సన్ వెంట అతడితో వెళ్ళాడు. హచిన్‌సన్ అతడికి ఆ యింటి ఆవరణలో తాను కట్టిన చర్చిని చూపించాడు. ఇంతలో హచిన్‌సన్ భార్య యింట్లోంచి బైటికి వచ్చి, కోపంగా, యింకా నీకు బుద్ధిరాలేదా! ఆ మురికి పాకీవాళ్ళు, మాదిగోళ్ళ మధ్యే తిరుగుతున్నావా? అంటూ ప్రశ్నించింది. ఆమె అన్నమాటలు అర్థంకాకపోయినా పాకీవాడు (భంగీ) చమర్ (మాదిగాడు) అన్న మాటలు తనను గురించే అన్నవని బఖాకు అర్థమయింది. అతడికి ఉదయం తనను తాకి 'మైలపడ్డాను' అంటూ గోలచేసిన వ్యక్తి ముఖంలో కనపడ్డ హేయభావమే ద్వేష భావమే హచిన్‌సన్ భార్య యొక్క తెల్ల ముఖంలో కూడా కనబడింది. 'ప్రతీవాళ్ళూ మేమే తప్పుచేశాం అని భావిస్తారు. ఈయనేమో నన్ను వచ్చి నా పాపాలను ఒప్పుకోమంటున్నాడు'! అని మనస్సులోనే తర్కించుకొన్న బఖా, సలాం! దొరా! అంటూ చెప్పి, హచిన్‌సన్ యింటి నుండి బయటకు వచ్చేశాడు.

అతడు తన జ్ఞాపకాల భారంతో అణచివేయబడి, శూన్యంగా అలా నడుస్తున్నాడు. నడుస్తూ రైల్వే ఫుట్ బ్రిడ్జి మీదకు వచ్చాడు. క్రింది నుండి ఒక రైలు వెళ్ళిన శబ్దమయింది. స్టేషన్ వైపు చూస్తే అక్కడ ఆగిన రైలు చుట్టూ జనం గుమిగూడి వున్నారు. ప్లాట్‌ఫారం అంతా జనంతో నిండిపోయింది. ఫుట్‌బ్రిడ్జి మీదకు కూడా జనం తోసుకొని వస్తున్నారు. ఇంతలో జనంలో నుండి ఎవరో 'గాంధీ మహాత్ముడు వచ్చారు! ఆయన బహిరంగసభలో ప్రసంగిస్తారు' అని అరచినది వినబడింది. చూస్తుండగానే జన ప్రవాహం పెరిగిపోయింది. అందరూ బహిరంగసభ జరిగే పార్కులోకి తోసుకొంటూ వెళ్తున్నారు. ఎవరో 'ఆయన దేముడి అవతారం. ప్రభుత్వం ఆయనకు భయపడుతుంది' అంటున్నారు. గుంపులు గుంపులుగా త్రోసుకుని వెళ్తున్న జనం గాంధీగారి గొప్పతనాన్ని పొగడ్తున్నారు. అప్పుడు బఖాకు తాను తమ గూడెంలో గాంధీగారిని గురించి విన్న విషయం గుర్తుకొచ్చింది. 'గాంధీగారు అంటరానివారి ఉద్ధరణ కోసం పాటుపడుతున్నారనీ; యిటీవలనే ఆయన భంగీల, చమర్ల కోసం నిరాహార దీక్ష చేశారనీ' అతడు విన్నాడు. అయితే నిరాహారదీక్ష, నిమ్నకులాలవారికి ఎలా సహాయం చేస్తుందన్నది అతడికి అర్థంకాలేదు. ఇంతలో కాంగ్రెసు వలంటీర్ ఒకరు, 'ఆయన ఈరోజు స్వదేశీ ఉద్యమం గురించీ, సహాయ నిరాకరణ గురించీ మాట్లాడరు. ఆయన కేవలం హరిజనుల సమస్య మీద మాత్రమే మాట్లాడాలి. ప్రభుత్వాన్ని విమర్శించకూడదు అన్న షరతు మీద జైలు నుండి ప్రభుత్వం విడుదల చేసింది' అని ప్రకటించాడు. అది విన్న బఖా గాంధీగారు మా గురించి ఏం మాట్లాడుతారో? అన్న కుతూహలంతో తానూ ఆ సభకు వెళ్ళ నిశ్చయించుకొన్నాడు. వెళ్ళి యీరోజున తనకు జరిగిన అవమానాల గురించి ఆయనకి చెప్పాలనుకొన్నాడు. గాంధీగారు పౌరులను తనను అలా అవమానించినందుకు గట్టిగా మందలిస్తారనుకొన్నాడు. అందువలన యిక యిప్పుడు ప్రొద్దుట జరిగినట్లు జరగదని అనుకొన్నాడు. మహాత్మాగాంధీకి జై! అన్న నినాదాలతో వూరంతా మారు మ్రోగుతోంది. జనంలో నుండి ఒక వారగా తప్పుకొని బఖా సభ జరిగే పార్కుకు చేరుకొన్నాడు. అప్పటికీ గాంధీగారు ప్రసంగించబోయే వేదిక చేరుకోవటానికి వీలు లేనంత దూరం జనంతో నిండిపోయింది. అప్పుడు, అనేకమంది యితరుల మాదిరి బఖా కూడా, ఒక చెట్టు ఎక్కి, ఆ చెట్టు మీద నుండి గాంధీగారిని చూసే విధంగా ఒక కొమ్మపై కూర్చొన్నాడు.

గాంధీగారు వేదికపై ఒక భారతీయ స్త్రీకి, ఒక ఆంగ్ల వనితకు మధ్యన కూర్చొన్నారు. ఆ భారతీయ స్త్రీ శ్రీమతి కస్తూర్బాయి గాంధీ. ఆ ఆంగ్లేయ స్త్రీ, మీరాబెన్‌గా పిలవబడుతున్న మిస్. స్లేడ్. ఆమె గాంధీగారి శిష్యురాలు. అనేకసార్లు మహాత్మాగాంధీకీ జై! అన్న నినాదాలు యిచ్చిన అనంతరం ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

ముందుగా, దైవప్రార్థన చేసి అనంతరం తన ప్రసంగం మొదలెట్టారు గాంధీ. "నేను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చెయ్యను అన్న షరతు మీద నన్ను జైలు నుండి వదిలిపెట్టారు. అందువలన నేను హిందూయిజం నుండి, ఎవరిని పరాయివారుగా మార్చి, విడదీయటం కోసం, వారికి ప్రత్యేక చట్టబద్ధ, రాజకీయ అంతస్థును, ప్రతిపత్తిని బ్రిటిష్ ప్రభుత్వం కల్పించబోతోందో? అటువంటి 'అంటరానివారు' అనబడే వారి గురించి మాత్రమే మాట్లాడుతాను.... నేను అంటరాని తనాన్ని, హిందూయిజం మీది మచ్చగా భావిస్తాను.... నా చిన్నప్పుడు మా యింటి పాయిఖానాను శుభ్రపరిచేందుకు ఉకా అనే కుర్రాడు వచ్చేవాడు. అతడ్ని ముట్టుకొంటే మైలపడతాననీ, శుద్ధి చేసుకోవాలనీ మా అమ్మ చెప్పేది. మా అమ్మకు ఆమె చెప్పేది తప్పనీ, ఉకాను ముట్టుకోవటం పాపము కాదనీ చెప్పాను. బడికి వెళ్ళే దారిలో అంటరానివారిని ముట్టుకొనేవాణ్ణి. ఆ విషయం దాచకుండా యింట్లో వాళ్ళకు చెప్పేవాణ్ణి.

జాతీయ దినం రోజున నేను నెల్లూరులో వున్నాను. అక్కడి అంటరానివారిని నేను కలిశాను. ఈరోజు మాదిరిగానే, ఆరోజున నేను అక్కడ ప్రార్థన చేశాను. నేను పాకీ పనిని ప్రేమిస్తాను. మా ఆశ్రమంలో ఒక పద్దెనిమిది సంవత్సరాల బ్రాహ్మణ యువకుడు, పాయిఖానాలను శుభ్రం చేస్తాడు. ఆశ్రమంలోని పాకీవాడికి పాయిఖానాలను సరిగా శుభ్రం చేయటం నేర్పటం కోసం అతడలా చేస్తాడు. నేను యింకో జన్మలో పుడితే పాకీపనివానిగానే పుట్టాలని కోరుకొంటాను. ఒకవేళ యీ సభలో అంటరానివారు ఎవరైనా వుంటే, వారు తాము హిందూ సమాజాన్ని శుభ్రపరుస్తున్నట్లుగా గుర్తించాలి. వారు తమను తాము శుద్ధి చేసుకోవాలి!. వారు పరిశుభ్రతకు చెందిన అలవాట్లను అలవర్చుకోవాలి! వేరెవ్వరూ వారి వ్యక్తిగత పరిశుభ్రత గురించి వేలెత్తి చూపించకుండా వుండటం కోసం వారు ఆ అలవాట్లు చేసుకోవాలి. వారిలో కొందరు త్రాగుడికి, జూదానికి బానిసలయ్యారు. ఆ దురలవాట్లను వారు వదిలించుకోవాలి!.. తమను తాము విముక్తం చేసుకోవటానికి వారు తమను తాము ప్రక్షాళన చేసుకోవాలి. సారా త్రాగటం, చచ్చిన గొడ్ల మాంసం తినటం లాంటి అలవాట్లను మానుకోవాలి!. వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ అగ్రకులాలవారు కంచాల్లో తిని వదిలిపెట్టిన ఆహార పదార్థాలను అంగీకరించి, తీసుకోవటం మానెయ్యాలి. ధాన్యం – మంచి, గట్టి ధాన్యాన్ని మాత్రమే, అదికూడా మర్యాదపూర్వకంగా యిస్తేనే తీసుకోవాలి!. ఇవన్నీ నేను అడిగినట్లు వారు చేయగలిగితే, వారు తమ విముక్తిని సాధిస్తారు!.. నేనిప్పుడు ఈ దేహంతో బ్రతికి వున్నానంటే అందుకు కారణం అంటరానివారి విముక్తి, గోసంరక్షణ అన్న బలమైన యిచ్ఛల వల్లనే!. ఇవి పూర్తిచేయగలిగితే, స్వరాజ్యం వచ్చినట్టే! ఆరకంగా, ఆ కోర్కెలు పూర్తిలో నా ఆత్మయొక్క విముక్తి వుంది. అంతిమంగా ఆత్మ విమోచనం జరిగేందుకు అవసరమైన శక్తిని మీకిమ్మని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను!. నాకు అంటరానివారి సమస్య అంటే, అది నైతికతకు, మతానికి సంబంధించినది. నేను అంటరానివాని గురించి ఆమరణ నిరాహారదీక్ష చేపట్టానంటే, అందుకు కారణం నా మనస్సాక్షి నాకు యిచ్చిన పిలుపే!"

"అంటూ ఆయన తన ఉపన్యాసాన్ని ముగించారు. వెంటనే మహాత్మాగాంధీకి జై! అంటూ నినాదాలతో ఆ ప్రాంగణమంతా మారుమోగిపోయింది. మెల్లగా జనం సభ జరిగిన ప్రాంగణం నుండి బయటకు వెళ్తున్నారు. గాంధీగారు, తమను గురించి చెప్పినందువలన ఆయన మంచిమనిషే అనుకొన్నాడు బఖా. సభ నుండి బయటికి వెళ్తున్న జనాలు గాంధీగారు చెప్పిన విషయాల గురించి చర్చించుకొంటున్నారు. సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తమ తమ సమస్యలు ఆయన పరిష్కరించగలరా? అని ప్రశ్నించుకొంటున్నారు. కాంగ్రెసు కార్యకర్తలయితే విదేశీ వస్తు, వస్త్రాల బహిష్కరణ ముమ్మరం చేయాలని జనాలకు చెప్తున్నారు.

జనానికి దూరంగా ఒక వారగా బయటికెళ్తున్న బఖా కూడా గాంధీగారు చెప్పిన విషయాల గురించి ఆలోచిస్తున్నాడు. ఆయన చెప్పిన విషయాలన్నీ అర్థం కాకపోయినా, ఆయన బాగానే చెప్పారని అతడు అనుకొన్నాడు. గాంధీగారు చెప్పిన పాకీ కుర్రాడు ఉనా యొక్క వివరం బఖాకు నచ్చింది. ఆయన తన ఆశ్రమంలో ఒక బ్రాహ్మణుడు పాయిఖానాలు శుభ్రం చేస్తున్నట్లు చెప్పారు. అంటే దాని అర్థం తాను పాయిఖానాలు శుభ్రం చేస్తూ వుండాలనే గదా? అన్న ప్రశ్న అతడికి ఏర్పడింది. అవును! అన్న జవాబు వచ్చింది. దీనర్థం నేను జీవితాంతం పాకీదొడ్లను శుభ్రం చేస్తూనే వుండాలా? అని అన్పించింది బఖాకు. ఇది మాత్రం అతడికి నచ్చలేదు. మహాత్ముడు పాకీవానిగా పునర్జన్మించాలని కోరుకోవటం, ఆయన పాకీపనిని ప్రేమించటం అన్న విషయాలు అతడికి నచ్చాయి. కానీ ఆయన తమను దురలవాట్లకు బానిసలని నిందించటం నచ్చలేదు. అగ్రవర్ణాలు వారు తినగా కంచాల్లో మిగిలిన ఆహారన్ని యిస్తే అది తీసుకోవద్దు అని గాంధీగారు చెప్పిన అంశం బఖాకు నచ్చింది. మొత్తంగా చూస్తే ఆయన చెప్పినట్లే చేయాలనిపించింది.

ఇంతలో అక్కడ యిద్దరు దేశీయ సాహిబ్‌లు, గాంధీగారు చెప్పిన విషయాలు గురించి పెద్దగా అరుస్తూ చర్చించుకోవటం బఖా చూసి, వారు మాట్లాడుకొంటున్నది విన్నాడు. ఆ వాదించుకొంటున్నవారిలో ఒకరు బారిష్టరు ఆర్.ఎన్. బషీర్, బి.ఎ (ఆక్సన్)గారు. రెండవ సాహిబ్ 'నూతన శకం' అన్న పత్రిక సంపాదకుడిగా వున్న, ఆధునిక కవి ఇక్బాల్‌నాథ్ సర్సార్.

"గాంధీగారు ఒక హంబగ్. ఆయన ఒక తెలివితక్కువవాడు. ఆయనొక కపటి. ఒకవైపు అంటరానితనం నిర్మూలింపబడాలని కోరుకొంటాడు. మరోవైపు తాను ఒక సదాచారపరుడైన సనాతన హిందువునని నొక్కి చెబుతాడు. అతడు ప్రజాస్వామ్య భావాలకు వ్యతిరేకంగా పరిగెత్తుతున్నాడు" అని బారిష్టరుగారు అరిచారు.

"మీరు చెప్పింది సరికాదు. రాజకీయ, ఆర్థిక విషయాలపట్ల గాంధీగారి అభిప్రాయాలకన్నా, అంటరానితనం నిర్మూలించాలన్న విషయం పట్ల ఆయన అభిప్రాయాలు దృఢమైనవి. ఆయన కొన్ని పాతకాలంనాటి ఆలోచనలతో, నేటి యంత్ర యుగానికి వ్యతిరేకమైన అభిప్రాయాలను కల్గి వుండొచ్చు! ఏది ఏమైనా మనం కులాన్ని ధ్వంసం చేయాలి! మనం పుట్టుక ద్వారా వచ్చిన అసమానతలను, మార్పు చేయవీలులేని వృత్తుల విధానాన్నీ ధ్వంసం చేయాలి! మనం ప్రతి ఒక్కరి

యొక్క హక్కులు, అవకాశాలు, ప్రత్యేక సదుపాయాల సమానత్వాన్ని గుర్తించాలి! గాంధీగారు అలా చెప్పని మాట నిజమే! అయినా యిప్పటికే బ్రిటిష్ శిక్షాస్మృతి కులానికి వున్న చట్టబద్ధ, సామాజిక ప్రాతిపదికను పగలగొట్టి న్యాయస్థానం ముందు ప్రతి ఒక్కరి హక్కులను గుర్తించింది కనుక, యిప్పుడు కులం అన్నది వృత్తిని బట్టి కొనసాగుతోంది. పాకీవారు తమ వృత్తిని మార్చుకొన్నప్పుడు యిక అంటరానితనం అన్నదే వుండదు. మానవ మలాన్ని, చేతితో శుభ్రం చేయాల్సిన అవసరం లేకుండా, యంత్ర సాధనమైన ఫ్లష్ సిస్టం (నీటితో మలాన్ని కొట్టివేసే విధానం) ప్రవేశపెడితే, యిక పాకీవారు అంటరానితనం యొక్క అవమానాల నుండి బయటపడి హుందాగా, గౌరవప్రదంగా బ్రతకొచ్చు. ఒక కులరహిత, వర్గరహిత సమాజంలోని సభ్యులుగా తమ గౌరవప్రదమైన హోదాను వారు హక్కుగా పొందవచ్చును!" అంటూ ఆ బారిష్టరుకు, ఆధునిక కవి ఇక్బాల్‌నాథ్, ధారాళంగా జవాబిచ్చాడు.

ఆ ఆధునిక కవి చెప్పిన, మనుష్యులు చేతితో తాకకుండా పాకీదొడ్లు శుభ్రం చేసే యంత్రాన్ని గురించిన విషయం బఖాకు బాగా నచ్చింది. ఆయన చెప్పిన యంత్రంతో, గాంధీగారు చెప్పినట్లు పాయిఖానాలు శుభ్రం చేసేపని కొనసాగించవచ్చునని బఖా అనుకొన్నాడు. అయితే ఆ కవిగారు కనబడినప్పుడు ఆ పాకీదొడ్డిని కడిగే యంత్రం గురించిన వివరాలు తెలుసుకోవాలనుకొన్నాడు.

ఇప్పుడు యింటికి వెళ్ళి గాంధీగారు చెప్పిన విషయాలనూ, ఆ కవిగారు యంత్రం గురించి చెప్పిన విషయాలను తన తండ్రి చెప్పాలనే ఉద్దేశ్యంతో బఖా యింటి ముఖం పట్టాడు.

★ ★ ★ ★

ఇది క్లుప్తంగా నవల కథా సంగ్రహం మాత్రమే! నవలను చదివితే పాఠకుడు, నవలా రచయిత ముల్క్‌రాజ్ ఆనంద్‌గారు అంటరానితనం, కులవివక్షత, అగ్రకులాలవారు నిమ్నకులాలవారిని దారుణంగా అణచివేసి, పీడించటం అన్న విషయాలపట్ల ఎంతగా ప్రతిస్పందించారో, ఆ దురాచారాలను ఎంతగా ఎన్ని కోణాల నుంచి విశ్లేషించారో, కుల నిర్మూలనను, సామాజిక సమానత్వాన్ని ఎంతగా కోరుకొన్నారో అర్థమవుతుంది. నిమ్నకులాలవారి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక దుస్థితినీ, వారి నిస్సహాయతనూ, వారి దీనత్వాన్నీ యీ నవల ద్వారా, ఆయన ప్రపంచమంతటికి బహిర్గతపరచి, కులనిర్మూలనా కృషికి ఎనలేని, సమర్థనీయతను అందజేశారు! ఆ రకంగా ఈ నవలకు నేటికీ ప్రాసంగితను కలుగజేశారు. ✦

కవిత

## ఆకలి కత్తిదూస్తే...

– కంచరాన భుజంగరావు

ఇటు కడు సామాన్యులు
ఈ దేశపు ఆస్తి అప్పు చిట్టాపద్దులతో
ఏ సంబంధమూ ఎరుగనివారు
విదేశీ మారకపు నిల్వలతో
ఏం చేసుకుంటారో తెలియనివారు
గల్లాపెట్టె వడ్డింపుల సంగతి
అస్సలు పట్టనివారు
కొంచెం కొంచెం చెమట తడి పెట్టుకుని
బతుకు నేలలో
ఆశల అరటిపాదులు పెంచుకుంటారు
ప్రతిపొద్దు గుప్పెడు శ్రమతో
ఆకలి దేశపు త్రిశంకు స్వర్గంలో
అన్నం రాళ్ళను పేరుస్తుంటారు
వీరు సంపద సృష్టికర్తలు
చెమటలు చిందిస్తారు
పరోక్షంగా నొప్పి తెలియని
పన్ను బాదుడు భరిస్తారు -

అటు వారెవరో మహానుభావులు
కార్పొరేట్ గుండెలు ఉప్పొంగేలా
ఆసియాలో తొలి పదిలోనో
ప్రపంచంలో తొలి వందలోనో
కొన్ని సమాంతర వ్యాపార శిఖరాలై
ఎవరెస్టు ఎత్తుల్ని మించి ఎదుగుతారు
శ్రమను దోచి సంపద పోగుల్ని
సమున్నతంగా నిలబెడతారు
వాటి పైన ఒక బ్రాండ్ నేమ్
జెండాలా ఎగరేస్తారు
వారి పీఠాల కింద పీటలై పడుండేలా
కొత్త కొత్త క్రోనీ చుట్టాలతో దోస్తీ చేస్తారు
ఆర్థికపుష్టి సరిపోనప్పుడు
బ్యాంకులను బురిడీకొట్టిస్తారు
ఆ సంపద భోక్తలు
చెమట నెత్తురు తాగుతారు
యంత్రాంగాన్ని శాసిస్తారు
వారి వ్యాపారాల్లో లాభం కోసమే
పాలసీలు రూపుకడతాయి -

ఈ నేల మీద ఊపిరి మొగ్గై
మొలిచిన ప్రతి బిడ్డకు
సమాన హక్కున్న సహజ వనరుల్ని
ఏ కొందరి కోసమో
పంచిపెట్టే పెద్దన్న అటువైపు చుట్టమే!
విచిత్రమేమంటే
ప్రభుత్వాలు చేయలేనిది
ఆ ప్రభుద్దులే చేయగలరని
ఒక నమ్మకం కలిగిస్తారు
వారే ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు
సంపద సృష్టిస్తున్నట్టు
ఎలమీద కీర్తించబడతారు
ప్రత్యేక పన్ను రాయితీలు
చౌక లీజు భూకేటాయింపులు
ఇంకెన్నో ప్రోత్సాహకాలు పొందుతారు

ఈ దేశం
సంపన్నుల సొంత జాగీరేమీ కాదు కదా
ఈ నేలకు పేదలెవరూ
పరాయివారు కాదు కదా
ఈ గాలికి సామాన్యులు
పట్టనివారేమీ కాదు కదా
నల్ల ద్రాక్ష కొమ్మల్ని
అందీఅందని ఎత్తులోనే ఉంచి
బీదల్ని నక్కల్ని చేసి ఊరిస్తున్న
కనపడని చెయ్యి ఎంత కసాయిదో!?

ఆకలి కత్తిదూస్తే మాత్రం
కొమ్మే తెగుతుందో...?
కొమ్మను పట్టుకుని ఆడిస్తున్న
చెయ్యే తెగుతుందో...? ✦

## జాతీయ అక్షరయోధులు



# గౌరీ లంకేశ్

( 1962 - 2017 )



1

**సింగంపల్లి అశోక్‌కుమార్**

## గౌరీ లంకేశ్

### ప్రజా ఉద్యమాలకు ప్రచార ధ్యేయం
### మతమౌఢ్య మహాకాయానికి కత్తిగాయం
### ఓపిక ఉన్నంత వరకు కాదు, ఊపిరి
### ఉన్నంత వరకు పోరాడమన్న పాత్రికేయం

**'సమసమాజ స్థాపనకు కాగడాలైనవారి వెలుగుబాటలో అడుగులేయడమే నా విధానం... ప్రజాందోళనల్లో పాల్గొన్న యువ కార్యకర్తలంతా నా కన్నబిడ్డలే... ఓపికున్నంతవరకు కాదు, ఊపిరున్నంతవరకు పోరాడాలి' అంటూ ప్రకటించిన పాత్రికేయ చైతన్యం-అనన్యం, అసామాన్యం, కదంతొక్కిన కలంసైన్యం అయిన గౌరీ లంకేశ్, భారతీయ కన్నడ రచయిత్రి, జర్నలిస్ట్, ప్రజాతంత్ర భావవిప్లవ క్రియాశీల కార్యకర్త.**

చిన్నప్పటి నుండి జర్నలిజంపై ఆసక్తివున్న గౌరి పలు ఇంగ్లీషు, కన్నడ పత్రికలలో పని చేస్తూ ప్రజాసమస్యలపై కథనాలు అందించారు. ఆమె మతవాదుల్ని, హిందూత్వవాదుల్ని లౌకిక కోణంలో విమర్శించారు. కొంతకాలం 'టైమ్స్ఆఫ్ ఇండియా'లో పనిచేశారు. వామపక్ష రచయిత, పత్రికా సంపాదకుడయిన తన తండ్రి పి. లంకేశ్ మరణించిన తర్వాత, ఆయన 1980 నుండీ నడిపిన 'లంకేశ్' వార్తాపత్రికను సోదరుడు ఇంద్రజిత్‌తో కలిసి కొన్నేళ్లు నడిపారు. తరువాత సొంతంగా 'గౌరీలంకేశ్ పత్రిక' అనే వారపత్రికతో పాటు పలు ప్రచురణలు ప్రారంభించారు.

ఆమె మూఢాచారాలకు వ్యతిరేకపోరాటం సాగించారు. సమాజంలోని అసమానతలు, దురాచారాల నిర్మూలనకు ఉద్యమిస్తున్నవారికి, వారు సాగించే ఆందోళనలకు, ఉద్యమాలకు 'గౌరీలంకేశ్' పత్రికలో గొప్ప ప్రచారం ఇచ్చారు. గత దశాబ్దన్నర కాలంగా కన్నడనాట జరిగిన అన్ని ప్రజాఉద్యమాలతో మమేకమయ్యారు. ఎంగిలాకులపై పొర్లుదండాల దుష్టాచారానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి మద్దతిచ్చారు. బాబాబుడాన్‌గిరి దత్తపీఠం వివాదంలో సంఘపరివార్ శక్తుల్ని అడగడుగునా అడ్డుకునేందుకు, మతసామరస్య సాధనకు శక్తివంచన లేకుండా కృషిచేశారు. పిల్లలు లేని గౌరి దళిత యువజన కార్యకర్త జిగ్నేశ మేవానీ, విద్యార్థి నాయకుడు కన్నయ్యకుమార్, ఉద్యమకారులైన ఉమర్ ఖలీద్, షెహ్లా రషీద్ షోరాలను తన దత్తపుత్రులుగా చెప్పుకున్నారు. జీవితాంతం అణగారిన వర్గాల కోసం పోరాటం చేస్తునే వున్నారు.

హిందుత్వవాదులపై నిక్కచ్చి కథనాలకు రెండు పరువునష్టం కేసుల్లో కోర్టు ఈమెను దోషిగా పేర్కొని ఆరునెలలు జైలుశిక్ష విధించింది. అదే రోజు కోర్టు ఆమెకు బెయిలు మంజూరు చేసింది. ఆమె అసామాన్య చైతన్యాన్ని ఎదుర్కోలేక బెంగుళూర్ రాజేశ్వరినగర్‌లో నివసిస్తున్న గౌరీని సాయంత్రం నాలుగు గంటలకు గుర్తుతెలియని హిందుత్వవాద హంతక ముఠా ఆమెను ఆమె ఇంటివద్దే కాల్చిచంపారు. ఈ ముఠాయే 2013 ఆగస్టు 20న మరాఠీ హేతువాది నరేంద్ర ధబోల్కర్(67)నూ, 2015 ఫిబ్రవరి 28న మరాఠీ చరిత్రకారుడు గోవింద పన్సారే(82)నూ, 2015 ఆగస్టు 30న కన్నడ రచయిత ఎం.ఎం. కల్బుర్గి(76)ని హత్య చేసింది.

మితవాద హిందుత్వవాద వ్యతిరేక, కులవివక్ష వ్యతిరేక,మహిళ హక్కుల ప్రచార పోరాటాల కృషికిగాను 'అన్నా పొలిట్ కోవస్కాయా అవార్డు'★ను గౌరీ అందుకున్నారు.

నిత్యచైతన్య నిబద్ధయుద్ధ పాత్రికేయురాలు గౌరీలంకేశ్ 1962 జనవరి, 29న బెంగళూరులో జన్మించారు. 2017 సెప్టెంబర్, 05న బెంగళూరులో హత్యకు గురై కన్నుమూశారు. ✦

★ రష్యన్ మహిళా జర్నలిస్టు కోవస్కాయా, రష్యన్ ఫెడరేషన్ చెచెన్యాపై చేస్తున్న యుద్ధంపై వాస్తవ కథనాలు అందించడం నచ్చక ఆమెను మాస్కోలో 7 అక్టోబరు 2006న హత్య చేశారు. ఆమె జ్ఞాపకార్థం ఈ అవార్డు పెట్టారు.

స్పందన

# కదిలించిన "జై భీమ్" సినిమా

– చెరుకూరి సత్యనారాయణ

**నవంబర్** 2వ తేది అమెజాన్ ప్రైమ్ ద్వారా "జై భీమ్" అనే సినిమా విడుదలై ప్రేక్షకుల విశేష ఆదరణకు పాత్రమైన విషయం పాఠకులకు తెలిసే వుంటుంది. 1993లో దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షించిన ఒక యదార్ధ సంఘటన ఆధారంగా ఈ చిత్రం నిర్మితమైంది. ప్రముఖ తమిళ సినీ హీరో సూర్య (సురియ శివకుమార్) అతని భార్య జ్యోతిక నిర్మించిన ఈ చిత్రానికి జ్ఞానవేల్ దర్శకత్వం వహించారు. సూర్య న్యాయవాది చంద్రు పాత్ర ధరించగా లిజోమల్‌జోస్, మణికంఠన్ నాయికా నాయకులుగా నటించారు.




1993లో జరిగిన సంఘటన ఏమిటంటే తమిళనాడులోని కడలూరు జిల్లాలో నివసించే అంద్రైకురుంబన్ అనే సంచార జాతికి (మన రాష్ట్రంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచులు లాంటివారు) ఎలుకలు, ఉడతలు పట్టుకొని వాటిని ఆహారంగా తీసుకుంటూ పాములు పట్టటం, ఇతర కూలీ పనులు చేస్తూ జీవిస్తుంటారు.

ఈ తెగకు చెందిన నల్లకన్ను – సెంగాని అనే భార్యాభర్తలు ఉంటారు. ఈ నల్లకన్నుని ఒక చేయని దొంగతనం నేరంలో అక్రమంగా నిర్బంధించి అతణ్ణి, అతని తమ్ముణ్ణి, బావని కూడా తీవ్ర చిత్రహింసలకు గురిచేస్తారు. ఈ హింస కారణంగా నల్లకన్ను లాకప్‌లోనే మరణిస్తాడు. చనిపోయిన నల్లకన్నును ఒక కాలువలో పారేసి మిగిలిన ఇద్దర్నీ వేరే స్టేషన్ కేసుల్లో ఇరికించి జైలుపాలు చేస్తారు. నల్లకన్ను భార్య సెంగాని తన భర్త జాడ కోసం చేసిన న్యాయపోరాటం ఫలితంగా నేరస్తులైన పోలీసులకు 14 సంవత్సరాల కారాగార శిక్ష పడుతుంది. ఈ పోరాటంలో మొదట ఆమె స్థానిక సి.పి.యం. నాయకులు గోవిందన్‌ను కలసి సహాయాన్ని అభ్యర్థించగా ఆయన న్యాయవాది చంద్రుకి ఈమెను అప్పగించి న్యాయం చేయమంటాడు.

విద్యార్థి దశ నుండి వామపక్ష ఉద్యమాలతో సాన్నిహిత్యం ఉన్న ఈ చంద్రు డిగ్రీ చదువుతున్న కాలంలోనే మద్రాసు లయోలా కాలేజి నుండి బహిష్కరణకు గురై మద్రాసు క్రిష్టియన్ కాలేజిలో చేరి డిగ్రీ పూర్తిచేశాడు. అక్కడ కూడా హాస్టల్‌లో వసతి నిరాకరిస్తే నిరవధిక నిరాహార దీక్ష చేసి దాన్ని సాధించాడు. 1973లో 'లా'లో చేరాడు. సి.పి.యం. పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా వుంటూనే ఒక లా ఫర్మ్‌లో పనిచేశాడు. శ్రీలంక సమస్యపై పార్టీ నిర్ణయంతో విభేదించి పార్టీ నుండి బహిష్కరించబడ్డాడు. పేదలు, స్త్రీలు, ఆదివాసీలు, మానవహక్కుల హననానికి గురైనవారి కేసులు ఎక్కువగా వాదించినా ఏనాడు ఒక్క పైసా ఫీజు కూడా వారి నుండి తీసుకోలేదని ఆయన ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. తర్వాత కాలంలో (2006) ఆయన హైకోర్టు న్యాయమూర్తిగా నియమించబడ్డాడు.

సినిమా విషయం పక్కన పెట్టి జస్టిస్ చంద్రు గురించి మరి కొంచెం చెప్పుకుందాం.

ఈయన 2013లో పదవీ విరమణ చేసిన రోజు తను చెప్పవలసిన తీర్పులన్నీ చెప్పి, తన కిందస్థాయి ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపి, ఉదయం తాను ఎక్కి వచ్చిన అధికార వాహనాన్ని వదిలేసి, అప్పటి వరకు తనకు సేవలందించిన డ్రయివర్‌కి కృతజ్ఞతలు తెలియజేసి, రోడ్డు పైకి నడుచుకుంటూ వెళ్లి రోడ్డు పక్క టీ స్టాల్‌లో టీ తాగి లోకల్ ట్రయిన్ ఎక్కి ఇంటికెళ్లిపోయాడు. పత్రికల్లో 9-3-2013న వచ్చిన ఈ వార్త చదివి ఆసక్తితో ఆయన్ని గూర్చి మరికొంత సమాచారం సేకరించాను. హైకోర్టు న్యాయమూర్తిగా వుండగా ఆయన ఛాంబర్ బయట "ఇక్కడెవరూ దేవుళ్లు లేరు. పూలదండలు తేకండి. ఇక్కడెవరూ ఆకలితో నకనకలాడటంలేదు కనుక పళ్లు, స్వీట్లు తేకండి. ఇక్కడెవరూ చలితో వణికిపోవడంలేదు, శాలువాలు తేకండి" అని బోర్డు వుండేదట. న్యాయమూర్తిగా ఆయనిచ్చిన తీర్పులు కూడా ఎంతో ప్రగతిశీలంగా వుండేవి. దేవాలయాల్లో మహిళల్ని పూజారులుగా నియమించవచ్చని, కులాలవారీగా స్మశానాలు ఉండకూడదని, న్యాయమూర్తుల్ని న్యాయవాదులు "మి లార్డ్" అని సంబోధించటం సరికాదని, బిళ్ల బంట్రోతుల డ్రస్‌కోడ్ వలసకాలం నాటిది కనుక దాన్ని మార్చాలని ఆయన తీర్పులిచ్చాడు. తాను జడ్జిగా వున్న కాలంలో సెక్యూరిటీని నిరాకరించాడు.

హైకోర్టులో హెబియస్ కార్పస్ కేసులలో సాక్షులను విచారించే పద్ధతి లేకపోయినా అత్యవసర పరిస్థితి కాలంలో కేరళలో జరిగిన రాజన్ అనే విద్యార్థి మిస్సింగ్ కేసులో కేరళ హైకోర్టు తీర్పుని ఉదహరిస్తూ నల్లకన్ను కేసులో సాక్షులను హైకోర్టులో విచారించటానికి చంద్రు అనుమతి పొందాడు. ఇదే రకమైన న్యాయం మన రాష్ట్రంలో కూడా జరిగింది. ఇంతా రమణారెడ్డి తదితర నక్సలైట్లపై మోపబడిన హత్య కేసులో ఉమ్మడి ఎ.పి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓ. చిన్నపరెడ్డి సుమోటోగా సాక్షుల్ని హైకోర్టులో విచారించాడు. జస్టిస్ చంద్రు

న్యాయమూర్తిగా పనిచేసిన ఆరున్నరేళ్లలో 90 వేల పైచిలుకు కేసులు పరిష్కరించినట్లు రికార్డులు తెలియజేస్తున్నాయి. న్యాయవాదిగా నాకున్న పరిజ్ఞానం మేరకు ఇది అసంభవమైన విషయంగా నాకు అన్పించినా దీన్ని సంభవం గావించిన జస్టిస్ చంద్రు పనితీరు ప్రపంచ న్యాయ చరిత్రలోనే అపూర్వం. జస్టిస్ చంద్రు 2018లో అఖిల భారత న్యాయవాదుల సంఘం నిర్వహించిన సెమినార్లలో పాల్గొనటానికి విజయవాడ, హైదరాబాద్‌లు వచ్చారు. కాని అప్పటికి చాలామందికి ఆయన్ని గూర్చిన అవగాహన లేదు.

"జై భీమ్" సినిమా కథాకథనం చిత్రీకరణ, నటన, సహజత్వం విషయాల్లో వున్న ప్రత్యేకతలు పక్కన పెడితే జస్టిస్ చంద్రు న్యాయవాదిగా ఉన్న కాలంలో కనబరిచిన ఆదర్శప్రాయమైన ప్రవర్తన, వ్యక్తిత్వం వాదనాపటిమని ఈ చిత్రం గొప్పగా ఆవిష్కరించింది.

ఇక సినిమా విషయానికొస్తే నల్లకన్ను పాత్రను రాజయ్యాగా మార్చగా ఆ పాత్రలో నటించిన మణికంఠన్ అతని భార్య సెంగాని పాత్రని సింతల్లి పేరిట మార్చి ఆ పాత్రలో లిజోమల్‌జోస్‌ల నటన అపూర్వం. మరీ ముఖ్యంగా లిజోమల్‌జోస్ నటన ఇప్పటివరకూ ఏ భారతీయ భాషలో ఏ నటీ నటించనంత సహజంగా, గొప్పగా వుంది. ఇంత సాధికారికంగా ఎందుకు చెబుతున్నానంటే ఎమర్జెన్సీ కాలంలో ఏ పనీలేక నేనూ, డా॥ జంపాల చౌదరి, భరతుడూ, నవోదయ రమేష్‌లం కల్సి "గుంటూరు ఫిల్మ్ క్లబ్" పెట్టాం. అప్పటివరకు దేశంలోని అన్ని భాషల్లో వచ్చిన ఆర్ట్ ఫిలిమ్స్ అన్నీ చూశాం. తర్వాత కాలంలో వచ్చిన ఆర్ట్ ఫిలిమ్స్ తక్కువ. ప్రారంభంలో కొద్దిసేపు మినహా సినిమా చివరి వరకు శోకిస్తూ కన్పించే పాత్రలో లిజోమల్‌జోస్ ఒక్కసారి కూడా గ్లిజరిన్ వాడలేదంటే మహానటి సావిత్రిని ఈమె మించిపోయిందని అర్థమౌతుంది.

లిజోమల్‌జోస్‌కి అర్హమైనంత గొప్ప అవార్డ్ దేశంలో లేదు. ఈమె ఆస్కార్‌కి నామినేట్ కాకపోయినా, ఆ అవార్డ్ రాకపోయినా ఆ అవార్డుకున్న విశ్వసనీయత గూర్చి ఆలోచించాల్సిందే. వాస్తవ కథలో నల్లకన్ను శవాన్ని కాల్వలో పడేస్తే సినిమాలో శవాన్ని రాష్ట్ర సరిహద్దుల్లో రోడ్‌పై పడేసి "హిట్ అండ్ రన్" యాక్సిడెంటుగా చిత్రీకరిస్తారు. ఒకటి రెండు సినిమాటిక్ సన్నివేశాలు మినహా మిగిలిన కథంతా యథాతథంగా చిత్రీకరించారని ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో జస్టిస్ చంద్రు చెప్పారు.

ఇంకా సినిమాలో అడ్వకేట్ జనరల్ పాత్రలో లావు రమేష్, డి.ఐ.జి. పాత్రలో ప్రకాష్‌రాజ్, ఇతర పాత్రల్లో సినరాసు, బుచ్చిబాబు, సాంబయ్యలు కూడా గొప్పగా నటించారు.

హైకోర్టులో కేసు తీవ్రత పెరిగిన తర్వాత రాజీ కోసం పోలీసులు ప్రయత్నిస్తారు. రాజీ మాట్లాడటానికి చంద్రు డి.ఐ.జిలు తిరస్కరించగా డి.జి.పి. స్వయంగా రంగంలోకి దిగి సింతల్లిని పిలిపిస్తాడు. కావల్సినంత డబ్బు, పిల్లల చదువులు కోసం ఏర్పాటు చేస్తామని చెబుతాడు. నేను కడుపుతో ఉన్నాను సార్ రేపు నాకు బిడ్డ పుట్టి పెరిగి నన్ను ఎలా పోషించావు నాకు చదువు ఎలా చెప్పించావు అని అడిగితే మీ నాన్నని చంపినవాళ్లు ఇచ్చిన డబ్బుతో మిమ్మల్ని పోషించానని చెప్పమంటారా సార్ అని అడిగిన సీన్‌లో ప్రేక్షకులు మనసులు ద్రవిస్తాయి.

ఒకచోట అంబేద్కర్ ఫొటో చూపించటం, జైభీమ్ అనే పేరు పెట్టటంతో కులం ప్రాతిపదికన కొందరు సినిమాని విశ్లేషిస్తున్నారు. సినిమాలో అనేకసార్లు చూపించిన కారల్‌మార్క్స్‌ని, ఎర్రజెండాల రెపరెపల్ని వాళ్ళు విస్మరిస్తున్నారు. నిజజీవితంలో సింతల్లి (చినతల్లి) పాత్ర అయిన పార్వతి అలియాస్ సెంగానికి కొద్దిరోజుల క్రితం తమిళనాడు సి.పి.యం కార్యదర్శి ద్వారా 10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించటమేగాక కమ్యూనిస్టుల త్యాగనిరతిని శ్లాఘించాడు సూర్య.

"మార్క్సిజంతోపాటు అంబేద్కర్ ఆలోచనలు కూడా అవసరమని భావించినందునే జైభీం అనే టైటిల్ పెట్టారా?" అని ఇటీవల ప్రముఖ తెలుగు పాత్రికేయుడు తెలకపల్లి రవి చేసిన ఇంటర్వ్యూలో ప్రశ్నించగా ఆయన "అన్ని భాషల్లో విడుదల చేయాలి గనుక తమిళంలో టైటిల్ పెడితే సమస్య. గతంలో జైభీం అనేది దళితులకు సంబందించినదిగా చూసేవారు. ఇప్పుడు అందరూ అంటున్నారు. ఈ చిత్రం విజయవంతం అయింది గనకే ఇవన్నీ మాట్లాడుతున్నారు" అని జస్టిస్ చంద్రు అన్నారు. "సమాజాన్ని, ప్రజల్ని, రాజకీయాల్ని అర్థం చేసుకోవటంలో వామపక్ష రాజకీయాల్తో తనకున్న 50 సంవత్సరాల అనుబంధం ఉపయోగ పడిందని, ఆర్థికవ్యవస్థే న్యాయంతోపాటు, అన్నిటినీ నిర్ణయిస్తుందని" ఆయన ఆ ఇంటర్వ్యూలో చెప్పారు.

సినిమా చివరలో చంద్రు ఆఫీసులో ఆయనతోపాటు సింతల్లి కూతురు కూర్చొని పేపరు చూస్తుంటుంది. చంద్రు చూడగానే కాలుమీద కాలు తీసి నమ్రతగా కూర్చుంటుంది. కాని చంద్రు సైగ చేయటంతో మళ్లీ అలాగే కూర్చుంటుంది. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి అది గొప్ప ప్రదర్శన. నాకు అర్థమైనంతవరకు నిర్మాత, దర్శకులు ఈ సినిమా ద్వారా చెప్పదల్చుకున్న సందేశం అదే.

మామూలుగా సూర్య నటించే చిత్రాల్లో వుండే ఫైట్లు, పాటలు ఈ సినిమాలో లేవు. మొదటే దర్శకుడు జ్ఞానవేల్‌తో సినిమాలో పాటలు, ఫైట్లు వుండవని చెప్పాడట. నేపథ్యంలో మంచి సంగీతం, పాటలు విన్పించారు. లాకప్‌డెత్‌ల కేసుల్లో న్యాయపోరాటం ఎలా చేయాలా ఈ సినిమా ఒక గైడ్‌గా పనిచేస్తుంది.

లాకప్‌డెత్‌లు నల్లకన్ను కేసుతో ప్రారంభమూ కాదు చివరా కాదు దేశవ్యాపితంగా వందల సంఖ్యలో జరుగుతూనే వున్నాయి.

ఈ సినిమా చూసిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ "ఆ రోజు రాత్రి నేను నిద్రపోలేకపోయానని" చెప్పారు. అది కొంత అతిశయోక్తిగా అన్పించినా సినిమాలు చూసే అలవాటు లేని నా చేత ఆ సినిమా చూపించింది. నిజంగా నాకూ ఆ రాత్రి నిద్రపట్టలేదు.

జై భీమ్ అంటే అంబేద్కర్ స్ఫురించే మాట నిజం. అన్నిచోట్లా గాంధీ, నెహ్రూలు కన్పిస్తారు. కాని అంబేద్కర్ ఎందుకు కనపడదని చంద్రూ చేత ఒకచోట అన్పించారు. చిత్రంలో చివరలో "జై భీమ్ అంటే కాంతి, జై భీమ్ అంటే ప్రేమ, జై భీమ్ అంటే చీకటి నుండి వెలుగు వైపు ప్రయాణం, జై భీమ్ అంటే కోట్లాది ప్రజల కన్నీటి చుక్క (Jai Bhim is the tear drop of millions of people)" అనే ఒక మరాఠి కవి కవితతో సినిమాని ముగించారు. ✦

# కళ్ళు మూసి జెల్ల

– శంకరం

**సీత** ఇచ్చిన కాఫీ కప్పు అందుకుంటూ 'వాడు లేవలేదా' అడిగాడు రామనాథం.

రాత్రి ఏవో కంప్యూటర్లో ఉద్యోగాలు అప్లై చేసుకుని పడుకునేటప్పటికి తెల్లారి 3 గం॥ అయ్యిందట. పొద్దుట ఆలస్యంగా లేస్తానమ్మా అని చెప్పి పడుకున్నాడంది సీత.

బన్నీ బాగా చదివేవాడు. చిన్న ఉద్యోగం చేసుకునే రామనాథం తన కష్టార్జితాన్నంతా పిల్లల చదువుల మీదే ఖర్చుపెట్టి మంచి పేరున్న స్కూళ్ళల్లో, కాలేజీల్లో చదివించాడు. బన్నీ ఎప్పుడూ క్లాస్‌లో ఒకటో, రెండో ర్యాంకులో వుండేవాడు. ఇంజనీరింగ్‌లో కూడా ఫ్రీ సీటు వచ్చింది. ఎంటెక్‌లో కూడా మంచి మార్కులు సాధించాడు. కానీ ఉద్యోగాలే రావటంలేదు. మూడేళ్ళ నుండి ప్రయత్నిస్తూనే వున్నాడు. ముందు పెద్ద కంపెనీలతో మొదలెట్టాడు. ఇప్పుడు ఏ కంపెనీ ఐనా ఫర్వాలేదను కుంటున్నాడు. కానీ ఉద్యోగమే కుదురు కోవటంలేదు.

"సరే, లేవగానే ఈ రెండువేలు వాడికివ్వు. ఖర్చులకుంటాయ్. నేను ఆఫీసుకెళ్తున్నానంటూ బయల్దేరాడు రామనాథం.

ఇంటి గేటు తీస్తుండగా ఎదురయ్యాడు బన్నీ క్లాస్‌మేట్ చంద్రం. వాడూ ఉద్యోగాల వేటలోనే వున్నాడు.

చంద్రం రామనాథాన్ని పలకరించాడు.

తెల్లారి పొద్దునే బన్నీ పడుకున్నాడు చంద్రం, కాసేపయ్యాక లేపు అని చెప్పి రామనాథం ఆఫీసుకెళ్ళాడు.

సీతతో పిచ్చాపాటి కబుర్లు చెబుతూ బన్నీ లేస్తాడేమో అని చూస్తున్నాడు చంద్రం.

చంద్రంకి ఈ కబురు ఎలా అయినా చెప్పాలని ఆతృతగా వుంది.

చంద్రం వాళ్ళ చుట్టాలిద్దరు బిట్‌కాయిన్స్ కొని కోటీశ్వరులయ్యారు. అంతా కంప్యూటర్‌లోనే పని. ఆ విషయం బన్నీకి చెప్పాలని ఆతృతగా వున్నాడు. బన్నీ పడుకున్నాడని తెలిస్తే వెనక్కి వెళ్ళిపోయేవాడే – ఈ విషయం తేల్చు కోవాలనే వున్నాడు.

రెండు గంటల తర్వాత బన్నీ నిద్రలేచాడు. చంద్రం కిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్‌ల గురించి బన్నీకి చెప్పాడు.

ఇప్పుడొక లక్ష రూపాయలు ఖర్చు పెట్టాలంటే ఎలా? నాన్నతో మాట్లాడతానన్నాడు బన్నీ.

చంద్రం చెప్పిన కోటీశ్వరులైన తన బంధువుల కథ విన్న తర్వాత నిరుద్యోగాన్ని జయించటానికి సరైన మార్గం దొరికిందను కున్నాడు బన్నీ.

కథ

సాయంత్రం తండ్రితో క్రిప్టో కరెన్సీ గురించి చెప్పటం మొదలెట్టాడు. డబ్బులు, రూపంలో వుండవు విలువలో వుంటాయంటే రామనాథంకి ఏమీ అర్థంగావటంలేదు.

సీత మాత్రం బన్నీ, చంద్రం మాట్లాడు కుంటుండగా విన్నది గనుక చాలా డబ్బు లొస్తాయని మాత్రం అర్థం చేసుకుంది.

బిట్‌కాయిన్స్ అంటే ఇవి 'ఒక రకమైన డిజిటల్ కాయిన్స్….' నాన్నా అన్నాడు బన్నీ.

'అంటే పేటిఎం, ఫోన్‌పే లాంటివా?'….

'అలాక్కాదు నాన్నా! అని సిస్టంలోనే వుంటాయి. వాటికి భౌతిక రూపం అంటూ ఉండదు, వాటిని చూడలేం కూడా'.

'అవి ఎక్కడున్నాయో తెలీదు, ఎలా ఉంటాయో తెలీదు, ఎవరికీ కనబడ వంటున్నావు. మరి వాటిని ఎలా కొంటావు? ఎలా మారుస్తావు? ఇలా చెబితే ఎవరైనా వాటిని గురించి నమ్ముతారంటావా? ఇదేదో గందరగోళంగా, అయోమయంగా వుంది'.

'ఆన్‌లైన్ వ్యాపారాన్ని మొదట్లో ఎంతమంది నమ్మారు? అందులో ఎన్ని రకాలు వచ్చాయి? కాలు కదపకుండా కావాల్సిన ఏ వస్తువునైనా మన ఇంటికే ఎలా రప్పించుకోగలుగుతున్నాం? ఇదీ అంతే!' అన్నాడు బన్నీ.

'నాకిప్పుడర్థమయ్యిందిరా, ఒక రకంగా షేర్ల మార్కెట్ లాంటిదన్నమాట'.

'నాన్నా షేర్ల మార్కెట్‌కి స్టాక్ ఎక్ఛేంజ్ బోర్డు, ప్రభుత్వం నియంత్రణ కూడా ఉంటాయి. దీనికి అటువంటివి ఏమీ ఉండవు….'

'అంటే, ఈ కాయిన్స్ ఎవరి దగ్గర కొంటామో మనకు తెలియదు, వీటిని ఎవరు కంట్రోల్ చేస్తారో మనకు తెలియదు, మరి వ్యాపారం ఎలా జరుగుతుంది? ఇంతకీ నువ్వు చెబుతున్నదంతా వింటుంటే ఏదో భేతాళ మాంత్రికుడి కథలా వుంది'.

'అదేం కాదులే నాన్నా, వీటికి కూడా కొన్ని స్టాక్ ఎక్ఛేంజీలున్నాయి. అలాగే బిట్‌కాయిన్ ఏటిఎమ్‌లున్నాయి. కాకపోతే అన్నీ సిస్టంలోనే వుంటాయి. కొంతమంది ప్రమోటర్స్ వీటిని మెయిన్‌టైన్ చేస్తున్నారు. అలాగే బిట్‌కాయిన్లు కొనడానికి కొన్ని వెబ్‌సైట్లున్నాయి. ఆ వెబ్‌సైట్లను మనం బ్రౌజ్ చేస్తే మనం ఏదో ఒక ప్రమోటర్ నుండి బిట్‌కాయిన్లను కొనుక్కోవచ్చు. ఇవాళ వేలల్లో ధర పలుకుతున్న బిట్‌కాయిన్లు మరుసటిరోజుకే లక్షల ధర పలకవచ్చు.

'ఒక లక్ష రూపాయిలుంటే మొదట పని ప్రారంభించవచ్చు'.

'సరే నువ్వింతలా చెబుతున్నావు కాబట్టి నేను కాస్త వాకబు చేస్తాను. మన మధ్య, దిగువ మధ్యతరగతి వాళ్ళం వంద రూపాయలు ఖర్చు చేయాలంటేనే పదిసార్లు ఆలోచిస్తాం. అలాంటిది ఒకేసారి లక్ష రూపాయలు ఖర్చుపెట్టటం అంటే ఆలోచిద్దామన్నారు రామనాథం.

★ ★ ★ ★ ★

'రామనాథంగారూ లంచ్ అయిపోయిందాండీ? ఏమిటిలా వచ్చారు, నాతో ఏమైనా పని వుందా?' అడిగాడు కంప్యూటర్ అసిస్టెంట్ శేఖర్.

"బాబూ నాకో చిన్న సమస్య వచ్చి పడింది. నీకు కంప్యూటర్‌కు సంబంధించిన నాలెడ్జ్ బాగా వుంది, ఆర్థిక విషయాలలో కూడా నువ్వు బాగా మాట్లాడుతుంటావు. నాకు నీ సలహా కావాలి."

"చెప్పండి సార్, నాకు చాతనైనంత చేస్తాను".

"ఏం లేదు బాబూ, మా అబ్బాయి బిట్‌కాయిన్లు కొంటానంటూ లక్ష రూపాయ లిమ్మంటున్నాడు. బిట్‌కాయిన్లంటే ఏమిట్రా అని అడిగితే ఏదేదో చెబుతున్నాడు. నాకేమీ అర్థం కావడంలేదు. కానీ అది చాలా చిక్కులతో కూడుకున్నదిగా అనిపిస్తోంది."

"సార్! నిజం చెప్పాలంటే ఇదొక జూదం లాంటిది, ఇంకొక రకంగా షేర్ల వ్యాపారం లాంటిది. జూదంలో గెలిచి, షేర్ల వ్యాపారం చేసి బాగుపడినవాళ్ళు నాకు తెలిసి బహు తక్కువమంది. ముఖ్యంగా, ఇందులో ఎవరికీ జవాబుదారీతనం ఉండదు. ఎలాగంటే మనం డెబిట్‌కార్డులు, క్రెడిట్‌కార్డులు, యోనో, ఫోన్‌పే వంటి యాప్‌లను మన నిత్యజీవిత లావాదేవీలకు ఉపయోగిస్తున్నాం. ఇందులో దేనిలోనైనా మనకు ఇబ్బంది ఎదురైతే.... అంటే మనం పంపిన డబ్బు అవతలివారికి చేరకపోతే ఆ కార్డును జారీచేసిన బ్యాంకును సంప్రదించి ఆ సమస్య నుండి బయటపడవచ్చు. ఎందుకంటే ఆయా బ్యాంకులే ఆ కార్డులను లేదా యాప్‌లను విడుదల చేస్తున్నాయి కాబట్టి. అదే బిట్ కాయిన్ల విషయానికి వచ్చినపుడు వాటిపైన కంట్రోలింగ్ చేసేది ఎవరూ లేరు, బాధ్యతపడేది ఎవరూ లేరు. అటువంటప్పుడు మనకు నష్టం జరిగితే అడగడానికి, సమాధానం చెప్పడానికీ ఎవరూ ఉండరు...."

"అంటే మనం మన డబ్బులు పెట్టి కొనుక్కున్న బిట్‌కాయిన్లు మనకు రాకపోయినా లేదా వాటి మార్కెట్ ధర అధఃపాతాళానికి పడిపోయినా నోరు మూసుకుని కూర్చోవాల్సిందే అంటావు, అంతేనా?"

"అంతేసార్! జ్ఞాపకం వుండే వుంటుంది – హర్షద్ మెహతా, ఖేతన్ ఫరేక్‌ల స్టాక్ ఎక్చేంజీల స్కామ్‌ల గురించి. షేర్లలో ఇన్వెస్ట్ చేసినవారు లక్షల కోట్లు పోగొట్టుకున్నారు. అంతవరకూ ఎందుకు సార్ – కిందటి శీతాకాలం పార్లమెంటు సమావేశాల్లో మనదేశంలో క్రిప్టోకరెన్సీని అదుపుచేసే బిల్లు ప్రవేశపెడతారనే వార్త బయటకు పొక్కగానే చాలామంది బిట్‌కాయిన్లను అమ్మేసుకున్నారు. దాంతో ఇక్కడి మార్కెట్లో బిట్‌కాయిన్ల ధర 26 శాతం పడిపోయింది. 25 కోట్ల క్రిప్టోకరెన్సీ మాయమైపోయింది. అయినా సార్ కష్ట పడకుండా కోట్లు వస్తాయంటే అది స్కామ్ కాకుండా ఏమవుతుంది?"

"మరి ప్రభుత్వాలు ఏమిటి చేస్తున్నట్టు? ప్రజలు మోసాలబారిన పడకుండా రక్షించాల్సిన బాధ్యత వాటికి లేదా?"

"చాలా ఇతర దేశాల ప్రభుత్వాలు క్రిప్టో కరెన్సీని ప్రోత్సహిస్తున్నాయి. మన దేశం ఊగిస లాడుతోంది, క్రిప్టో కరెన్సీని నియంత్రించే బిల్లు ప్రవేశపెడదామనుకునే మళ్ళీ వెనక్కు తీసుకొంది. అయితే రిజర్వుబ్యాంకు మాత్రం నియంత్రించడం కాదు నిషేధించాలనీ లేకపోతే దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటుందంటూ హెచ్చరికలు జారీ చేస్తోంది."

"అవునవును, ఈ వార్త మొన్ననే నేను పేపర్లో చూసినట్లు గుర్తు. ఇంతకీ ప్రభుత్వాధినేతల మనస్సులో ఏముందో? దేశంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థల్నీ అమ్మకానికి పెట్టేసారు. గుత్తంగా అదానీ, అంబానీల పరం చేస్తున్నారు. ఒకవేళ...."

"అయినా కావచ్చునండి. అసలింతకీ బ్రెక్జిట్ (అంటే యూరోపియన్ కామన్ మార్కెట్ వ్యవస్థ నుండి బ్రిటన్ బయటకు వచ్చేసిన) తర్వాతనే క్రిప్టో కరెన్సీ వెలుగులోకి వచ్చింది. ఇది మంచిదే, ముందు ముందు ప్రపంచ ఆర్థికవ్యవస్థకు ఇదే మూలాధారం అవుతుం దంటూ కొందరు పనిగట్టుకొని పదే పదే వల్లిస్తున్నారు. ఆ విధంగా దీనికి లేని బూమ్‌ని సృష్టిస్తున్నారు...."

"బాబూ, ఇంతకీ ఇది పేద ప్రజలకు, శ్రమజీవులకు ఏమాత్రం ఉపయోగపడుతుం దంటావు?"

"దీని వలన పేదలకు ఒరిగేది సున్నా. ఇటువంటివి అంతా రహస్యంగా జరుగు తుంటాయి కాబట్టి మనీ లాండరింగ్ చేసేవారికి, తీవ్రవాదులకు ఆర్థిక సహాయం చేయడానికి, బడాబాబులు రహస్యంగా నల్లధనం మార్చు కోవడానికి తప్ప మనలాంటివారికి కళ్ళు మూసి జెల్ల కొట్టడానికి తప్ప వేరెందుకూ పనికిరాదు."

"అయితే మావాడికి డబ్బులివ్వను. ఏమంటావు?"

"సార్ మనలాంటివాళ్ళకి లక్ష రూపాయ లంటే తక్కువ కాదు. మీ అమ్మాయి పెళ్ళికి రెండు తులాల బంగారం కొనొచ్చు, మీ ఇంటికి తీసుకున్న లోన్‌కి 6 నెలలు వాయిదాలు కట్టొచ్చు. లక్ష పోతే పోయిందిలే అనుకునేవారే ఇందులోకి దిగాలి. వారికి జెల్ల తగిలినా ఏమీ అనిపించదు."

దేవుడున్నాడు – కానీ కనపించడు సూత్రాన్ని అప్లై చేసి మరీ మోసం చేస్తునట్లున్నారు అనుకుంటూ రామనాథం ఇంటిదారి పట్టాడు.✦

"సంస్కృత భాషోద్ధరణ జరగనిదే భారతీయ సంస్కృతికి భవిష్యత్తు లేదనేవారు కేవలం వేళ్ళను కాపాడాలనేవారే; పైకి కాక, వీరు కిందికి పెరుగుతామంటారు. ముందుకు కాక వీరు వెనుకకు నడుస్తామంటారు. వీరి ఉద్దేశంలో ఎంత యెత్తుగా మన చుట్టూ గోడలు కట్టుకుంటే అంతగా మన జాతికి బలం; అంతగా మన సంస్కృతికి భద్రత. ఆ గోడలకు పొరపాటుగానైనా తలుపులుండరాదు, కిటికీలన్నది అసలే పనికిరావు. బయటి వెలుగు మన బ్రతుకుపై పడరాదు. పడితే, మన సంస్కృతి మైలపడిపోతుంది; మన జాతి భ్రష్టమైపోతుంది. బయటి ప్రపంచంతో సంబంధాన్ని తెగగొట్టే గోడలు జెయిళ్ళకే వుంటాయంటే ఆ మాట వారికి నచ్చదు. తలుపులు కిటికీలు లేకపోవడం గోరీలకే తగునంటే అందుకు కినిసి వీరు శాపనార్థాలు పెడతారు. అసహనం ప్రత్యేకించి వీరి సొత్తు. అహంకారానికి వీరిదే అగ్రతాంబూలం. సంస్కృత భాషను అఖిల భారతానికి అధికారభాషగా, అనుసంధానభాషగా చేయాలని, ఆ చర్య ద్వారా తప్ప భారతీయ సంస్కృతి పునరుద్ధరణ జరగదని ప్రస్తుతం ఆర్భాటం చేస్తున్నవారి ప్రధాన ప్రేరణలలో మొదటిది అసహనం కాగా రెండవది అహంకారం."

– నార్ల 'ఆంధ్రప్రభ' 18-11-1955 సంపాదకీయం నుండి ✦

# జనసాహితి కార్యవర్గ తీర్మానాలు

**12-12-21న విజయవాడలో జరిగిన జనసాహితి కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానాలు**

## 1. కరోనా కల్లోల కాలంలో ప్రజల ఆరోగ్య, ఆర్థిక దుస్థితికి కారణం పాలకులే!

నిర్దిష్టమైన చికిత్స విధానం, మందులు లేని కోవిడ్-19 వ్యాధికి వేలాదిమంది ప్రజలు బలయ్యారు. సమాజం ఒక శోక సముద్రమయింది. బంధువుల్ని స్నేహితుల్ని ఆత్మీయుల్ని కోల్పోయి దుఃఖపు ఉప్పెనలో మునిగిపోయారు. చుట్టూ వినిపిస్తున్న విలాపాల విషాదంతో గుండె బరువెక్కి మానసిక సమస్థితిని కోల్పోకుండా ఉన్నవారు, వ్యాధి నుంచి తప్పించుకున్నవారు అరుదయ్యారు. ఈనాటికీ దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ పంపిణీ 40 శాతం కూడా పూర్తికాలేదు. ఈలోగా కొత్త మ్యుటేషన్లు సవాళ్లు విసురుతున్నాయి.

ప్రజల కనీస అవసరాలను సమకూర్చుకునే అవకాశం ఇవ్వకుండా నాలుగు గంటల ముందు నోటీసులిచ్చి లాక్‌డౌన్‌ను ప్రకటించిన పాలకులు. రవాణా వ్యవస్థను రద్దుచేసి వలస కార్మికులను రోడ్లపాలు చేశారు. నిత్యావసర సరుకులు అందుబాటులో లేకుండాచేసి కృత్రిమ కొరతను సృష్టించారు. వ్యాపారులకు విపరీతమైన లాభాలు చేకూర్చారు. కరోనా ముసుగులో కార్మిక చట్టాలలో మార్పులు తెచ్చి ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచారు. వేతనాల్లో కోత విధించారు, వసతులు కల్పించకుండా ఉద్యోగ భద్రత లేకుండా చేశారు. చాలామందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ధరల భారంతో సామాన్యులు చితికిపోయారు, ధనవంతులు మరింత స్థితిమంతు లయ్యారు. పేద ప్రజలు చారిటీ సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతకాల్సి వచ్చింది. కష్టకాలంలో ప్రజలందరికీ ఉచిత వైద్యం, నాణ్యమైన మందులు అందించాల్సిన ప్రభుత్వాలు అవి సామాన్యులకు అందుబాటులో లేకుండా చేశాయి. గంటలకొద్దీ క్యూలో నిలుచున్నా టీకాలు అందని పరిస్థితి. మన ఆరోగ్య వ్యవస్థలో ఉన్న లోపాలు కరోనా కాలంలో తీవ్రంగా బయటపడ్డాయి. ఆరోగ్య భద్రతకు ప్రభుత్వాలు హామీ ఇవ్వలేక చేతులెత్తేశాయి. వైద్య సేవలు అందించే ప్రభుత్వ వైద్యులు సిబ్బందికి గ్లౌసులు, పి.పి.ఇ కిట్లు వంటి కనీస సదుపాయాలు అందించలేక పోవటంతో అనేకమంది వైద్యులు సిబ్బంది చనిపోవడానికి ప్రభుత్వ అలసత్వమే కారణం. ఆక్సిజన్ సరఫరా లేక ఎంతోమంది అవస్థలు పడ్డారు. చిన్నరైతులు, రైతు కూలీలు, అసంఘటిత రంగంలోని కార్మికులు, వలస కార్మికులు, సీజనల్ వర్కర్లు మరెంతో మంది అనారోగ్యం వ్యాధుల బారినపడి వైద్య ఖర్చులు భరించలేక అప్పులపాలు అవ్వడం, వెట్టిచాకిరికి తలవంచడం జరిగింది. ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలలు ఆ సమయంలో లక్షలు వసూలు చేశాయి. లాభాలు, లాబీయింగ్‌లతో మన ఆరోగ్య వ్యవస్థను దోపిడీకి నిలయంగా మార్చారు. ప్రజారోగ్యం మరణశయ్యపై కూలబడింది. ఈ దుస్థితికీ, వైఫల్యాలకు ప్రభుత్వమే బాధ్యత ప్రధానమైనది. ఆకస్మికంగా లాక్‌డౌన్ ప్రకటించిన ఫలితంగా మరణించిన వలస కార్మికుల వివరాలను కూడా చెప్పటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడలేదు. ఇది దాని నిర్లక్ష్యపు కొనసాగింపు. ఈ తరహా నిర్లక్ష్యాన్ని ఖండిస్తున్నాం.

## 2. రైతాంగ ఉద్యమ విజయానికి జేజేలు!

2020 జూన్ 3వ తేదీన కేంద్ర మంత్రిమండలి మోడీ నాయకత్వాన మూజువాణీ ఓటుతో 3 వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి - భారత వ్యవసాయరంగాన్ని విదేశీ బహుళజాతి, స్వదేశీ గుత్త పెట్టుబడిదారులకు ధారబోయటానికి చేసిన రాజ్యాంగబద్ధ కుట్రను అఖిల భారత రైతాంగం తిప్పికొట్టింది. కార్మిక రైతాంగ సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా 2020 సెప్టెంబరు 25న జరిపిన భారత్ బంద్ విజయవంతమైనది. అది అఖిలభారత సంఘటిత శక్తిగా ఆవిర్భవించింది. ఏడాదిపాటు ఢిల్లీ నడిబొడ్డున బైఠాయించి తమ డిమాండ్లను సాధించుకుంది. నీటి తుపాకుల్ని తట్టుకున్నారు. నిప్పుల గుండాలను అధిగమించారు. ఇనుప ముళ్ళను దిగవంచారు. రాజ్యహింసను చిరునవ్వుతో ఎదిరించారు. నీటి సమస్య సృష్టించినా - వైఫైలాంటి సాంకేతిక సమస్యల్ని కల్పించినా - రాజ్యాంగానికి తోకాడించే ప్రధాన మీడియా శఠించినా ప్రత్యామ్నాయ సాంకేతిక నిర్మాణంతో ఏడాదిపాటు మడమ తిప్పని చారిత్రాత్మక పోరాటం చేశారు. దిగ్విజయంగా మొండి రాజ్యం కొమ్ముల్వొంచి - మూడు చట్టాల రద్దును మొక్కవోని సంఘటిత చైతన్యంతో సాధించారు. ఏడాదిపాటు జరిగిన రైతాంగ ఉద్యమంలో దాదాపు 750 మంది రైతులు అమరులైనారు.

వలసపాలన కాలం నుండీ భారత వ్యవసాయరంగాన్ని పరాధీన పరుస్తున్న బహుళజాతి వ్యాపారం, వ్యవసాయంపై గుత్త పెట్టుబడిదారుల పట్టు, మార్కెట్ మాయాజాలం కొనసాగుతూనే వున్నాయి. ఈ దోపిడీ పీడనల నుండి భారత వ్యవసాయరంగాన్ని కాపాడుకొని ప్రజానుకూల రైతాంగ అనుకూల విధానాలు అమలు కావాలంటే - అలుపు సొలుపూ లేకుండా - ఏడాదిపాటు తెగువ చూపించిన భారత రైతాంగం దేశ కార్మికవర్గంతో సంఘటితమై నూతన ప్రజాతంత్ర పోరాటాలకు మరింత స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని దేశ ప్రజానీకానికి జనసాహితి విజ్ఞప్తి చేస్తుంది.

## 3. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ చర్యలను తక్షణమే విరమించాలి!

విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు అనే నినాదంతో విద్యార్థిలోకం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజానీకాన్ని కదిలించి, ముందు నిలిచి పోరాడిన ఫలితంగా స్టీలు ప్లాంటు ఏర్పడింది. 1966 నవంబరు 1న విశాఖనగరంలో ఫ్యాక్టరీ సాధన కోసం జరిగిన ర్యాలీపై ప్రభుత్వం కాల్పులు జరిపించి 11 మంది విద్యార్థులతో సహా మొత్తంగా రాష్ట్రంలో 32 మందిని బలిగొన్నది. తదుపరి జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ప్రతిపక్ష నాయకులు తరిమెల నాగిరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, టి.కె.ఆర్. శర్మ సహా

67 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. ఆ త్యాగాలు, పోరాటాల ఫలితంగానే 1971 ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్‌ప్లాంటుకు శంకుస్థాపన జరిగింది. పరిశ్రమ ఏర్పాటుకై 64 గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారు. వారి పునరావాసం కల్పించటమూ ఉపాధి కల్పన నేటికీ పూర్తిచేయలేదు.

ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంటు ఏర్పడిన నాటినుండీ నిర్లక్ష్యపూరిత వైఖరినే అవలంబిస్తున్నది. ఇవ్వవలసిన పెట్టుబడులను ఏనాడూ కేటాయించవలసినంత కేటాయించలేదు. స్వంత గనులనివ్వకుండా ప్లాంటు నష్టాలకు కారణమౌతున్నది. సుమారు మూడు లక్షల కోట్ల స్టీలు ప్లాంటు ఆస్తులను కేవలం 20,000 కోట్ల రూపాయలకు కేంద్ర ప్రభుత్వం అమ్మటానికి సిద్ధపడుతుంది. కానీ కార్మికులు మాత్రం ప్లాంటును రక్షించుకోవాలని కష్టించి పనిచేస్తూనే ఉన్నారు. 2017లో నవరత్న హోదా సాధించారు. కరోనా రెండవ విడత సమయంలో ఏర్పడిన తీవ్ర ఆక్సిజన్ కొరతకు నేనున్నానంటూ స్టీల్‌ప్లాంటును ముందు నిలిపారు. గత ఆరు సంవత్సరాల కాలంలో బడా కార్పొరేట్లకు 8 లక్షల కోట్ల ఋణమాఫీ, 6 లక్షల కోట్ల పన్ను రాయితీ వరాలిచ్చిన మోడీ ప్రభుత్వం, లక్షమందికి పైగా ఉపాధిని కల్పిస్తున్న స్టీల్‌ప్లాంటును అమ్మివేయాలని తహతహలాడుతుంది. సామ్రాజ్యవాద ప్రభువులిచ్చిన ఆదేశాలను నిస్సిగ్గుగా పాటిస్తూ, లాభనష్టాలతో నిమిత్తం లేకుండానే ఎల్.ఐ.సి., భారత పెట్రోలియం కార్పొరేషన్, ఎయిరిండియా, తదితర ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మివేసేందుకు ఎవ్వరినీ లక్ష్యపెట్టకుండా దూకుడుగా ప్రభుత్వం ముందుకు ఉరుకుతున్నది. సామ్రాజ్యవాద శక్తుల కొమ్ము కాస్తూ ప్రజలకు ఉపాధిని కల్పించే స్టీలుప్లాంటు, తదితర ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తుంది లేదా లీజు పేరుతో కట్టబెడుతుంది. తక్షణమే స్టీలుప్లాంటు అమ్మివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, స్టీలుప్లాంటుకు స్వంత గనులు కేటాయించాలనీ, ప్లాంటు నిర్మాణం కోసం భూములిచ్చి నిర్వాసితులైన అందరికీ సహేతుకమైన పద్ధతిలో న్యాయం చేయాలని జనసాహితి కార్యవర్గం డిమాండ్ చేస్తుంది.

## 4. పెరుగుతున్న విషసంస్కృతి, నేరప్రవృత్తి, మతోన్మాదం

ఒకవైపు కాలం చెల్లిన భూస్వామ్య సంస్కృతి. మరోవైపు పతన విలువల సామ్రాజ్యవాద సంస్కృతి. రెండూ కలగలసిన విష సంస్కృతి నేడు భారత యువతరం మీద జంటగా తమ దాడిని ఉధృతం చేస్తున్నాయి. భూస్వామ్య సంస్కృతిలో భాగమైన కులతత్త్వం కొత్త విషసంస్కృతి రూపాలలోనూ, మతతత్త్వం మరింత ఫాసిస్టు ఉన్మాద రూపాలలోనూ యువతరపు మెదళ్లను తొలుస్తున్నాయి. ఈ శ్రామిక ప్రజలు తమ జీవన పరిస్థితుల మెరుగుపరచే ఉద్యమాల కోసం సంఘటితమయ్యేందుకు ఆటంకమయ్యాయి. ఈ విషసంస్కృతి ప్రభావం మధ్య తరగతి యువకుల మీద క్రమంగా పెరుగుతున్న ఫలితంగా, ఉన్నత సాంకేతిక విద్యను అభ్యసించి, సంబంధిత వృత్తులలో ఉన్న యువత కూడా మతమౌఢ్యంలో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొంది. స్త్రీని భోగ వస్తువుగా చూసే భూస్వామ్య సంస్కృతి, వ్యాపార వస్తువుగా చూసే సామ్రాజ్యవాద సంస్కృతుల ఫలితంగా సమాజంలో సగభాగం అత్యంత అభద్రతతో కూడిన జీవితాలను అనుభవిస్తున్నారు. ఈ కారణాల రీత్యా మహిళల, పీడిత కులాల, మైనారిటీల మీద దాడులు నిత్యకృత్యమయ్యాయి. దీనికి తోడు సామ్రాజ్యవాదులు తమ ధనదాహం కోసం పెంచుతున్న వస్తువ్యామోహ సంస్కృతికీ, రోజురోజుకీ (తగ్గుతున్న ఉపాధి అవకాశాల వల్ల) తరిగిపోతున్న నిజ వేతనాలకూ మధ్య ఉన్న వైరుధ్యం సమాజంలో దొంగతనాలూ, దాడులూ, హత్యలూ, అమానవీయతా పెరగడానికి దారితీస్తున్నాయి. ఈ దుస్థితి నుండి సమాజాన్ని బయట పడవేసేందుకు భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులను ఓడించి, నూతన ప్రజాస్వామిక సంస్కృతిని అభివృద్ధి చేయవలసి ఉంది. అందుకోసం తగిన రూపాలలో ఉద్యమాలను నిర్మించాలనీ, కవులూ, రచయితలూ, కళాకారులూ తమ సృజనాత్మకతకు మరింత పదును పెట్టాలని జనసాహితి కార్యవర్గం పిలుపునిస్తోంది.

## 5. అందరికీ ఒకేరకమైన విద్యను (కామన్ స్కూల్ సిస్టం) అందించాలని, మాతృభాషలోనే చదువులు నేర్పాలనీ, ఇతర భాషలకూ తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జనసాహితి డిమాండ్ చేస్తున్నది!

భారతదేశంలో ప్రజల అవసరాలకు తగిన విద్య కాకుండా, పాలకులు నిర్దేశించే విద్యే విద్యగా మారింది. ఇది మరింతగా పెరిగి వికృత పోకడలతో అక్షర జ్ఞానమే జ్ఞానంగా మారింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ విద్య కూడా ప్రవేటు రంగానికి తీసుకురాబడి అమ్మకపు వస్తువుగా మారిపోయింది. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని ఎన్నికైన పాలకులు, నిస్సిగ్గుగా తాము అమలుచేసే ప్రతి విద్యావిధానము (నూతన విద్యావిధానం 2021తో సహా) విద్యను పేదలకు దూరంచేసే విధానాలే. దీనితోపాటు మాతృభాషకి ప్రజల జీవన సంస్కృతికి, జ్ఞానాభివృద్ధికి సంబంధం ఉంటుందనీ కనీస జ్ఞానంలేని పాలకులు ఇంగ్లీషు మాధ్యమ బోధనే ఉపాధి విద్యాబోధన అనే భ్రమలు కలిగిస్తూ మాతృభాషను పూర్తిగా ఎత్తివేసి ఆంగ్లమాధ్యమానికి మార్చుతున్నారు. దీనివల్ల లక్షలాదిమంది నిరుపేద విద్యార్థులు డ్రాపౌట్లుగా మారుతారు. విద్య పూర్తిగా మాతృభాషలోనే కొనసాగాలని దానిని ప్రభుత్వమే అందరికి ఉచితంగా అందించాలని, అందరికీ ఒకే రకమైన విద్యను అందించాలని జనసాహితి డిమాండ్ చేస్తున్నది.

## 6. నిర్బంధ విధానాలను చర్యలను ఖండిస్తూ...!

ఆర్ఎస్ఎస్ నిర్మాణ బలంతో రెండవసారి అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం అనేక ప్రజావ్యతిరేక అభివృద్ధి నిరోధక చర్యలతో పాటు క్రూర నిర్బంధ విధానాన్ని కూడా పెంచుకుంటూ వెడుతోంది. తమ విధానాలను ప్రశ్నించినవారిపై ఈ నిర్బంధం ప్రత్యేకంగా సాగుతూ ఉంది. ముఖ్యంగా దేశంలో పౌర ప్రజాస్వామ్య స్వేచ్ఛలకై ఉద్యమించిన వారిపై, భావ ప్రకటనా హక్కు కొరకు ఆందోళన చేసిన వారిపై, ఉన్మాదతత్వంతో సాగుతున్న మతపరమైన విభజన రాజకీయాల వ్యాప్తిని నిరసించినవారిపై, ప్రజా ఉద్యమాలకు సంఘీభావంగా నిలిచిన ప్రజాతంత్రవాదులు, రచయితలు, కళాకారులపై కూడా ఈ నిర్బంధం కొనసాగుతూ ఉంది. పోరాడే ప్రజలపై నిర్బంధం సంగతి ఇక చెప్పేదేముంది?

బ్రిటిష్ వలసవాదుల పాలనా కాలంలో రుద్దిన నిర్బంధ చట్టాలకు పేర్లు మార్చి, వాటికి సరికొత్త కోరలు జోడించి, UAPA లాంటి కఠిన చట్టాలను రూపొందించి క్రూరంగా అమలు పరుస్తున్నారు. ప్రజల వైపు నుండి చట్టబద్ధ పాలన నిజాయితీగా చేయమని డిమాండ్ పెరిగిన కొద్దీ మరిన్ని నిరంకుశ చట్టాలను రూపొందించి చట్టబద్ధ అణచివేతలకు పాల్పడుతున్నారు.

ప్రపంచ దేశాలు, ప్రజాస్వామిక మేధావులు భారతదేశాన్ని అప్రజాస్వామిక తత్వాలు పెంచుకుంటున్న దేశంగా ఒకవైపున అభిశంసన చేస్తూ ఉండగా, పాలకులు తమకు మించిన ప్రజాస్వామికవాదులు లేరని ఆత్మవంచన పరవంచనలకు పాల్పడుతున్నారు. ఢిల్లీ మహానగరంలోని ప్రతిష్ఠాత్మకమైన జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థులపై వారి నాయకులపై, అలాగే ఎన్ ఆర్ సి; సి ఏ ఏ లాంటి పౌరసత్వ సవరణ చట్టం లాంటి మైనారిటీల అణచివేత చట్టాలను రద్దు చేయాలని దేశవ్యాప్త ఆందోళన చేసిన ఉద్యమకారులపై, జల్ జంగిల్ జమీన్‌లపై తమ హక్కులను నిలుపుకోవాలని ఉద్యమించే ఆదివాసీలపై ఎనలేని అణచివేతను హింసాకాండను అమలు జరుపుతున్నారు. పౌరసత్వ సవరణ చట్టాలకు నిరసనగా సాగించిన ఉద్యమాలపై మతోన్మాద శక్తులు చేసిన దాడులు హింసాకాండలకు ప్రభుత్వ యంత్రాంగమే పరోక్ష మద్దతు అందజేశారు.

ఒకవైపున కరోనా పీడిత ప్రజలను ఆదుకోవాల్సిన రీతిలో ఆదుకోకుండా కోట్లాది శ్రమజీవులను రోడ్ల పాలుచేసి, మరొకవైపున కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను; మూడు వ్యవసాయ చట్టాలను; విద్యుత్ సవరణ చట్టాన్ని ఏకపక్షంగా ఆమోదించుకున్నారు. మూడు వ్యవసాయక చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరంపైగా సాగిన దేశ వ్యాపిత రైతాంగ ప్రజాందోళనను అణచి వేయడానికి క్రూర, నిరంకుశ, హాస్యాస్పద విధానాలకు అంతే లేదు. రైతాంగ ఉద్యమంపై వివిధ రూపాలలో ప్రభుత్వ బలగాలతో ప్రత్యక్ష భౌతికదాడులే కాక ప్రభుత్వేతర శక్తులతో పరోక్ష దాడులకు విచ్చిన్నాలకు పాల్పడ్డారు.

హర్యానాలో భౌతిక దాడులకు పోలీస్ యంత్రాంగమే సిద్ధం కాగా ఉత్తరప్రదేశ్‌లో లఖింపూర్ కేరిలలో ఉద్యమిస్తున్న రైతుల ఊరేగింపుపై మోటారు వాహనాన్ని దూకించి నలుగురు రైతులు ఒక జర్నలిస్టుతో సహా ఎనిమిది మంది ప్రాణాలను బలిగొన్నారు.

తమ అనుకూల అబద్దాల ఫ్యాక్టరీ ద్వారా పోరాడే రైతాంగాన్ని టెర్రరిస్టులనీ ఖలిస్తాన్ వాదులని, అర్బన్ నక్సల్స్ అనీ దేశద్రోహులు, ఆందోళన జీవులంటూ రకరకాల ముద్రలు వేసి వారి ఉద్యమ విచ్చిన్నానికి, అణచివేతకి పూనుకున్నారు. ఉన్నాయనుకుంటున్న రాజ్యాంగ విలువలను నిస్సిగ్గుగా కాలరాచి వేస్తున్నారు. రాజ్యాంగంలో రాసుకున్న ఫెడరల్ సమాఖ్య విధానాలను పూర్తి ప్రశ్నార్థకం చేశారు. రాష్ట్రాలను ఆర్థికంగా రాజకీయంగా వివక్షకు గురిచేస్తూ, కేంద్రమే సమస్తం; సత్యం, నిత్యం, ఏకైకం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వీటన్నిటిలో ఏ ఒక్క అణచివేత రూపాన్ని, వివక్షను ప్రశ్నించినా వివిధ కేంద్ర బలగాలను (ఉదా॥ NIA; E.D; I.T) ప్రయోగించి బిజెపియేతర పార్టీల ప్రభుత్వాలను నాయకులను బెదిరించి లొంగ తీసుకుంటున్నారు. 3 సంవత్సరాల క్రితం ప్రముఖ విప్లవ రచయిత కామ్రేడ్ వరవరరావు, సామాజిక కార్యకర్త సుధా భరద్వాజ్, ప్రొఫెసర్ ఆనంద్ తేలుతుంబ్డే తదితరులు 16 మందిపై భీమా కోరేగావ్ కేసును బనాయించి బెయిలు కూడా లభించనివ్వకుండా ఫాసిస్టు తరహా శాడిజానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం పాల్పడుతోంది. జార్ఖండ్లో ఆదివాసిల సేవకుడైన ఫాదర్ స్టాన్ స్వామి ముంబాయి జైలులోనే హతమై పోయేటట్లు చేశారు.

ఇజ్రాయిల్ దేశపు ఒక ప్రైవేటు కంపెనీ తయారుచేసిన పెగాసస్ అనే రహస్య నిఘా సాంకేతిక సాఫ్ట్వేర్ మనదేశంలో కొందరు ప్రముఖుల సొంత ఫోన్ పరికరాలపై దాడి చేస్తున్నట్లు మీడియా ద్వారా బట్టబయలైంది. అది ప్రైవేటు వ్యక్తులకు అందే అవకాశం లేదని ప్రభుత్వమే చెప్పింది అంటే భారత ప్రభుత్వ అనుమతితోనే ఇదంతా జరుగుతోందని అనుమానించాల్సి వస్తుంది. ఈ తరహా నిఘా ప్రజా ఉద్యమ కార్యకర్తలు, జర్నలిస్టుల పైనే కాక ప్రతిపక్ష పార్టీల నేతలు ఆఖరికి అధికార పార్టీలో కొందరు వ్యక్తులు పైన కూడా జరుగుతోందని పత్రికలలో వచ్చింది. దీనిపైన ప్రభుత్వం బాధ్యతాయుతమైన జవాబు చెప్పకుండా బుకాయింపులకు పాల్పడింది. భారత పాలకులు అభద్రత అనే సంక్షుభిత అగ్నిపర్వతంపై కూర్చుని ప్రజలకు ప్రజా ఉద్యమాలకు ఎంత భయపడిపోతున్నారో కూడా ఈ పెగాసస్ సంఘటన తెలియ పరుస్తుంది.

నిజాలను రిపోర్టు చేస్తున్నారని ఎంతోమంది జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు బనాయించి బెయిలు మంజూరుకు కూడా ఆటంకాలు కల్పిస్తున్నారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో విప్లవ రచయితలపై తప్పుడు అభియోగాలు మోపి వారి ఇళ్లపై దాడులు చేసి భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు.

చట్టంలో కల్పించిన మౌలిక భావప్రకటన స్వేచ్ఛను హరించడానికి అదే చట్టంలోని మరికొన్ని లొసుగులను ప్రయోగించటమనేది ఒక కళగా ప్రదర్శిస్తున్నారు.

పై తరహా నిర్బంధ చర్యలను విధానాలను జనసాహితి రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తోంది. తక్షణమే కామ్రేడ్ వరవరరావు తదితర ప్రజా ఉద్యమ కళాకారులు, రచయితలు, కార్యకర్తలపై మోపిన అక్రమ కేసులను రద్దుచేసి విడుదల చేయవలసిందిగా జనసాహితి డిమాండ్ చేస్తోంది.

## 7. శాస్త్ర సాంకేతికతతో విశాల ప్రజానీకాన్ని మూఢత్వంలోకి నెడుతున్న సినిమాలను త్రిప్పికొట్టాలి!

తెలుగు సినిమా మానసిక పరిస్థితి విషమించిందని చెప్పడానికి ఇటీవల విడుదలైన (అఘోరా) 'అఖండ' సినిమా ఉదాహరణగా నిలుస్తుంది. ఒకటవ, రెండవ కరోనాల కారణంగానూ,.... ప్రభుత్వాలు ప్రజలను నిష్పూచిగా, నిస్సిగ్గుగా కార్పొరేటు గ్రద్దలకు ఎరవేసిన ఫలితంగా.... నిరంతరం భీతిల్లుతూ బతుకుతూ ఉండే అభద్రతాపూరిత వాతావరణం ఏర్పడి ఉన్నది. ఒకవైపు ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య, ఆర్థిక భద్రత పట్ల కనీస బాధ్యతను వదలివేయగా మరోవైపు ప్రజల భయాందోళనలను రెచ్చగొట్టి సొమ్ము చేసుకునే మౌఢ్య వ్యాపారాలూ పెరిగిపోయాయి. సినిమా 'కళ' ద్వారా ప్రజల కనీస ఇంగితాన్ని సైతం కూలగొట్టి వారి మెదళ్ళలో అశాస్త్రీయ భావాలు కూరిపెట్టాలనే ప్రయత్నాలు బాగా పెరిగిపోయాయి. తమలో గూడు కట్టుకుపోతున్న

భయాందోళనలు పారదోలేవారు, ఇక విపరీత మానసిక పైత్యాల అఘోరాలే అనే అధమాధమ స్థాయికి ప్రేక్షకుడిని క్రుంగదీసే కుట్ర విజయవంతంగా కొనసాగుతున్నది. నిజానికి తెలుగు సినిమాలలో 'అఘోరా'లు పాత్రలుగా ఉండడం చాలాకాలం ముందు నుంచీ ఉన్నది. 2009 నాటి 'మగధీర', 2012 నాటి 'ఢమరుకం', 2015లో 'ఎవడే సుబ్రహ్మణ్యం' ఇంకా కాంచన-3, ఇస్మార్ట్ శంకర్ వంటి అనేక సినిమాలలో అఘోర పాత్రలున్నాయి. ప్రగతిశీల శక్తులు ఉదాశీనంగా ఉండిన ఫలితంగా చివరికీనాడు అఘోరాయే కథానాయకుడిగా మారిన విషాదం మన ముందుకొచ్చింది.

తాము విసిరే సంక్షేమ పథకాల అరకొర ఎంగిలి మెతుకులతోనే ప్రజలు సరిపెట్టుకుంటూ బ్రతకాలనే పాలకులు కోరుకుంటున్నారు. నిత్య వలసలుగా, ఉపాధిలేమిగా, ధరల భారంగా.... ఇంకా అనేక జీవన పార్శ్వాలలో చుట్టుముట్టి ఉన్న సంక్షోభాల మూలం ధనాఢ్యవర్గాల దోపిడీ తంత్రమనే ఎరుక శ్రమజీవులకు కలుగకుండా, సమాజంలో దోపిడీ పీడనలను సజావుగా ఉంచేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నాలకు ఒక సాధనంగా ధనస్వామ్యపు పెట్టుబడి ఇటువంటి సినిమాలను ప్రజల మెదళ్ళ మీదకు వదులుతున్నదని జనసాహితి కార్యవర్గం అభిప్రాయపడుతున్నది. శ్రమజీవుల నిరంతరాయ కార్యకలాపాలతో, శాస్త్రవేత్తల మహత్తర మేధోకృషి తోడైన ఫలితంగా పోగుపడుతూ అభివృద్ధి అవుతున్న శాస్త్ర సాంకేతికతలను వాడుకుని ఇటువంటి అశాస్త్రీయ, మౌఢ్యపూరిత, మోసపూరిత కళాంశాలుగా మార్చడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నది. అఖండ తరహా సినిమాలను బహిష్కరించవలసిందిగా యువతరానికి జనసాహితి పిలుపునిస్తుంది. ఇలాంటి సినిమాల విడుదలకు సహకరిస్తున్న ప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నది.

## 8. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి!

మహిళలపై, ఆడపిల్లలపై రోజురోజుకూ లైంగిక వేధింపులు, హింసాత్మక దాడులు పెరిగిపోతూనే వున్నాయి. ఇంటా, బయటా పని ప్రదేశాల్లో రక్షణ లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో దళిత మహిళలు భూస్వామ్య, పెత్తందారీ శక్తుల దురాగతాలకు, దౌర్జన్యాలకు బలి అవుతూనే వున్నారు. వ్యవస్థీకృతమై ఉన్న పురుషాధిపత్య భావజాలం స్త్రీలపై పెరుగుతున్న లైంగిక దాడులకు, హత్యాకాండకు ప్రధాన కారణంగా వున్నది. దీనికి తోడు మద్యం, మత్తుపదార్థాలు, టి.వి.లు, ఇంటర్నెట్‌లు ద్వారా వెదజల్లుతున్న సాంస్కృతిక కాలుష్యం మహిళలపై హింసను తీవ్రతరం చేస్తున్నది.

మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు కారణమవుతున్న మద్యం, మత్తుపదార్థాలను, పోర్న్‌సైట్స్‌ని నిషేధించాలని డిమాండ్ చేస్తున్నాం. పేట్రేగిపోతున్న లైంగిక దాడులను అరికట్టడానికి ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని తీర్మానిస్తున్నాం.

## 9. క్రిప్టో కరెన్సీ మాయాజాలంలో భారత్!

క్రిప్టో అంటే రహస్యం అని అర్థం. కనుక దీనిని రహస్య ధనం అనవచ్చు. అంటే డబ్బు మదుపు పెట్టేవాడికి, మదుపు పెట్టించుకునే సంస్థకు తప్ప మూడోవాడికి తెలియదన్నమాట. దీనిలో మదుపు పెట్టిన వాడికి ఎన్నో రెట్లు లాభం రావచ్చు - లేదా మొత్తం ఊడ్చుకుపోవచ్చు. కనుక దీన్ని 'మాయధనం' అని కూడా పిలువవచ్చు.

ఇదొక చిట్టీ వ్యాపారం. లేదా మల్టీ లెవల్ మార్కెటింగ్. ఒక జూదం. ఒక లాటరీ. మనీలాండరింగ్ వీటన్నింటిలో వున్న దుర్గుణాలన్నీ మూర్తీభవించిన రూపం క్రిప్టో కరెన్సీ. దీనికి భౌతిక రూపం వుండదు. ఎలాంటి నియంత్రణ లేదు. ఎందరో మదుపు చేస్తే అది కొందరికి అందుతుంది. అత్యధికులు నష్టపడి ఆత్మహత్యలు చేసుకుంటున్న ఉదంతాలు ఇప్పటికీ వున్నాయి.

ఈ క్రిప్టో కరెన్సీకి సంబంధించిన బ్లాక్ చైన్ (block chain) టెక్నాలజీలో మైనింగ్ (అంటే గనులలో త్రవ్వి ఖనిజాలను బయటకు తీసినట్లు) చేసి, ఎన్నో రకాల గణాంకాలతో, సంవత్సరాల తరబడి లెక్కలు వేస్తేనే బిట్ కాయిన్ పొందగలరు. ఈ లెక్కల కోసం కంప్యూటర్లు, సర్వర్లు వాడటం వల్ల పర్యావరణంపై కూడా చెడు ప్రభావం పడుతుంది.

ఈ మాయా కరెన్సీ ఉచ్చులో పడ్డ దేశాల్లో మన దేశమే ప్రథమ స్థానంలో వుంది. ఎక్కువగా యువత శ్రమను గౌరవించే చదువులు లేనందువల్లా, నిరుద్యోగం వల్లా తేలిగ్గా డబ్బు సంపాదించాలనే మనస్తత్వంతో క్రిప్టో కరెన్సీ అనే జూదగొండి సంస్కృతిపట్ల ఆకర్షితు లౌతున్నారు. ఇది బుడగలాంటిది. ఎప్పుడు పేలిపోతుందో తెలియదు. చైనా, ఇండోనేసియాలో దీన్ని నిషేధించారు. మనదేశంలో రిజర్వ్‌బ్యాంకు విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు తొలగించింది. శీతాకాల సమావేశాల్లో పార్లమెంటులో దీనిపై నియంత్రణ విధిస్తూ ఒక బిల్లు ప్రవేశపెడుతోంది.

సాంకేతిక విప్లవం అతి కొద్దిమంది సంపద పెంపుకు దోహదం కారాదు. అది ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, నిరాదరణ, ఆరోగ్యం, సామాజిక భద్రతారాహిత్యం, రకరకాల వివక్షతలు మొదలగు వాటి విముక్తికై ఉపయోగపడాలని జనసాహితి తీర్మానిస్తోంది. ✦

## ధన్యవాదాలు

సాహిత్య, కళారంగ ప్రముఖులు దివి వెంకట్రామయ్యగారు జనవరి 13, 2020న హైదరాబాద్‌లో తన 79వ ఏట గుండెపోటుతో మరణించారు. ఆయన మరణానంతరం వారి కుటుంబసభ్యులు దివి వెంకట్రామయ్యగారి ఇంటి లైబ్రరీలోని సాహిత్య, సాంస్కృతికరంగానికి సంబంధించిన పుస్తకాలను 'ప్రజాసాహితి' లైబ్రరీకి అందించారు. వారికి 'ప్రజాసాహితి' ధన్యవాదాలు తెలియచేస్తుంది. ✦

# గోరంట్ల వెంకటేశ్వరరావుగారి 9వ వర్ధంతి



**గోరంట్ల వెంకటేశ్వరరావుగారు** 30-6-27న ఇంకొల్లు మండలం ఇదుపులపాడు గ్రామంలో జన్మించారు. చిన్న వయసులోనే కాంగ్రెస్ సేవాదళ్ నాయకునిగా అనేక కార్యక్రమాలు నిర్వహించి మంచి కార్యకర్తగా పేరు తెచ్చుకున్నారు. అగ్రనాయకులతో పరిచయాలుండేవి. తర్వాత హిందీ చదువుకోసం పామర్రు దగ్గర విద్యావనం వెళ్ళారు.

అక్కడ చదువు పూర్తయ్యాక చీరాలలో కొంతకాలం హిందీ ప్రైవేట్లు చెప్పారు. 21-4-1956 సం॥లో కొత్తపల్లి వేంకటకృష్ణవర్మగారమ్మాయి వాణీదేవితో వీరి వివాహం జరిగింది. చీరాల హైస్కూలులో హిందీ పండిట్‌గా చేరారు. సమర్థులైన ఉపాధ్యాయునిగా పేరుపొందారు. 1991లో రిటైర్ అయ్యారు. 1.1.2013న వీరు మరణించారు. సంస్మరణార్థం కుటుంబసభ్యులు వారి ప్రథమవర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 25,000/-లు అందచేశారు.


వారి 9వ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' వారిని గుర్తు చేసుకుంటోంది. ✦

# ప్రజాతంత్ర న్యాయవాది కంఠంనేని రవీంద్రరావుగారి 7వ వర్ధంతి



**కంఠంనేని** రవీంద్రరావుగారు విజయవాడలో విలువలకు కట్టుబడిన న్యాయవాదిగా ప్రసిద్ధి. వీరు కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో 1936లో జన్మించారు. హైస్కూలు అవనిగడ్డలోనూ, ఇంటర్+డిగ్రీ మచిలీపట్నంలోనూ, న్యాయశాస్త్రాన్ని విశాఖపట్నంలోనూ పూర్తిచేసి 1962లో అవనిగడ్డలో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించారు. విద్యార్థిదశనుండీ వామపక్ష రాజకీయాలతో సాగుతూ, వృత్తిపరంగా పేదల పక్షాన నిలిచి పీడిత ప్రజాఉద్యమాలకు న్యాయవాదిగా సహకరించారు. పార్వతీపురం, హైదరాబాదు కుట్రకేసులకు సాయపడ్డారు. దివిసీమ ఉప్పెనకు గురయినప్పుడు (1977 నవంబరు) సహాయక చర్యలనందించే కృషికి బాధ్యత వహించారు. టంగుటూరు పొగాకు రైతుల ఉద్యమాలపై అణచివేతలో భాగంగా కేసులు మోపినపుడు బాధితుల పక్షాన కేసులు వాదించారు. ఓ.పి.డి.ఆర్. రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా వుంటూ తనకు ఆరోగ్యం సహకరించినంత వరకు ఉద్యమానికి తోడ్పడ్డారు. వారు కోరిన ప్రకారం వారి దేహాన్ని వైద్యవిద్యార్థుల అధ్యయనానికి తోడ్పడేవిధంగా వైద్య కళాశాలకు అప్పగించారు.

'ప్రజాసాహితి' ప్రారంభంనుండి పాఠకునిగానేకాక తగు అభిప్రాయాలూ, సూచనలూ యిస్తూ నిశిత పరిశీలకునిగా వుండేవారు. కంఠంనేని రవీంద్రరావుగారి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు 'ప్రజాసాహితి' పత్రికకు ఏభైవేల రూపాయలు శాశ్వతనిధికి అందజేశారు. ఆయన 11-1-2015న మరణించారు. రవీంద్రరావుగారి 7వ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' వారిని జ్ఞాపకం చేసుకుంటోంది. ✦



# నండూరి రాఘవయ్యగారి 14వ వర్ధంతి

**అడవులదీవి** వాస్తవ్యులు నండూరి రాఘవయ్యగారు తన 97వ ఏట 2008 జనవరి 26న మరణించారు. వారి భార్య యశోదమ్మగారు 1999 జులై 4న మరణించారు. వారి కుమారుడు నండూరి నారాయణరావు భౌతికవాదిగా కృషి చేస్తున్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆయన 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి ఇరవై ఐదువేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు. గత 40 ఏళ్ళ నుండి నారాయణరావుగారు 'ప్రజాసాహితి' పాఠకుడిగా, శ్రేయోభిలాషిగా వున్నారు. వారి 14వ వర్ధంతి సందర్భంగా ప్రజాసాహితి జ్ఞాపకం చేసుకుంటోంది. ✦

# డా॥ యం.వి. రమణారెడ్డి మరణం

**సాహిత్య** పిపాస, సామాజిక సేవ జీవలక్షణంగా వున్న వైద్యుడు డా॥ మల్లెల వెంకట రమణారెడ్డి, సంవత్సరకాలంగా క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ వ్యాధి (COP)తో బాధపడుతూ, ఆక్సిజన్ సిలిండర్ సాయంతో మృత్యువును దూరంగా నెడుతూ తాను అనుకున్న రచనలను పూర్తిచేసి, స్వీయచరిత్ర ప్రారంభించి 29-9-2021న తన 78వ యేట కర్నూలు మెడికాన్ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన ప్రొద్దుటూరులో 04-04-1944న జన్మించారు.

ప్రొద్దుటూరులో, విజయవాడ లోయలా కళాశాలలో, ఆ తర్వాత గుంటూరు వైద్య కళాశాలలో రమణారెడ్డి చదివారు. వైద్య విద్యార్థిగా వున్నపుడే 1966లో 'కవిత' సాహిత్య పత్రికను 'బాపు', 'చంద్ర' బొమ్మలతో రెండు సంచికలు ప్రచురించారు. ప్రొద్దుటూరులో పేదల వైద్యునిగా పేరు తెచ్చుకున్నారు. మూఢనమ్మకాలను, దొంగ స్వాములను క్రియాశీలంగా ఎదుర్కొన్నారు. 1969లో 'యువ సమాఖ్య' స్థాపించి, కేవలం వాగ్దానాలతో మోసం చేసే రాజకీయ నాయకులను నేరుగా ఎదుర్కొన్నారు. సాయుధ విప్లవ సానుభూతి పరుడయ్యారు. 'ప్రభంజనం' పక్ష పత్రికను ప్రారంభించారు. విప్లవ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. ఆయన రాసిన వ్యాసాల కారణంగా ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద సికింద్రాబాదు జైలులో ఖైదీ అయ్యారు. జైలులో తరిమెల నాగిరెడ్డి మొదలగు విప్లవ నాయకులతో కలసి వున్నారు.

ఆంధ్రా కాటన్ మిల్లు కార్మికులుకు అనారోగ్యం వస్తే మందులు కొనుక్కోడానికి కూడా సరిపోయే జీతాలు లేని పరిస్థితిని గమనించి కార్మిక సంఘం స్థాపించి, సమ్మె ద్వారా విజయం సాధించారు. 1970 జులై 4న ఏర్పడిన విప్లవ రచయితల సంఘం సంస్థాపక కార్యవర్గ సభ్యులలో ఒకరిగా వున్నారు. నెల్లూరులో గునిపాటి రామచంద్రరావును నక్సలైట్లు చంపిన కేసులో, వీరిని ఇరికించి అరెస్టు చేయగా ఆరునెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు. 1973లో జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజులతో పాటు అరెస్టయ్యారు. 1975లో అనంతపురంలో జరిగిన విరసం సభల్లో, విరసంతో విభేదిస్తూ రాజీనామా చేసినవారిలో వీరొకరు. ప్రొద్దుటూరు మాజీ ఎం.ఎల్.ఏ. రామసుబ్బారెడ్డి హత్యకేసులో ముద్దాయిగా ఇరికించగా, మూడు నెలలు అజ్ఞాతంగా వుండి, కోర్టుకు లొంగిపోయి, సంవత్సరం తర్వాత బెయిల్‌పై బయటికొచ్చిన రెండోరోజే 1975 జూన్‌లో ఎమర్జన్సీలో అరెస్టయ్యారు. 1976లో హత్యకేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవించారు. ప్రొద్దుటూరులో రాయలసీమ వ్యాయామ కళాశాలను స్థాపించారు.

'రాజకీయం అనే బురదలో పొర్లడం కంటే సాహిత్యం అనే గంగలో చావడం మంచిది' అని చెప్పిన రమణారెడ్డి గడియారం వెంకటశేష శాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, గజ్జల మల్లారెడ్డి, శ్రీశ్రీల రచనలతో ప్రభావితుడయ్యారు. 'రాయలసీమ కన్నీటిగాథ' పేరుతో సీమ కరువు పరిస్థితులు, చేపట్టవలసిన ప్రణాళికలు, పాలకవర్గాల వైఫల్యాలను మొదటిసారిగా ప్రజల ముందుకు తెచ్చారు. 1983లో రాయలసీమ విమోచన సమితిని స్థాపించి ఆమరణ నిరాహారదీక్ష చేశారు. అంతకుముందే 1980లో పోతిరెడ్డిపాడు పాదయాత్ర చేశారు. తెలుగుదేశం పార్టీ శాసనసభ్యునిగా ఎన్నికై రెండేళ్ళ తర్వాత రాయలసీమ సమస్యలపట్ల పార్టీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు.

సికింద్రాబాదు జైలులో సన్నిహితుడైన సి.కె. నారాయణ రెడ్డి ప్రోద్బలంతో డా॥ జాషువా హార్న్ రాసిన Away with rests అనే గ్రంధాన్ని 'పురోగమనం' పేరుతో అనువదించారు. ఆ తరువాత ఆర్.కె.నారాయణ్ రాసిన 'A Tiger for Malgudi'ని పెద్దపులి ఆత్మకథగానూ, 'Talkative Mass'ను 'మాటకారి' పేరుతోనూ అనువాదం చేశారు. ప్రపంచ ప్రసిద్ధిపొందిన హెన్రీ షారియార్ రాసిన 'పాపియాన్'ను 'రెక్కలు చాచిన పంజరం'గానూ, మార్గరెట్ మిచెల్ రచన 'గాన్ విత్ ది విండ్'ను 'చివరకు మిగిలింది'గానూ, మాక్సిమ్ గోర్కీ నవల 'మదర్'ను 'కడుపుతీపి'గానూ తెలుగులోకి అనువదించారు.

తన మౌలిక రచనలు మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్‌పై 'ఆయుధం పట్టని యోధుడు' 'తెలుగు సినిమా స్వర్ణయుగం', 'శంఖారావం' (వ్యాసాలు, వ్యక్తీకరణలు) 'తెలుగింటి వ్యాకరణం', 'పరిష్కారం' (కథాసంపుటి), 'తెలుగింటికొచ్చిన ద్రౌపది', 'ప్రపంచ చరిత్ర' నాలుగు భాగాలు ప్రచురించారు.

తీవ్రవాద వామపక్ష రాజకీయ పార్టీతో సంబంధాలు కల్గిన తనను రాజ్యం పలు హత్యాకేసులలో ఇరికించి, రాయలసీమ ముఠా కక్షలలో తనపై ముఠా ముద్రవేసినట్లు ఒక టీ.వీ. ఛానల్ నిర్వహించిన 'ధర్మపీఠం' కార్యక్రమంలో ఆయన చెప్పారు.

వై.ఎస్. రాజశేఖరరెడ్డికి వ్యతిరేకంగా కడప పార్లమెంటు స్థానానికి 1989లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీచేసి ఓడిపోయాడు. ప్రజారాజ్యం పార్టీలో, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో కూడా కొంతకాలం పనిచేశారు. ఆ విధంగా విప్లవ రాజకీయ స్రవంతి నుండి పాలకవర్గ రాజకీయ ప్రవాహంలో భాగంగా మారారు. కడపజిల్లా ప్రాంత ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఫ్యాక్షన్ రాజకీయాలలో క్రింద మీదులైనాడు. పాలక రాజకీయ బురదను ఎంత పులుముకున్నా, తన చిన్ననాటి గురుబోధన ప్రకారం, ఆయన ప్రజాసాహిత్య ప్రయాణాన్ని చివరికంటా కొనసాగించారు.

# సోనాల్ శుక్లా మరణం

**మహిళాసమస్యలపై** విశేష కృషిచేసిన గుజరాతీ రచయిత్రి సోనాల్ శుక్లా ముంబయిలో 9-9-2021న తన 80వ యేట గుండెపోటుతో మరణించారు. సోనాల్ బెహన్‌గా పరిచయమైన ఆమె వారణాసిలో 1941లో జన్మించారు.

ఉపాధ్యాయురాలిగా, అధ్యాపకరాలిగా పనిచేసిన ఆమె పారిశుద్ధ్య కార్మికులు, మహిళల ఉద్ధరణకై పలు ఉద్యమాలలో పనిచేశారు. రెండు గుజరాతీ పత్రికలలో క్రమబద్ధంగా రాసేవారు. ముంబయిలో స్వతంత్ర ప్రతిపత్తి గల 'ఫోరం ఎగనెస్ట్ రేప్' (లైంగిక దాడుల వ్యతిరేక వేదిక), ప్రారంభించి, ఆ తర్వాత దానిని "మహిళల అణచివేత వ్యతిరేక వేదిక"గా విస్తృతం చేసి నిర్వహించారు. 1987లో 'లిటరరీ అండ్ విమెన్స్ రిసోర్స్ సెంటర్' స్థాపించారు. 'వాచా చారిటబుల్ ట్రస్టు' ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

# జీతన్ మరాండీ మరణం

**జార్ఖండ్** ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు జీతన్ మరాండీ తన 35వ యేట 13-9-2021న అనారోగ్యంతో మరణించారు. ఆయన జార్ఖండ్‌లోని గిరిఢీ జిల్లాలోని కరాండోలో జన్మించారు.

సంతాల్ తెగకు చెందిన జీతన్ ఆరుగురి పిల్లల్లో ఒకడు. అందరూ పశువుల కాపర్లే. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆయన 4వ తరగతితో చదువు ఆపేశారు. తన గ్రామానికి వచ్చిన జానపద నృత్య, గాన బృందం పట్ల ఆకర్షితుడై తన 10వ యేట ఆ బృందంలో చేరారు. తన 15వ యేట వామపక్ష రాజకీయాల్లో ప్రవేశించి నక్సలైట్ సిద్ధాంతాన్ని ప్రచారం చేయటం ప్రారంభించారు.

'జార్ఖండ్ అభియాన్' అనే సాంస్కృతిక బృందాన్ని ప్రారంభించి, దాని ద్వారా గ్రామాలలో, పట్టణాలలో సమకాలీన సామాన్య ప్రజల సమస్యల గురించి వివిధ సాంస్కృతిక రూపాలను ప్రదర్శిస్తూ, ప్రజలను చైతన్యపరచే కార్యక్రమాలలో విరివిగా పాల్గొన్నారు. తన బృందంతో బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో పర్యటించారు.

డోలక్‌ను ఉపయోగిస్తూ ఆయన పాడిన పాటలు కేసెట్ల రూపంలో జార్ఖండ్‌లోని గ్రామాలలో, పట్టణాలలో మారుమ్రోగేవి. ఆ పాటలన్నీ ఆకలితో పస్తులుండటం గురించీ, ఆదివాసీలపై జరిగే లూటీల గురించి, ఆదివాసుల విస్థాపన గురించీ, ప్రజాప్రతిఘటన గురించీ, దోపిడీవ్యవస్థ గురించీ వివరించేవి. కనుక 2000 మేడే నాడు నక్సల్ అనే అభియోగంపై జార్ఖండ్ పోలీసులు అరెస్టు చేసి, 11 నెలల తర్వాత బెయిల్ ఇచ్చారు. 2005లో మజ్దూర్ సంఘటనల సమితి కార్యాలయంపై జరిగిన దాడిలో కార్మిక నాయకునిగా అరెస్టు అయ్యారు. 2008 ఏప్రిల్ 5న మాజీ ముఖ్యమంత్రి కుమారుడు, మరో 19 మందిపై చిల్కారి గ్రామంలో మావోయిస్టులు దాడిచేసి చంపేసిన ఘటనలో ఇరికించగా, వారిలో జీతన్, మరో ముగ్గురికి సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధించింది. ఐదేళ్ళపాటు ఈ కేసు నడిచింది. అయితే హైకోర్టు ఉరిశిక్షను రద్దుచేయగా, ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళగా, అక్కడ కూడా హైకోర్టు తీర్పును సమర్థించగా, జీతన్ విడుదల అయ్యారు. ఉరిశిక్ష విధించిన సందర్భంగా దేశంలోనూ, విదేశాలలోనూ దాని రద్దుకై ఉద్యమాలు సాగాయి.

నిజానికి చిల్కారి హత్యాకాండ జరిగిన రోజున జీతన్ తన గ్రామంలో "ముఝ్‌కో ఉగ్రవాదీ బనాదియా తుమ్‌నే" (నన్ను నీవే ఉగ్రవాదిగా మార్చావు) అన్న పాట రికార్డింగ్ కార్యక్రమంలో వున్నారు. ఈయన పేరే గల మరో నక్సల్ ఆ దాడిలో వుంటే, ఈయన్నే ఆయనగా అరెస్టు చేశారు. ఎలాగూ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలలో వున్నారు గనుక ప్రభుత్వం ఈ కేసులో ఇరికించింది. భార్య అపర్ణ ఈ ఉరిశిక్షకు వ్యతిరేకంగా కృషి చేశారు. ఆమెను కూడా 2012 డిసెంబర్ 8న ఆమె నక్సల్ అనీ ఆమె టెక్ పేరు సంతోషిని అని చెబుతూ పోలీసులు అరెస్టు చేయగా 6 నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు.

చైతన్య తమ్‌హానీ అనే సినిమా నిర్మాత జీతన్ మరాండీ జీవితంలోని ఘట్టాలతో 'కోర్టు' అనే చలన చిత్రాన్ని నిర్మించగా, దానిని ఆస్కార్ అవార్డుల పోటీకి కూడా పంపారు.

# మండవ శ్రీరామమూర్తి మరణం

**ప్రభుత్వ** వ్యవసాయ బ్యాంకులో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన రచయిత మండవ శ్రీరామమూర్తి తన 82వ యేట 26-9-2021న విజయవాడలో కన్నుమూసారు. ఆయన నాగాయలంకలో జన్మించారు.

ఆవుల గోపలకృష్ణమూర్తి ప్రభావంతో ఎం.ఎన్. రాయ్ నవ్యమానవవాదంకి ఆకర్షితులై అవనిగడ్డలో వారంరోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. పోలు సత్యనారాయణతో కలసి 'దళిత జాతుల వైతాళికుడు అంబేద్కర్' అనే పుస్తకాన్ని రచించారు. ఎందరివో జీవిత చరిత్రలు రాసిన వీరికి 1995లో 'కీర్తి పురస్కారం' లభించింది. ఇన్నయ్య, సి. ధర్మారావులతో కలసి గోరాశాస్త్రికి ఆర్థిక సహాయం కోసం డబ్బులు వసూళ్ళు చేశారు. 1979లో గోరాశాస్త్రి షష్టిపూర్తి సన్మాన కమిటీలో సభ్యులుగా వుండి, అభినందన సంచిక వెలువరించారు. 'మందారమాల' వీరి మరో రచన.

చనిపోయేవరకూ తెలుగునాట వున్న ప్రగతిశీల రచయితలు, వ్యక్తులు, పత్రికలతో సజీవ సంబంధాన్ని కొనసాగించిన శ్రీరామమూర్తి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది.

# పి. సూర్యనారాయణ మరణం

**ఉపాధ్యాయుడు,** ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంఘం (ఓపిడిఆర్) నాయకులు పెద్దింటి సూర్యనారాయణ తన 72వ యేట 29-9-2021న మరణించారు. ఆయన 1949 జూన్ 1న బొబ్బిలి పార్వతీపురం మధ్య వున్న ఇప్పలవలసలో జన్మించారు.

33 ఏళ్ళు ఉపాధ్యాయునిగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌లో పనిచేశారు. 1982-83లో ఓపిడిఆర్‌లో చేరారు. 2017లో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యత స్వీకరించారు.

# పురాణం శ్రీనివాసశాస్త్రి మరణం

**జర్నలిస్టు,** కథారచయిత పురాణం శ్రీనివాసశాస్త్రి తన 70వ యేట 22-10-2021న మరణించారు. ఆయన 1953 జూన్ 1న పశ్చిమగోదావరిజిల్లా జగన్నాథపురంలో జన్మించారు. ఆయన ప్రముఖ సంపాదకుడు, రచయిత ఐన పురాణం సుబ్రహ్మణ్యశర్మ కుమారుడు. కథారచయితగా స్వయం ప్రతిభ కల్గినవాడు. 2020 అక్టోబర్ 25న ప్రారంభమైన 'కోకిలమ్ తెలుగు డైజస్టు', సాహితీ సాంస్కృతిక సామాజిక వేదిక ఛానల్ సహ సంస్థాపకులుగా వున్నారు. పురాణం శ్రీశాగానూ, శ్రీశాగానూ, పి.ఎస్ పేర్లతో కథలు రాశారు. ఆయన 'ఈనాడు', 'ఆంధ్రభూమి', 'దక్కన్ క్రానికల్', 'వార్త', 'ఆంధ్రప్రభ', 'ప్రజాశక్తి', 'ఈ వారం', 'మన తెలంగాణ' పత్రికల్లో పనిచేశారు.

# సురయా హసన్ మరణం

**మొగలాయిల** కాలం నాటి ప్రత్యేక వస్త్ర రూపాలను తిరిగి బ్రతికిస్తూ టెక్స్‌టైల్ సంస్థనొకదానిని హైదరాబాదులో 56వ దశకంలో స్థాపించి, చివరివరకూ విశిష్ట కళాత్మక వస్త్రాలను తయారు చేయడంలో నిమగ్నమైన సురయాహసన్ తన 93వ యేట హైదరాబాదులో 3-9-2021న మరణించారు. ఆమె 1928లో జన్మించారు.

2004 అగస్టు 'ప్రజాసాహితి'ని ఉపఖండపు ఉమ్మడి సాహిత్య ప్రత్యేక సంచికగా రూపొందించుతున్న క్రమంలో సురయా పరిచయమయ్యారు. హైదరాబాదు నుండి పాకిస్తాన్‌కు రహస్యంగా వెళ్ళి సజాద్ జహీర్ ఆదేశాల ప్రకారం అక్కడి అభ్యుదయ రచయితలనందరినీ కూడగట్టి, కరాచీలో కార్మిక, విద్యార్థి, యువజనరంగాల్లో కృషిచేసిన హసన్ నాసిర్ గురించి సమాచారం రాజ్‌బహదూర్‌గౌర్ ద్వారా జనసాహితికి తెలిసింది. హసన్ నాసిర్ రెండేళ్ళపాటు దేశ బహిష్కరణ శిక్ష తర్వాత మరల పాకిస్తాన్ వెళ్ళి సింధు రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా, ఆ తర్వాత కేంద్ర కమిటీ సభ్యునిగా పనిచేస్తున్న క్రమంలో ఆయూబ్ ఖాన్ హయాంలో అరెస్టయి, జైలులోనే మతోన్మాద గూండాల చేత 1960 నవంబర్ 13న హతుడయ్యాడు.

సురయా హసన్ నేతాజీ మేనల్లుడు అరవింద్ బోస్‌ను వివాహమాడారు. నేతాజీ వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన అబిద్ హసన్ ('జైహింద్' నినాద రూపకర్త) అన్న బద్రుల్‌హసన్ కుమార్తె సురయా హసన్. హసన్ నాసిర్, అబిద్ హసన్ అక్క కొడుకు. ఆవిధంగా హసన్ నాసిర్ గురించి మరింత సమాచారం కోసం సురయా హసన్ జనసాహితికి పరిచయమయ్యారు. 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికను హసన్ నాసిర్‌కు అంకితమిచ్చాం. దాని ఆవిష్కరణ సభకు 74 ఏళ్ళ సురయా హాజరయ్యారు. ఆ తర్వాత జనసాహితి ప్రచురించిన హసన్ నాసిర్ ఉర్దూ రచనల సంకలనం ఆవిష్కరణ సభకు తన 84వ ఏట సురయా హాజరయ్యారు.

# ఆచార్య పి.ఎల్. శ్రీనివాసరెడ్డి మరణం

**అభ్యుదయ** కవి, కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ఆచార్యుడు పి.ఎల్. శ్రీనివాసరెడ్డి తన 72వ యేట 2021న అనంతపురంలో మరణించారు. ఆయన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు తాలూకా పార్లపల్లెలో 1949 అగస్టు 8న జన్మించారు.

జి.ఎన్. రెడ్డి పర్యవేక్షణలో పి. హెచ్‌డి సాధించిన శ్రీనివాసరెడ్డి సాహిత్య విమర్శకునిగా, ఉపన్యాసకునిగా, తెలుగు భాషోద్యమకారునిగా, చమత్కార ధ్వనిపూరిత పద ప్రయోగకర్తగా ప్రసిద్ధులు. ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యంపైనా, భాషాశాస్త్రంపైనా సాధికారత సంపాదించినవారు.

శ్రీనివాసరెడ్డి రాసిన అనేక గ్రంథాలలో శ్రీనాథుని భాషపై పరిశోధనా గ్రంథం, స్వేదాశ్రవులు (కవిత్వం) శతక పద్యాల సామాజిక విశ్లేషణ, శ్రీనివాసాలు (వ్యాసాలు), ఇంకెన్నాళ్ళీ విధ్వంసం (కవితలు), తొలకరి (పద్యాలు) శ్రీ పీఠికలు, విద్యుల్లతలు (కవితలు) కొన్ని మాత్రమే.

వారి కవితలు 'ప్రజాసాహితి'లో కూడ ప్రచురింపబడ్డాయి.

# జలజం సత్యనారాయణ మరణం

**ఉపాధ్యాయుడు,** అధ్యాపకుడు, కవి, అనువాదకుడు అయిన జలజం సత్యనారాయణ తన 90వ యేట మహబూబ్‌నగర్‌లో 04-11-2021న మరణించారు.

ఉపాధ్యాయునిగా ప్రవేశించి, ఆ తర్వాత జూనియర్ కళాశాలలోనూ, డిగ్రీ కళాశాలలోనూ పనిచేసి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన రిటైరయ్యారు. కవిగా ఆయన మొదటి కవితా సంపుటి 'అనల'. ఆ తరువాత జయశంకర ప్రసాద్ హిందీ కావ్యం 'అంసూ' (కన్నీరు)ను తెలుగులో 'వేదన'గానూ, సూఫీకవి హఫీజ్ కవిత్వాన్ని 'ప్రేమలహరి' పేరుతోనూ, ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవిత్వాన్నీ, వాజపేయీ కవిత్వాన్ని 'శిఖరం' పేరుతోనూ అనువదించారు. 'శృంగార బిల్హణీయం' రచించారు. 'కబీర్ గీత'గా కబీర్ కవితలను అందించారు.

మహబూబ్‌నగర్‌లో న్యూవిజన్ జూనియర్ కళాశాల, లిటిల్ స్కాలర్స్ పాఠశాలలు నెలకొల్పి నిర్వహించారు. 'ధ్వని', 'క్రాంతి' పత్రికలు ప్రచురించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషిచేశారు.

# ఆలూరి లలిత మరణం

**విప్లవ** రచయితల సంఘం సభ్యురాలు, ప్రసిద్ధ అనువాదకుడు ఆలూరి భుజంగరావు జీవిత సహచరి లలిత తన 76వ యేట గుల్బర్గాలో 21-11-2021న మరణించారు.

లలిత సహకారంతో భుజంగరావు తన సాహిత్య కృషిని నిర్విరామంగా కొనసాగించారు. లలిత భుజంగరావుతో కలిసి పదేళ్ళపాటు అజ్ఞాతవాసం చేశారు. ప్రగతిశీల, విప్లవ సాహిత్యాన్ని ప్రతి సభలోనూ ప్రదర్శించి అమ్మేవారు.

వారి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని తెలియచేస్తోంది.

# కథా, నవలా, నాటకా రచయిత్రి, ఉపాధ్యాయురాలు మనూ భండారీ మరణం

**హిందీ** సాహిత్యంలో నయీ కహానీ ఉద్యమంలో ఒకరైన మనూ భండారీ తన 90వ యేట గుర్‌గాంవ్‌లో 15-11-2021న మరణించారు. ఆమె 03-04-1931న మధ్యప్రదేశ్‌లోని ఖాన్‌పురాలో జన్మించారు. అజ్మీర్, రాజస్థాన్‌లో పెరిగారు. తండ్రి సుఖ సంపత్‌రాయ్ భండారి స్వాతంత్ర్య సమరయోధుడు. సంఘ సంస్కర్త. ఆర్యసమాజం సభ్యుడు. ఇంగ్లీషు – హిందీ, ఇంగ్లీషు – మరాఠీ పదకోశాలను మొదటగా తయారుచేసినవారు.

మనూ భండారీ అజ్మీర్‌లోనూ, కలకత్తా విశ్వవిద్యాలయంలోనూ చదివి బెనారస్ హిందూ యూనివర్శిటీలో హిందీ ఎం.ఏ. చదివారు. కలకత్తాలోని బాలీ గంజ్ శిక్షా సదన్, రాణి బిర్లా కళాశాలలోను హిందీ లెక్చరర్‌గా 1965 వరకు పనిచేశారు. మరో కథారచయిత రాజేంద్రయాదవ్‌ను వివాహం చేసుకొని ఢిల్లీ వెళ్ళి మిరాండా హౌస్ కాలేజీలో పనిచేశారు. 1992-94లలో విక్రమ్ విశ్వవిద్యాలయం వారి ప్రేమ్‌చంద్ జ్ఞానపీఠకు గౌరవ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రేమ్‌చంద్ స్థాపించి 1930-1953 మధ్య నడిపిన 'హంస్' పత్రికను రాజేంద్రయాదవ్ పునరుద్ధరించి 1986 నుండి నడిపారు. మనూ, రాజేంద్ర 1980లో విడిపోయినా, విడాకులు తీసుకోలేదు. 2013లో రాజేంద్ర మరణించేవరకు మిత్రులుగా కొనసాగారు.

మనూ భండారీ మొదటికథ "నేను ఓడిపోయాను" 1957లో 'కహానీ' పత్రికలో వచ్చింది. దీనిని తర్వాత జాతీయ రంగస్థల ఉత్సవంలో నాటకంగా ప్రదర్శించారు. ఆమె భర్తతో కలిసి రాసిన మొదటి నవల "ఒక అంగుళం చిరునవ్వు", 'జ్ఞానోదయ్' పత్రికలో సీరియల్‌గా ప్రచురించారు. 1972లో రెండో నవల 'ఆప్‌కా బంటీ'లో 9 ఏళ్ళ అమ్మాయి విడాకులు తీసుకున్న తన తల్లిదండ్రుల గురించి చెప్పిన కథ. ఇది 'ధర్మయుగ్' పత్రికలో సీరియల్‌గా వచ్చింది. దీనిని సాహిత్య విమర్శకులు హిందీ నవలా సాహిత్యంలో ఒక మూల మలుపు, ఒక మైలురాయిగా ప్రశంసించారు. 1979లో ప్రచురించిన మూడో నవల పేరు 'మహాభోజ్'. మే 1977లో బీహార్‌లోని బెల్చీ గ్రామంలో అగ్రకులాలవారి ప్రైవేటు సైన్యం 11 మంది దళితులను, షెడ్యూలు కులాలవారిని చంపేసి తగలబెడుతూ విందు చేసుకున్న ఘోర సంఘటన నేపథ్యంగా రాసిన నవల ఇది. ఇది 2021 నాటికి 31 ముద్రణలు పొందింది. దీనిని నాటకంగా పలుసార్లు ప్రదర్శించారు. 'గోడలు లేని ఇల్లు' వీరు రాసిన ఇంకొక నాటకం.

మనూ భండారీ మొత్తం 3 నవలలు, 9 కథా సంపుటాలు, 4 నాటకాలు, 3 బాలసాహిత్య గ్రంథాలు, స్వీయచరిత్ర రాశారు. ఆమె రాసిన 'యహీ సచ్ హై' కథను బసు చటర్జీ 'రజనీ గంథ' సినిమాగా తీశారు. ఆమె టీ.వీ. సీరియల్స్‌కు స్క్రీన్‌ప్లే రాశారు.

'నయీ కహానీ' ఉద్యమంలో రాజేంద్రయాదవ్, నిర్మల్ వర్మ, భీష్మ సహానీ, కమలేశ్వర్, మోహన్ రాకేశ్, అమర్‌కాంత్ ఉషాప్రియంవద, కృష్ణసోబ్తిలతోపాటు కృషిచేసి, కొత్తగా ఆవిర్భవిస్తున్న మధ్యతరగతివారి జీవితాలను, వారి ఆకాంక్షలను, సమస్యలను తన సాహిత్యంలో సృష్టించిన మనూ భండారీ మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది.

# కర్నాటి రామమోహనరావు మరణం

**ప్రముఖ** ప్రజా న్యాయవాది కర్నాటి రామమోహనరావు తన 82వ యేట విజయవాడలో 07-11-2021న అనారోగ్యంతో మరణించారు. ఆయన కృష్ణాజిల్లా చందర్లపాడు మండలం చింతలపాడులో జన్మించారు.

ఖమ్మంలో విద్యార్థిగా ఎఐఎస్ఎఫ్‌లో, ఎస్ఎఫ్ఐలో చురుకుగా పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్ర పట్టా పొంది 1967లో న్యాయవాది వృత్తిలో ప్రవేశించారు. 1965లో అజ్ఞాతంగా వుంటూ ఖమ్మంజిల్లా సి.పి.యం. పార్టీ కార్యదర్శిగా పనిచేశారు.

న్యాయవాదిగా అనేక వివాదాస్పద కేసులు చేబట్టి వాదించారు. ఉరిశిక్షల రద్దు ఉద్యమంలో విజయవాడలో హైకోర్టు బెంచి కావాలనే ఆందోళనలో క్రియాశీలంగా పనిచేశారు. సామాజిక అవగాహనతో, అనేక కేసులలో ప్రజాపక్షం వహించి వాదించిన కర్నాటికి నివాళి.

# అధ్యాపకురాలు, రచయిత్రి, అనువాదకురాలు వెనిగళ్ళ కోమల మృతి

**ఇంగ్లీషు** అధ్యాపకురాలు, రచయిత్రి వెనిగళ్ళ కోమల 6-12-2021న వాషింగ్టన్ డిసిలో మరణించారు. ఆమె తెనాలి సమీపాన గల మూల్పూరులో జన్మించారు. 12వ ఏట మద్రాసులో దక్షిణ భారత హిందీ ప్రచారసభ వారి 10 నెలల హిందీ కోర్సు పూర్తిచేసి, చిత్తూరులో రాష్ట్ర భాషాప్రవీణ, ప్రచారక్ తన 16వ ఏట పూర్తిచేసి హిందీ టీచర్‌గా చేయడానికి అర్హత సంపాదించారు. ఆ తర్వాత కృష్ణాజిల్లా పామర్రు సమీపాన గల విద్యావనంలో చేరి మెట్రిక్యులేషన్ పూర్తిచేసి తెనాలి కళాశాలలో ఎఫ్.ఏ. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో ఇంగ్లీషు సాహిత్యంలో బి.ఏ. ఆనర్స్, 1959లో గుంటూరులో బిఇడి పూర్తిచేసి, తను చదివిన సెయింట్ జోసఫ్ కళాశాలలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు.

1964లో తెనాలిలో ఆవుల గోపాలకృష్ణమూర్తి నిర్వహణలో హేతువాది నరిశెట్టి ఇన్నయ్యతో ఆమెకు వివాహం జరిగింది. ఆ తర్వాత ఎం.ఏ. పరీక్ష పూర్తిచేసి అన్వర్ ఆల్ ఉలుం కళాశాలలో లెక్చరర్‌గా, ఆ తర్వాత అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యారు.

ఎం.ఎన్.రాయ్ ప్రతిపాదించిన నవ్య మానవవాదాన్ని ఆచరిస్తూ, ప్రచారం చేస్తూ దంపతులిద్దరూ అనేక పుస్తకాలు రచించారు. ఎం.ఎన్.రాయ్ రాసిన 'Memoirs of Cat'ను కోమల 'పిల్లి ఆత్మకథ'గా అనువదించారు. తస్లీమా నస్రీన్ రచన 'శోధ్'ను 'చెల్లుకు చెల్లు' పేరుతో, యూంగ్-చాంగ్ రాసిన 'Wild Swans'ను 'అడవికాచిన వెన్నెల'గానూ, నాజీల అకృత్యాలను చిత్రించిన 'కాళరాత్రి'ని అనువదించారు.

వీరి కుమారుడు రాజు 'వాషింగ్టన్ పోస్ట్'కు 2009-2012లలో సంపాదకునిగా పనిచేసాడు. కుమార్తె నవీన అమెరికాలో చైల్డ్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు.

# కవి, వక్త ఎస్.ఆర్. భల్లం మృతి

**ఉపాధ్యాయుడు,** కవి, వక్త అయిన ఎస్.ఆర్. భల్లం తన 62వ యేట 20-12-2021న అనారోగ్యంతో మరణించారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా పోడూరు గ్రామంలో 1959 జూన్ 1న జన్మించారు.

ఆయన పూర్తిపేరు భల్లం సూర్యనారాయణరాజు. ఉపాధ్యాయునిగా పాలకొల్లు, లంకల కోడేరు, తాడేపల్లిగూడెం మొదలగుచోట్ల పనిచేశారు. తండ్రి పద్య కవిత్వం, కాళోజీ కవిత్వం, అష్టావధానాలు ఆయనను సాహిత్యంవైపు మరలించాయి. సినారె, అద్దేపల్లి, ఎండ్లూరి, ఎన్.గోపీల ప్రభావంతో వచన కవిత్వం రాశారు. మొదట్లో కొన్ని కథలు రాశారు.

'నీటిభూమి', 'గూడు వదలిన గువ్వలు (నానీలు)', 'కొల్లేరు' మొదలగు 10 గ్రంథాలు రచించారు. సినారె రాసిన వివిధ కవితాసంపుటులపై తెలుగునాట నూరు ఉపన్యాసాలు ఇచ్చారు. 10 అవార్డులు అందుకున్నారు. ✦

# ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## నవంబరు, డిసెంబరు 1991 - సంపుటి : 15 - సంచిక : 4

**'పోరాటానికి** పిలుపిస్తున్న గిరిజనుడు' ముఖచిత్రంతో గిరిజన ప్రత్యేక సంచికగా నవంబరు, డిసెంబరు సంచిక వెలువడింది. తెలుగులో వచ్చిన గిరిజనుల జీవితాలనూ, ఆశయాలనూ, ఆకాంక్షలనూ ప్రతిబింబించే సాహిత్యాన్ని తడుముతూ, ఆదివాసీ సామాజిక సాంస్కృతిక జీవనాన్నీ, అడవిబిడ్డల ఉద్యమాలను తెలియచెప్తూ 'అడవి తల్లి బిడ్డల మార్గం' సంపాదకీయాన్ని రాశారు. ఈ సంచికలో హేమన్ డార్ఫ్ రాసిన 'ఆదివాసీ సమస్య – జాతీయ దృక్కోణం', సి. రామ్మోహన్ రాసిన 'గిరిజనుల జీవన సమరం', బాలగోపాల్ రాసిన 'గిరిజనులు – గిరిజన సంస్కృతి', డా॥ కిరణ్మయి రాసిన 'గిరిజన ప్రాంతాల్లో సంతలూ – గిరిజన చైతన్యమూ', ఐక్యత రాసిన 'పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం – మారుతున్న గోండుల సంస్కృతి', గౌతమిపుత్ర రాసిన 'కొండమొదలు గిరిజన ఉద్యమంలో స్త్రీల వీరోచిత పాత్ర' భూపాల్ రాసిన 'సినిమాలో కొమురం భీం – నా అనుభవాలు', సింధు రాసిన 'గిరిజనుల ప్రాణాలను హరించివేస్తున్న కాలుష్య రక్కసి', మహాశ్వేతాదేవి రాసిన 'పశ్చిమ బెంగాల్‌లో గిరిజన భూముల పరాయీకరణ' – వ్యాసాలను ప్రచురించారు. అజ్ఞాతకవి రాసిన 'ఏజెన్సీ పాట', 'పాణిగ్రాహి నీకు జోహార్లు', తడిమి రాసిన 'గోండన్నల గోదు', అడివి రాసిన 'సర్కారును ఎదిరిద్దాం', పి. నాసరయ్య రాసిన 'గిరిజనుడా లెమ్మురా', రాజశేఖర్, ఉ.సాంబశివరావులు రాసిన 'నాగులు మామా' – జనం పాటలను ప్రచురించారు. ఛాయరాజ్ రాసిన 'శ్రీకాకుళం', 'పొత్తిళ్ళలోనే ఉండిపోకు', చెరుకు సుధాకర్ రాసిన 'శిలాజక్రమానికి', జూలూరు గౌరీశంకర్ రాసిన 'అడవి', ఎ.ఎన్ రాసిన 'సెప్టెంబర్ 28', కవితలనూ నూతన్, శశి రాసిన 'అడవి బిడ్డలు' ఒగ్గు కథనూ ప్రచురించారు. చైతన్య రాసిన 'సిలకమ్మ' కథనం, మహాశ్వేతాదేవి రాసిన 'భీకర యుద్ధం తర్వాత', భూషణం రాసిన 'ఉద్ధరింపు' కథలనూ ప్రచురించారు. ఉద్యమ సూర్యుడు 'గోండుల దేవుడు – హేమన్ డార్ఫ్', 'జాత్రా భగత్', 'జెడొంనాంగ్ – రాణి గైడిన్లూ', 'రాజమోహినీదేవి', 'నారాయణసింగ్'లను పరిచయం చేశారు. కార్మికోద్యమానికి కొత్త ఒరవడినిచ్చిన శంకర్ గుహ నియోగిని, వాసిరెడ్డి కృష్ణారావును, కేతవరపు రామకోటి శాస్త్రిని, సుఖదేవ్‌నీ స్మరించుకుంటూ రాసారు. 'సమకాలీనం' శీర్షికలో 'అధికారుల చేతుల్లో అడవి పుత్రుల అగచాట్లు' వ్యాసాన్ని ప్రచురించారు. వెలుగు వాకిళ్ళను తెరిచేందుకై నడుంకట్టిన స్త్రీ విముక్తి' పత్రికను అరుణ సమీక్షించారు. వెరియర్ ఎల్విన్ – 'ఆదివాసుల మౌలికావసరాలు' గురించీ, తరిమెల నాగిరెడ్డి – 'గిరిజన కార్పొరేషన్ల నిర్వాకం' గురించి చేసిన వ్యాఖ్యలను, ఉత్తరాలను ప్రచురించారు. 2, 3 అట్టల మీద మిత్ర రాసిన 'ఇన్నాళ్ళు లేని అయినారు.... వయినారు' జనంపాటనూ, 4వ అట్టమీద మోహన్ గీసిన 'ఆయుధం అందుకున్న గిరిజనుడు' చిత్రాన్ని ముద్రించారు.

పుటలు : 184; 1/8 డెమ్మీ; వెల : 8 రూ॥

## జనవరి 1992 - సంపుటి : 15 - సంచిక : 5

మోహన్ గీసిన 'రాజ్యహింస' ముఖచిత్రంతో, సామ్రాజ్యవాదుల కనుసన్నలలో మెలిగే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) విధించే షరతులను ఎదుర్కోవటానికి పోరాటానికి సంసిద్ధం కావాలంటూ 'స్వాతంత్ర్య పోరాటమే నేటి మన తక్షణ కర్తవ్యం' అనే సంపాదకీయంతో ఈ సంచిక వెలువడింది. కాలువ మల్లయ్య రాసిన దోపిడి (కథ), 'ది ఉండ్స్ ఆఫ్ ఆఫ్రికా' నాటకంపై ఎస్. విశ్వనాథం చేసిన సమీక్ష, రష్యా పరిణామాలపై ప్రశ్నలకు జస్టిస్ కృష్ణయ్యర్, సుధీప్రధాన్, హర్బన్స్ ముఖియా, వావిలాల గోపాలకృష్ణయ్య, భూమన్‌లు ఇచ్చిన సమాధానాలు, 'స్పందన' శీర్షికలో పురుషోత్తం అగర్వాల్ రాసిన 'మృత్యుగంట మోగించే కర్ఫ్యూ' వ్యాసాలను ప్రచురించారు. 'సజీవ సాహిత్యం' శీర్షికలో శ్రీపతి రాసిన 'డాలర్ల కథ'నూ, జూలూరి గౌరీశంకర్ రాసిన 'మరొక్కసారి', బి. రఘు రాసిన 'రమణీయం, అమరత్వం', దర్భశయనం రాసిన 'ఎక్కుపెట్టిన ప్రశ్నల మీదే' కవితలను ప్రచురించారు. పరజ చేసిన 'నిందితుడు' సినిమా సమీక్ష, కె.వి. హనుమంతరావు రాసిన 'గిరిజన నృత్యాలు' వ్యాసం, శ్రీకృష్ణ రాసిన 'బంధం – నిర్బంధం' గల్పిక, ఎథెల్ రోజాబర్గ్ రాయగా సమరశేఖర్ అనువదించిన 'ఫ్రమ్ ది డెత్ సెల్', దివికుమార్ రాసిన 'ఇలా మిగిలాం సమీక్షపై హరి' ఉత్తరం, 'వాడని మందారాలు' శీర్షికలో ఆత్రేయ పాట, కాలంతోపాటు ఎదిగిన డా॥ కేతవరపు రామకోటిశాస్త్రి గురించిన వ్యాసం, 'ధారావాహిక' శీర్షికలో కొత్తపల్లి రవిబాబు అనువదించిన రాల్ఫ్ ఫాక్స్ – 'నవల – ప్రజలు'ను ప్రచురించారు. యమ్. బ్రహ్మయ్య, ఎన్. శ్రీనివాస్ రాసిన 'ఎవ్వడు మంత్రి అయినా' జనంపాట, ఎస్. రాజశేఖర్ రాసిన 'తెలుగు భాషను ప్రజలభాషగా చేయ పోరిన గిడుగు పిడుగు', చైతన్యవాహినితోపాటు 2, 3 కవరుపేజీలలో మిత్ర రాసిన 'నేత కార్మిక' జనంపాట, నాల్గవ కవరుపేజీలో 'సూర్యుడా! నువ్వు తప్పుకో' ఛాయరాజ్ రాసిన కవితనూ ప్రచురించారు.

1/8 డెమ్మీలో 84 పుటలు; వెల : 4 రూ॥ ✦

# స్త్రీలపట్ల కేంద్ర సెకండరీ విద్యాబోర్డు (CBSE) ధోరణి

**చాలా** ప్రైవేటు కార్పొరేటు విద్యాసంస్థలవారు తాము సిబిఎస్ఇ సిలబస్‌తో విద్యాబోధన, పరీక్షల నిర్వహణ చేస్తామని గొప్పగా ప్రచారం చేసుకుంటారు. అంటే వారి సిలబస్ అంత గొప్పగా వుంటుందన్నమాట. నిజమే. వుండవచ్చు. కాని గతనెల (డిసెంబరు 10 – శుక్రవారం) నాడు జరిగిన 10వ తరగతి ఇంగ్లీషు పరీక్షలో Comprehensive passage, (అంటే ఏదో ఒక విషయంపై ఒక పేరా ఇచ్చి దానిలోని విషయం ఎంత అర్థమైందో తెలుసుకోవడానికి ప్రశ్నలు – ఒక్కోసారి Multiple Choice సమాధానాలు ఇవ్వడం)లోని అంశం పితృస్వామిక సమాజపు అవలక్షణాలతో కూడుకొని వుంది. దీనిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాస్వామికవాదులు నిరసన తెలియచేయగా, ఈ ప్రశ్నను తొలగిస్తున్నట్లూ, ఆ ప్రశ్నకు అందరికీ మార్కులు ఇస్తున్నట్లు CBSE ప్రకటించింది. మూడు పేరాల ఆ భాగంలో ఆఖరి పేరాలోని అంశాలు :

"భార్యకు స్వేచ్ఛ (దాస్య విమోచనం) లభించడంతో పిల్లలపై తల్లిదండ్రుల అధికారం నాశనమైంది. పురుషుడిని ఉన్నతస్థానం నుండి దించివేయడానికి భార్య/తల్లి క్రమశిక్షణా సూత్రాలను పోగొట్టుకుంది."..

"గతంలో ఇంటికి భర్త యజమానిగా వున్నపుడు అతని భార్య అతనికి విధేయురాలుగా వుండేది.... పిల్లలు, సేవకులు తమ స్థానాలు తాము గుర్తించి ప్రవర్తించేట్లు నేర్పేవారు."

పై వాక్యాలు రాసిన రచయిత స్వభావాన్ని నాలుగు రకాలుగా చెప్పి సరైన సమాధానాన్ని గుర్తించమన్నారు.

1. పురుషాహంకారం మూర్తీభవించిన పంది
2. అసంతృప్తితో వున్న భర్త
3. తన కుటుంబ సంక్షేమం హృదయంలో నింపుకున్నవాడు
4. జీవితం గురించి పైపైన ఆలోచించేవాడు....

ఇదండీ స్త్రీలపట్ల CBSE వారి ధోరణి! స్త్రీ పురుష సమానత్వం, 33 శాతం స్త్రీలకు రిజర్వేషన్, మహిళా సాధికారకత మొదలైనవన్నీ పైపై సంస్కరణలేనని అర్థమవుతుంది. వ్యవస్థీకృతమైయున్న ఆధిపత్య ధోరణులు ప్రబలంగా కొనసాగుతున్నాయనడానికి ఇదొక ఉదాహరణ.

# ఇప్పుడు హాస్యప్రియత్వమూ, చతురోక్తులూ, వ్యంగ్య విమర్శా దేశద్రోహమే!

**హాస్యప్రియత్వం,** హాస్యాన్ని ఆనందించే శక్తి వున్నవారికి మానసిక ఒత్తిడి వుండదు. మన సాహిత్య సాంస్కృతికరంగాలు పరిశీలిస్తే, నాటకాలలో విదూషక పాత్ర, మహారాష్ట్రలోని 'తమాషా' కళారూపంలో సంభాషణలు, రామలీలా నాటకాల్లో అసభ్య జోకులూ, తోలుబొమ్మలాటలో కేతిగాడు, బంగారక్క పాత్రలు, పిట్టలదొర, బుర్రకథలో హాస్యవంతగాడు మొదలగునవి ప్రత్యక్షమౌతాయి. 'రక్తకన్నీరు' నాటకంలో సమకాలీన సమస్యలపైన, నాయకులపైన నాగభూషణం అశువుగా చెప్పే చతురోక్తులూ, వ్యంగ్యబాణాలూ మనకు సుపరిచితమే. నిజానికి సమాజంలో అన్నీ సక్రమంగా ఉంటే వ్యంగ్యానికీ, హేళనకు అవసరమే వుండదు.

అయితే నేడు వాటిని వాడటమే నేరంగా పరిగణింపబడ్తోంది. మునావర్ ఫరూకీ గుజరాత్‌లోని జునాగఢ్‌వాసి. 29 ఏళ్ళ ముస్లిం యువకుడు. గత మూడేళ్ళ నుండి టిక్కట్లపై హాస్య ప్రదర్శనలు వివిధ రాష్ట్రాల్లో తన బృందంతో ఇస్తున్నాడు. గత సంవత్సరం అతని యూట్యూబ్ ఛానల్‌లో 5 లక్షల మందికిపైగా శ్రోతలు వున్నారు. అతని పేరడీ పాటల్లోగానీ, ఇతర ప్రదర్శనల్లో గానీ వ్యంగ్య బాణాలూ, చతురోక్తులూ, హేళనలూ, ఎత్తిపొడుపులూ, వెక్కిరింపులు, ఎగతాళి మొదలైనవాటితో వర్తమాన సామాజిక సమస్యల గురించి చెప్తాడు.

ఫరూకీని 2021 జనవరి 1న ఇండోర్ (మధ్యప్రదేశ్) పోలీసులు 'హిందూ దేవతలను అవమానిస్తున్నా'డనీ, 'మతపరంగా ప్రజలను రెచ్చగొడుతున్నాడనీ' ఆరోపించి అరెస్టు చేశారు. అయితే వాటికి సాక్ష్యాధారాలు చూపలేకపోవడంతో సుప్రీంకోర్టు ఫిబ్రవరి 5న బెయిల్ ఇచ్చింది. నిజానికి ఇండోర్‌లో ఇచ్చిన కార్యక్రమంలో పోలీసులు ఆరోపించినవేవీ లేవు. కాని ఇండోర్‌కు చెందిన బి.జె.పి. శాసన సభ్యురాలి (మాలినీగౌడ్) కొడుకు, వారి రిహార్సల్ రహస్యంగా విన్నాననీ, నేరపూరితమైన సంభాషణలు వున్నాయనీ చెప్పగా ఒక హిందుత్వ గ్రూపు విజ్ఞప్తికి పోలీసులు స్పందించి అరెస్టు చేశారు.

గత రెండు నెలల కాలంలో ఫరూకీ ప్రదర్శనలు పన్నెండుసార్లు రద్దయినాయి. బెంగుళూరులో గత ఏడాది మూడుసార్లు ప్రదర్శన ఇచ్చారు. ఈ ఏడాది అనుమతి నిరాకరించారు. హిందూ జాగరణ సమితి, జైశ్రీరామ్‌సేనవారు ఈ 28-11-2021 నాటి ప్రదర్శనకు అభ్యంతరం తెలియచేయగా ప్రదర్శన రద్దు చేశారు. గోవాలో ప్రదర్శనశాలలను తగలబెడ్తామని బెదిరించారు. మధ్యప్రదేశ్, రాయ్‌పూర్‌లో రెండు ప్రదర్శనలు ఇచ్చారు. బిజెపి అధికారంలో వున్న కర్నాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోనే ఈ ఆటంకాలు సృష్టింపబడుతున్నాయి.

వీరితో విసుగుచెందిన ఫరూకీ ఇటీవల తన హాస్య ప్రదర్శనలకు స్వస్తి పల్కుతానని ప్రకటించాడు. ఇలా వేధించినందుకే 2015లో తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ తన సాహిత్య వ్యాసంగానికి భరతవాక్యం పలుకగా, కోర్టువారు ఇచ్చిన భరోసాతో ఆ తర్వాత మరల రచనలు చేస్తున్నాడు.

# శంభాజీ బ్రిగేడ్ వారి దుశ్చర్య!

**మరాఠీ** దినపత్రిక 'లోక్‌సత్తా' సంపాదకుడు చరిత్ర గ్రంథాల రచయిత ఐన గిరీష్ కుబేర్‌ను డిసెంబర్ 5వ తేదీన శంభాజీ బ్రిగేడ్ అని చెప్పుకుంటున్న మతోన్మాదులు దాడిచేసి ఆయనపై సిరా గుమ్మరించారు. 94వ అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనం ముగింపు సందర్భంగా ఒక సింపోజియంలో పాల్గొనడానికి ఆయన నాసిక్‌లోని సభా ప్రాంగణానికి రాగా, వేదిక వెనుక నించున్న ఆయన మీద ముగ్గురు వ్యక్తులు సిరా వెదజల్లగా అది ఆయన ముఖం మీద, తలపైన, చొక్కాపైన పడింది. అక్కడే వున్న పోలీసులపై కూడా పడింది.

గిరీష్ కుబేర్ రాసిన "Renaissance state : The unwritten story of the Making of Maharashtra" పుస్తకంలో ఛత్రపతి శంభాజీ మహరాజ్ గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్నది వారి ఆరోపణ. ఈ పుస్తకాన్ని నిషేధించాలని వారు ఆందోళన చేశారు.

చరిత్రలో కొన్ని వాస్తవాలు మనకు చేదుగా వున్నా వాటిని చరిత్రగా పరిగణించాలేగాని చరిత్ర మన ఇష్టాఇష్టాలకనుగుణంగా వుండాలనడం మూర్ఖత్వం. 2004లో జేమ్స్ డబ్ల్యు లెయిన్ అనే పరిశోధకుడు 'Shivaji : Hindu King in Islamic India'లో శివాజీ తండ్రి గురించి రాసిన వాస్తవాలు భరించలేక, ఈ వాస్తవాలకు ఆధారం లభించిన పూనేలో వున్న భండార్కర్ ఓరియంటల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌పై దాడిచేసి అత్యంత విలువైన గ్రంథాలను చెల్లాచెదరు చేసారు. లెయిన్ (Laine) రాసిన పుస్తకాన్ని నిషేధించాలన్నారు. తమకు అభ్యంతరకరంగా వున్న పేజీలను తొలగించాలన్నారు. ✦

కవిత

## వేట

– సిరికి స్వామినాయుడు

**ఏడాదికోసారి** అడవిగూడేలకి
చెంగుచెంగున దుముకుతూ వస్తుందీ పిల్లిపండగ !
అంతవరకూ కొండపోడుకి మల్లు జెప్పిన గూడ
సందడికి చిరునామాగా మారిపోతుంది !
మాపటేలకు మాయపండగను దెస్తాడు జన్నోడు !
గూడేంలో ఇంకా మూల కూర్చోని కన్నెపిల్లకు
తాలారా మబ్బులతో నీళ్లాడించి..
పొద్దుగిన్నెలో పసుపురాసి
పొడిచే సూరీడ్ని బొట్టుగా బెట్టి
అడవిపూల బుట్టలా అలంకరించి
జాతరమ్మకు మొక్కు దీరుస్తాడు యజ్జోడు !

పూజయ్యాక.. విల్లమ్ములు చేతపట్టి
వేటకు పోతుంది గూడెం గూడెమంతా..!
సెమర పిల్లో.. అడవిపందో.. ఏదైతేనేమి
వేట దొరికితేగానీ గూడేనికి ముఖం చూపరు వాళ్లు !
పంచుకున్న వేటకూరతో నెగళ్లచుట్టూ చేరీ..
అనాది ఆదిమగీతాలకు ఆయువుపోస్తూ
పుర్రతో పోసుకున్న జీలుగు మత్తులో
ఉగాడుతుంది గూడ ఆ రోజంతా..!
మరుసటి దినాన మల్లుకు మల్లుజెప్పి
జిగ్గిని చేతపట్టి కొండపోడుమీదకి
చెమటవాగులై కదిలిపోతారు వాళ్లు !

కార్పోరేట్ మబ్బులేవో..
గూడలమీద కమ్ముకుంటున్న వేళ
కాళ్ల కింద కొండలు కదనబారుతున్న వేళ
యివాల పిల్లుల్ని గాదు
కొండల్లో కలియదిరిగే పెద్దపులుల్ని వేటాడేందుకు
విల్లమ్ములు ఎక్కుపెడుతోంది అడవి !! ✦

## పి.జీవరత్నం (చిన్ని)
## 6వ వర్థంతి



జననం : 28-12-1982

మరణం : 14-11-2015

**14** నవంబరు 2015న తన 35వ ఏటనే, డెంగ్యూ జ్వరంతో అకాల మరణం చెందిన పి.జీవరత్నం పసిపిల్లల ప్రేమికుడు. ఎక్కువ సమయం పిల్లలతో గడిపేవారు. అనేక సాంఘిక కార్యక్రమాలతో స్వచ్ఛందంగా సేవలందించేవారు. బాలసదన్లకూ, పాఠశాలలకూ ఆర్థిక సహకారం అందచేసేవారు.

బిసిఎ, ఎం.ఎస్.సి. కోర్సులు చదివిన జీవరత్నం శ్రీకాకుళంజిల్లా వసుంధర గ్రామానికి చెందినవారు. పూణే ప్రాంతంలో జన్‌సార్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా చేశారు.

ఆయన జ్ఞాపకార్థం ఆయన తల్లి లక్ష్మి, తండ్రి దండాసి, భార్య సౌమ్య, కుమారుడు దైవిక్, అన్న మోహనరావు, వదిన వాణి, పెద్దక్క బి.ఉషారాణి, చిన్నక్క ఆర్.జయలక్ష్మిగార్లు ప్రజాసాహితి శాశ్వతనిధికి జీవరత్నం రెండవ వర్థంతినాడు 25 వేల రూపాయలు అందచేశారు.

జీవరత్నం మరణానికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ✦

# చైతన్యవాహిని

**07-11-2021** ఆదివారం సాయంత్రం జనసాహితి విశాఖజిల్లా శాఖ నిర్వహణలో నోబెల్ సాహిత్య బహుమతి (2021) గ్రహీత అబ్దుల్ రజాక్ గుర్నా జీవితం – సాహిత్యం అనే అంశంపై సమావేశం నిర్వహించబడింది. తెలుగు అధ్యాపకులు తన్నీరు నాయబ్‌రసూల్ గారు అబ్దుల్ రజాక్ గుర్నా సాహిత్య కృషిని గురించి వివరించారు. తన మాతృభాష స్వాహిలి అయినప్పటికీ, జాంజిబార్ విప్లవ నేపథ్యంలో ఆయన ఇంగ్లాండుకు చేరుకుని ఆంగ్లంలోనే చదువుకున్నారని, సాహిత్య సృజన కూడా ఆంగ్లంలోనే చేశారని, ఆయన చేసిన సాహిత్య కృషిని గురించి వివరించారు.

**నవంబర్ 30** గురజాడ వర్ధంతి సందర్భంగా విశాఖజిల్లా చోడవరంలో జనసాహితి నిర్వహణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. గురజాడ – వ్యావహారిక భాషాఉద్యమం, గురజాడ – కన్యాశుల్కం నాటకం, గురజాడ – దేశభక్తి, గురజాడ – హేతువాద దృక్పథం, గురజాడ – మహిళావికాసానికై చేసిన కృషి, గురజాడ – బాలసాహిత్యము మొదలగు అంశాలుగా గురజాడ అప్పారావు చేసిన కృషిని పిల్లలకు ఒక్కో అంశము పదిహేను నిమిషాలకు మించకుండా వివరించాలని జనసాహితి సభ్యులు నిర్ణయించుకుని, కార్యక్రమం నిర్వహించారు. చోడవరం పట్టణంలోని సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు.

**30-11-2021**న తెనాలిలోని బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్‌వారి హాలులో గురజాడ 106వ వర్ధంతిని జనసాహితి, గుంటూరుజిల్లా శాఖ, అభ్యుదయ కళాసమితి సంయుక్తంగా నిర్వహించాయి. గురజాడ 'దేశభక్తి' గేయం ప్రారంభ గీతంగా బెన్‌హర్ పాడారు. ఐనాల మల్లేశ్వరరావు తను రాసిన పద్యంలో గురజాడ కృషిని చెప్పారు. మతం, కులం విషయంలో గురజాడ దృక్పథాన్ని బెన్‌హర్ వివరించారు. పాతూరి సుబ్రహ్మణ్యం గురజాడ రచనలను సమీక్షించారు. కవయిత్రి అస్మతున్నీసా గురజాడ కథలలోని విశిష్టతను, 'కన్యాశుల్కం'లో మధురవాణి పాత్ర గురించి చెప్పారు. రంగిశెట్టి రమేశ్, యం.వి. రఘునాధరావు, నందూరి నారాయణరావు, చందు సుబ్బారావు, .................. మాట్లాడిన తర్వాత 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు గురజాడను ఈనాటికీ సజీవంగా వుంచిన ఆయన రచనల గురించీ, వ్యావహారిక భాషా ఉద్యమానికి ఆయన చేసిన కృషి గురించీ వివరించారు.

**22-12-2021**న నెల్లూరుజిల్లా వెంకటగిరిలో చెంజి కాళప్పగారి సంస్మరణసభ జరిగింది. ఈ సభలో జనసాహితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ జి.వి. కృష్ణయ్య మాట్లాడుతూ కాళప్పగారు 13-12-2021న అనారోగ్యంతో చనిపోయేంతవరకూ ప్రజాతంత్రవాదిగా, చుట్టుప్రక్కల గ్రామాలలో ఆయుర్వేద వైద్యం చేస్తూ నిరాడంబరంగా జీవించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ అభిమానులుగా వుంటూ కాళహస్తి శేషయ్య, బీరం రామనాథం, చెంజి నాగభూషణం, ఎన్.వి. కృష్ణయ్యగార్ల కృషికి సహాయ సహకారాలు అందించారన్నారు. వెంకటగిరి పంచాయితీ వార్డు సభ్యులుగా పనిచేశారని, ఆ ప్రాంతంలో పెత్తందారీ దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన అన్ని రకాల రైతాంగ, కార్మిక రైతాంగ, కార్మిక, ప్రగతిశీల, ప్రజాతంత్ర ఉద్యమాలకు తోడ్పాటునందించారన్నారు. 'ప్రజాసాహితి' పాఠకులూ, జనసాహితి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన చెంజి కాళప్పగారికి జోహార్లు తెలియచేశారు. ఇంకా ఈ సభలో వెంకటగిరి పౌరసమితి సభ్యులు, న్యాయవాది గిరిజాకుమారి, కె. ప్రసాద్, పి. గౌస్, సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు ఎల్. లక్ష్మారెడ్డి, రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి జి. సునీత జిల్లా నాయకులు వి.వి. రమణయ్య, న్యాయవాది జయప్రకాశ్, ఏ.పీ.పీ.. జె. ప్రకృతి కుమార్, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు చిన ఓబయ్య, తారక రామయ్య, విశ్రాంతి ఉపాధ్యాయులు దశయ్య తదితరులు పాల్గొని చెంజి కాళప్పగారికి జోహార్లు తెలియచేశారు. ✦

## జాతి వివక్షా విధానానికి రాజీలేని శత్రువు డెస్మాండ్ టుటు మరణం

**1984**లో నోబెల్ శాంతి బహుమతినందుకున్న దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ ఆర్చి బిషప్, జాతి వివక్షా విధానానికి వ్యతిరకంగా అహింసాయుతంగా పోరాడిన డెస్మాండ్ టుటు తన 90వ యేట 26-12-2021న కేప్‌టౌన్‌లో ప్రొస్టేట్ కాన్సర్‌తో మరణించారు. ఆయన 1931 అక్టోబర్ 7న జోహాన్స్‌బర్గ్‌కు 170 కిలోమీటర్ల దూరాన వున్న క్లెర్క్స్‌డ్రాప్‌లో జన్మించారు. తల్లి అంధుల పాఠశాలలో వంటమనిషి. తండ్రి ఉపాధ్యాయుడు. సెకండరీ స్కూలు విద్య అనంతరం తన తండ్రి హెడ్‌మాస్టర్‌గా వున్న స్కూలులో ఉపాధ్యాయునిగా చేరి, మూడేళ్ళ తర్వాత నల్లజాతి విద్యార్థుల పట్ల వివక్ష చూపించిన 'బంటు విద్య చట్టాన్ని' నిరసిస్తూ, 1958లో రాజీనామా చేశారు. ఆ తర్వాత 1962లో లండన్ వెళ్ళి మతశాస్త్రం చదివి 1966లో దక్షిణ ఆఫ్రికాలో మతశాస్త్ర ఉపాధ్యాయునిగా చేరారు. శ్వేతజాతి ప్రభుత్వపు జాతివివక్షా పాలనకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేశారు. నల్లజాతి ఆర్చి బిషప్‌గా, దక్షిణ ఆఫ్రికాలో తెల్లవారి ప్రభుత్వంపై ఆర్థిక ఆంక్షలు ప్రకటించారు. సహాయ నిరాకరణ ఉద్యమం చేశారు.

నెల్సన్ మండేలా విడుదల తర్వాత 1994లో జరిగిన మొదటి ప్రజాస్వామిక ఎన్నికలలో ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆహ్వానిస్తూ, వివిధ తెగలు వున్న మనదేశం "సప్త వర్ణాలు వున్న ఇంద్ర ధనస్సు"లాంటిది అని అభివర్ణించారు. అసమానతలను, హింసను, అవినీతిని అరికట్టలేని నల్లజాతి స్వతంత్ర పాలనను తీవ్రంగా విమర్శించారు. మండేలా ప్రభుత్వం విధానాలు ఒక గుప్పెడు మందిని కుబేరులుగానూ, అసంఖ్యాక ప్రజలను దరిద్ర దామోదరులుగానూ మిగుల్చుతోందని ప్రకటించారు. ఏదో ఒకరోజు మనం ఈ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఓటమి కోరుతూ ప్రార్థనలు చేయాల్సి వస్తుందన్నారు. అసంఖ్యాక నల్లజాతి ప్రజలూ, అత్యల్ప తెల్లజాతివారూ టుటూను 'జాతి అంతరాత్మ'గా పరిగణించి గౌరవించారు. వారికి జనసాహితి నివాళులర్పిస్తోంది. ✦




**ముందడుగు : కవిత్వం**

రచన : అడిగోపుల వెంకటరత్నమ్.

1/8 డెమ్మీలో 132 పుటలు. వెల : రూ.100/– మొదటిముద్రణ : సెప్టెంబర్ 2017. ప్రతులకు : ప్రజాశక్తి, విశాలాంధ్ర విజయవాడ శాఖలలో.

**పల్లెపూల వాన, బాల్యం బతుకు కథలు :**

రచయిత : బెల్లంకొండ సంపత్‌కుమార్

1/8 డెమ్మీలో 85 పుటలు. వెల : రూ.50/– మొదటిముద్రణ : జనవరి 2017. ప్రచురణ : తెలంగాణ బాల సాహిత్య పరిషత్, హైదరాబాద్. ప్రతులకు : డా॥ భూపాల్, అధ్యక్షులు బాలసాహిత్య పరిషత్, 301–ఏ, రాయల్ స్క్వేర్ అపార్టుమెంట్, 5 ఫేస్, కె.పి.హెచ్.బి. కాలనీ, హైదరాబాద్ – 500072. తెలంగాణ. సెల్ : 98662 04260.

**Understanding Finnish Education System :**

Compilation by D. Madhusudan Rao

1/8 డెమ్మీలో 48 పుటలు; వెల : ఉచితం. మొదటిముద్రణ : డిశంబర్ 2019. ప్రచురణ : దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్, తెన్నేరు – 99890 51200.

**ఈ కాలమ్ కథలు :**

రచయిత : చలపాక ప్రకాష్

1/8 డెమ్మీలో 64 పుటలు; వెల : రూ.60/– మొదటిముద్రణ : డిశంబర్ 2019. ప్రచురణ : చలపాక ప్రకాష్, ఇం.నెం. 1–4/3–36, సంజయ్‌గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ – 520012. ఆంధ్రప్రదేశ్. ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలలో

**ఆదివాక్యోదాహరణము : (పద్యకావ్యము)**

రచన : కొణతం నాగేశ్వరరావు

1/8 డెమ్మీలో 32 పుటలు. వెల : రూ.40/– మొదటిముద్రణ : డిశంబరు 2020. ప్రతులకు : లూథర్స్ బుక్‌హౌస్ (ప్రబోధ), ఎఇఎల్ చర్చి కాంపౌండ్, బ్రాడిపేట, గుంటూరు – 522002. ఫోన్ : 94402 01035.

**కారల్‌మార్క్స్ – తత్త్వశాస్త్ర దారిద్ర్యం (The Poverty of Philosophy) :**

తెలుగు అనువాదం : వై.వి. రమణరావు

1/8 డెమ్మీలో 352 పుటలు. వెల : రూ. 250/– మొదటిముద్రణ : సెప్టెంబర్ 2019. ప్రచురణ : వై.వి. రమణరావు, ఇంటి.నెం. 15–8–967, మమత హాస్పిటల్ రోడ్, వరదయ్య నగర్, ఖమ్మం – 507002. తెలంగాణ. ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలలో.

**రామిశెట్టి రోశయ్యగారి రచనలు**

**రుక్కు కవితలు (వచన కవితలు–1) :**

1/8 డెమ్మీలో 130 పుటలు. వెల : రూ.100/–
మొదటిముద్రణ : డిశంబరు 2016.

**రుక్కు కవితలు (వచన కవితలు–2) :**

1/8 డెమ్మీలో 114 పుటలు. వెల : రూ.100/–
మొదటిముద్రణ : డిశంబరు 2016.

**పోరాటమే విజయం (వచన కవితలు–3) :**

1/8 డెమ్మీలో 95 పుటలు. వెల : రూ.100/–
మొదటిముద్రణ : జనవరి 2020.

**సమతకు పట్టం ఖాయం (వచన కవితలు–4) :**

1/8 డెమ్మీలో 112 పుటలు. వెల : రూ.100/–
మొదటిముద్రణ : జనవరి 2020.

**రుక్కు నానీలు :**

1/8 డెమ్మీలో 59 పుటలు. వెల : రూ.60/–
మొదటిముద్రణ : ఏప్రిల్ 2017.

**రుక్కు నానీలు–3 :**

1/8 డెమ్మీలో 62 పుటలు. వెల : రూ.100/–
మొదటిముద్రణ : మార్చి 2020.

**అల్పసంతోషి : కథల సంకలనం**

1/8 డెమ్మీలో 166 పుటలు. వెల : రూ. 100/–
మొదటిముద్రణ : మార్చి 2020.

**సంఘం శరణం గచ్ఛామి : (కథల సంపుటి–3)**

1/8 డెమ్మీలో 95 పుటలు. వెల : రూ.100/–
మొదటిముద్రణ : మార్చి 2020.

పై పుస్తకాలన్నీ దొరుకుచోటు : రామిశెట్టి రోశయ్య, సుందరయ్య నగర్, మధిర, ఖమ్మంజిల్లా. ఫోన్ : 75978 95426

**బాలల కోసం బాటసారి పదాలు : కవితలు**

రచన : దర్భశయనం శ్రీనివాసాచార్య.

1/8 డెమ్మీలో 70 పుటలు; వెల : రూ.60/– మొదటిముద్రణ : జనవరి 2020. ప్రచురణ : 'స్పందన' అనంతకవుల వేదిక, అనంతపురం. ప్రతులకు : వి. చంద్రశేఖరశాస్త్రి, కవన కుటీరం, 1–2–920–2, ఫ్లాట్ నెం. 24, సోమనాథ్‌నగర్, అనంతపురం – 515004. మరియు దర్భశయనం శ్రీనివాసాచార్య, ఆంధ్రాబ్యాంక్ అపెక్స్ కాలేజి, ప్లాట్ నెం : 27–29, ఫినాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి, హైదరాబాద్–500032 మరియు తెలంగాణలోని ప్రముఖ పుస్తక దుకాణాల్లో.

**విశ్వభాష తెలుగు వినురవేమా – తెలుగువారి కోసం, తెలుగువాడి కోసం :**

రచయిత : పొత్తూరు రంగనాయకులు

1/8 డెమ్మీలో 125 పుటలు. వెల : రూ.100/– మొదటిముద్రణ : డిశంబర్ 2020. ప్రచురణ : గీతాంజలి ప్రచురణలు, 33–5–27,

పాపయ్యవీధి, సీతారాంపురం, విజయవాడ-520002. ప్రతులకు : పల్లవి పబ్లికేషన్స్, 59-1-23/2, అశోక్‌నగర్, విజయవాడ-520010. ఫోన్ : 9566115655.

**కాలం నేర్పిన పాఠం - కరోనా కథలు : (కథాసంపుటి)**

రచన : శిరంశెట్టి కాంతారావు

1/8 డెమ్మీలో 118 పుటలు. వెల : రూ. 100/- మొదటిముద్రణ : జనవరి 2021. ప్రతులకు : ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ పుస్తకాల షాపుల్లో. రచయిత చిరునామా : శిరంశెట్టి కాంతారావు, ఇం.నెం. 1-1-177, మమలకోవెల, శ్రీనివాసపురం కాలనీ, పాత పాల్వంచ - 507115. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. తెలంగాణ రాష్ట్రం. ఫోన్ : 98498 90322, 63000 25783.

**యానాంలో ఒకరోజు : (కథలు)**

రచన : అంపశయ్య నవీన్

1/8 డెమ్మీలో 142 పుటలు. వెల : రూ. 200/- మొదటిముద్రణ : డిశంబరు 2020. ప్రచురణ : ప్రత్యూష ప్రచురణలు, వరంగల్. ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్. ఫోన్ : 040 24652387. నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్. ఫోన్ : 040 24224458.

**విద్యార్థులతో నా అనుభవం :**

సంకలనం : ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి

1/8 డెమ్మీలో 44 పుటలు. వెల : రూ. 55/- మొదటిముద్రణ : 14 నవంబర్ 2020. ప్రచురణ : లచ్చపేట్, జి॥ సిద్దిపేట, తెలంగాణ - 502103. ప్రతులకు : ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి, సహోపాధ్యాయుడు (తెలుగు), జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, లచ్చపేట్, దుబ్బాక (మం), సిద్దిపేట (జిల్లా), తెలంగాణ - 502103. ఫోన్ : 99082 40768.

**నేను ముంబైకర్‌ని..! :**

రచన : సంగెవేని రవీంద్ర

1/8 డెమ్మీలో 56 పుటలు. వెల : రూ. 100/- మొదటిముద్రణ : 2020. ప్రచురణ : తెలుగు రైటర్స్ అసోసియేషన్, మహారాష్ట్ర (త్వమ్). ప్రతులకు : సి.వి. కాంపౌండ్, 7/4, హనుమాన్ లేన్, లోయర్ పారెల్, ముంబై-400013. మరియు ప్రముఖ పుస్తక దుకాణాల్లో.

**వేమన పద్యాలు :**

వ్యాఖ్యానం : ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

1/8 డెమ్మీలో 130 పుటలు. వెల : రూ. 100/- మొదటిముద్రణ : 2020. ప్రచురణ, ప్రతులకు : మెంబర్ సెక్రటరీ మరియు రిజిస్ట్రార్, సి.పి.బ్రౌన్ భాషాపరిశోధనా కేంద్రం, యోగివేమన విశ్వవిద్యాలయం, 1-1254, సి.పి.బ్రౌన్‌రోడ్డు, యర్రముక్కలపల్లి, కడప - 516004. ఫోన్ : 08562 - 255517.

**అతడే అలిగిన్నాడు.... : (కవిత్వం)**

రచన : నూటెంకి రవీంద్ర

1/8 డెమ్మీలో 147 పుటలు. వెల : రూ. 200/- మొదటిముద్రణ : 14 జనవరి 2021. ప్రచురణ : జీవనది ప్రచురణలు. ప్రతులకు : నూటెంకి రవీంద్రభారతి, 6-115/1, అంకతివాడ లక్షెట్టిపేట - 504215, మంచిర్యాల జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

**జమానా : (రన్నింగ్ కామెంట్రీ)**

రచన : బి.ఎన్.బి.

1/8 డెమ్మీలో 99 పుటలు. మొదటిముద్రణ : 2019. ప్రచురణ : దర్శా ప్రచురణలు, నిజామాబాద్. ప్రతులకు : జి-4, బిస్వా రెసిడెన్సీ, వినాయక్‌నగర్, నిజామాబాద్, మల్లిఖార్జున ఎంటర్‌ప్రైజెస్, కుమార్‌గల్లి, నిజామాబాద్ (తెలంగాణ). ఫోన్ : 77023 07678.

**తెలుగు ధీర త్రిశతి : (పద్య కవిత్వం)**

రచన : పొన్నాడ వరాహ నరసింహులు.

ప్రచురణ : విశ్వసాహితి, ఆముదాలవలస - 532185, శ్రీకాకుళం జిల్లా. ప్రతులకు : పి.వి. నరసింహులు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, సాహితినగర్, బి.ఆర్. నగర్, ఆముదాలవలస - 532185, శ్రీకాకుళంజిల్లా.

**కందిలి మరికొన్ని కవితలు :**

రచన : లేదాళ్ళ రాజేశ్వరరావు

1/8 డెమ్మీలో 184 పుటలు. వెల : రూ. 100/- మొదటిముద్రణ : ఆగస్టు 2020. ప్రచురణ : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ప్రతులకు : లేదాళ్ళ జయ రాజేశ్వరరావు, ఇం.నెం. 6-41/3, అంకతివాడ, లక్షెట్టిపేట - 504215, మంచిర్యాల జిల్లా, తెలంగాణ. మరియు పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్ : 040-27678430, 98487 87284. మరియు నవచేతన, నవోదయ, నవతెలంగాణ, ప్రజాశక్తి పుస్తకాల షాపుల్లో

**ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు - విమర్శనాత్మక వ్యాసాలు :**

రచన : సాగర్ శ్రీరామ కవచం

1/8 డెమ్మీలో 135 పుటలు. వెల : రూ. 200/- మొదటిముద్రణ : జూన్ 2020. ప్రచురణ : నవ్యాంధ్ర రచయితల సంఘం, విజయవాడ. ప్రతులకు : ఉషారాణి శ్రీరామకవచం, ఇం.నెం. 8-1-41(03-05-421) జమ్మిచెట్టుబజార్, లాయర్‌పేట(పోస్టు), ఒంగోలు-523002. ప్రకాశంజిల్లా. ఫోన్ : 98854 73934, 91216 83515.

**లోచన - బహుజన వ్యాసాలు :**

రచన : చల్లపల్లి స్వరూపరాణి

1/8 డెమ్మీల 183 పుటలు. వెల : రూ. 180/- మొదటిముద్రణ : 14 ఏప్రియల్ 2020. ప్రచురణ : సిక్కోలు బుక్‌ట్రస్ట్, ఎంఐజి-100, జిల్లాపరిషత్ ఎదురుగా, ఎపిహెచ్‌బి కాలనీ, శ్రీకాకుళం-532001. ప్రతులకు : 99892 65444.

**కళింగాంధ్ర తేజం "ఫైర్ బిగ్రేడ్" పుల్లెల శ్యామసుందరరావు జీవితం :**

రచన : డా॥ కె. ముత్యం.

1/8 డెమ్మీలో 184 పుటలు. వెల : రూ. 200/- మొదటిముద్రణ : జనవరి 2020. ప్రచురణ : దృష్టి ప్రచురణ, హైదరాబాద్. ప్రతులకు : డా॥ కె. ముత్యం, ఫ్లాట్ నెం. 42, గుల్‌మొహర్ పార్కు కాలనీ, శేరిలింగంపల్లి, హైదరాబాద్-500019. ఫోన్ : 94403 99796. **(ఇంకా వున్నాయి)** ✦

కవిత

# ఆత్మ నిర్భరత

హిందీ మూలం : సంపత్ సరళ్ — తెలుగు అనువాదం : వేములపల్లి రాధిక

"విదేశీయులారా రండి!
మా దేశాన్ని స్వావలంబిత దేశంగా మార్చండి!"

ప్రధాన సేవకుడు...
'లోకల్' నుండి 'ఓకల్'కు మారి
మనకు 'హోమ్‌వర్క్' ఇస్తే
పనీపాటా లేని ఆయన భక్తులు
చౌక్కా చేతులు మడిచి రంగంలోకి దిగారు
తాళాలు, తప్పెట్లు గానా బజానాలతో!

ఒక కుహనా జాతీయవాది
తన చైనీస్ మొబైల్ నుండి
నా కొరియన్ మొబైల్‌కు
        ఇంగ్లాండు రాజభాషలో
        అమెరికన్ వాట్సప్ ద్వారా
నాకొక సందేశాన్ని పంపాడు...
"భారతదేశాన్ని స్వావలంబన దేశంగా మారుద్దామని"
నేననుకున్నాను... ఆ సందేశాన్ని
చైనాలో తయారై వచ్చిన
సర్దార్ పటేల్ "స్టాట్యూ ఆఫ్ యూనిటీ"కి ఫార్వర్డ్ చేద్దామని!
కానీ మనకు తెలుసుగా
"విగ్రహాలు సందేశాలు చదవలేవు" అని...
అందుకే ఫార్వర్డ్ చేయలేదు మరి.

"రెక్కలు సాచిన వికాసంతో
'సువర్ణ విహంగం'గా భారత్‌ను మలుస్తాం!"
ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన గొప్పలివి...

"ఈ భూగోళంపై 'విశ్వగురు' స్థానంలో
        భారతదేశాన్ని తీర్చిదిద్దుతాం!"
అధికారం చేజిక్కిన వెంటనే పల్లించిన మాటలివి...

"మన దేశమింతా ఆత్మనిర్భరతను సాధించాల్సే ఉంది"
నేటి ప్రవచనమిది...
ఇదేమి గందరగోళం?
ప్రశ్నార్థకంలా నేనిప్పుడు!

"సంవత్సరమంతా సైన్స్ చదివి
చివరి పరీక్షల్లో పొలిటికల్ సైన్స్ పేపర్
రాయాల్సి వస్తే బిక్కమొహమేసిన విద్యార్థిలా"

51 శాతం ఎఫ్‌డిఐ ఉంటే
కొంపలంటుకు పోయినట్లు నింగీ నేలా ఏకం చేసినవాళ్ళు
అధికారంలోకి రాగానే
వంద శాతం ఎఫ్‌డిఐ అమలుచేస్తారు!

అక్కడక్కడా గొంతుకలు ధ్వనిస్తున్నాయి
"చర్ఖావాలే దేశాన్ని ఏ కబంధ హస్తాల నుండి విడిపించారో
ఛాయ్‌వాలే తిరిగి వాళ్ల చేతుల్లో పెట్టారో"ని

స్వదేశీ జాగరణ్ మంచ్ పెద్దమనిషొకడు
ఫిర్యాదు చేస్తున్నాడు....
"మేం స్వదేశీ నినాదంతో
గద్దెనెక్కించినోళ్ళు సింహాసనమెక్కిస్తే...
విదేశీ కంపెనీల కోసం
దేశాన్ని ప్రైవేటుపరం చేయడంలో
మునిగి తేలుతున్నార"ని

ఇంటింటా తిష్ట వేసుకొనుంది మల్టీనేషనల్
ప్రశ్నిస్తే మాత్రం ముద్ర యాంటీ నేషనల్

అలసిపోయాం అందరికన్నా ఎక్కువగా!
అయినా తెలియుంది ఏముందిలే!
మనకో సామెత ఉంది కదా
        "కుంటి దెయ్యం ఇంట్లోవాళ్ళనే
        ముందు మింగేస్తుందని!"

దిక్కూ మొక్కులేని జనం లక్షల్లో
రోడ్డెమ్మట సాగి సాగి పోతూ ఉంటే
"వాళ్ళ రక్తమోడిన 'పాదాలు' నేలపై పొర్లాడుతున్నాయి.
పట్టని పాలకుల 'బుద్ధి' అదే నేలన చతికిలబడింది.
బాధితుల గోడు అణుమాత్రం లేని
ప్రధాని అర్థగంట 'వాణీ విలాసం'
ఏమంటారు దాన్ని?
వాగాడంబరాన్ని శుద్ధ హిందీలో వాణీ విలాసమంటారు!

ఇక ఆర్థికమంత్రి రిలీఫ్ ప్యాకేజ్ .....
పాలు పొంగుతుంటే గ్యాస్ కట్టేయకుండా
తలుపులు మూసే ఇల్లాలి తెలివితేటల్లా!

గుర్తుంచుకోండి!
ప్రవహించే ఈ లక్షల పాదాలు
మీ అధికార దర్పం కోల్పోయిన తర్వాత
జీవితాంతం వెంటాడే బాణాలు చరిత్రే సాక్ష్యం!
భూమి దద్దరిల్లేలా రథాలపై సవారీ చేసినోళ్ళు...
కాలం తిరగబడ్డప్పుడు...
ఆ రథ చక్రాల కిందనే నలిగిపోయారు.

"భారతదేశం ఆత్మ నిర్భరత సాధించింది"
ఈ వార్త బిల్‌గేట్స్ నోటింట...
మన చెవులకెంతో ఇంపు!

శరద్‌జోషి ముందే చెప్పాడు...
మన ఆర్థికశాఖ కార్యాలయం ముందు
కొలంబస్ విగ్రహం ప్రతిష్ఠించాలని అనుకొంటోందని
"ఒకవేళ కొలంబస్ అమెరికాని
కనుక్కొని ఉండకపోతే...
మనం అప్పెక్కడ నుండి తెచ్చుకోగలం మరి?"

PRAJA SAAHITI January 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI